
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
ాలు
-1957
PATRIKA
TED WEEKLY



శివపార్వతులు

ఫోటో: [illegible]



"పళ్లమ్మి"

చిత్రకారుడు : వడ్లమాని మధుసూదనరావు

[హైదరాబాదులో జరిగిన అఖిలభారత చిత్రకళా ప్రదర్శనంలో ద్వితీయ బహుమానం పొందినది.]

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 18
2-1-57

దుర్ముఖ పుష్య శుద్ధ ప్రథమ బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం : వైజయంతీమాల.

ఇంతలో నే "లక్ష్మీనారాయణ! లక్ష్మీనారాయణ" అంటూ గడపదాటి వచ్చిన శ్రేష్టికి రికార్డుప్లేటును ఆసనంగా చూపారు కరణంగారు, శ్రేష్టి నమస్కారాన్ని భగవదర్పితం జేస్తూ, లక్ష్మీనారాయణ స్తుతితో ఆసనాన్నలంకరించిన శ్రేష్టి చలపతిని కుశల ప్రశ్నలు వేసి, కరణంగారిచ్చిన పాటిపాగాకు పారదీస్తూ "మొన్న మొన్న మనకండ్లెదట పుట్టిన చలపతి యెంతియ్యాడండీ!" అని ఆశ్చర్యాన్ని ప్రకటించి, "అయితే నీకిప్పుడు పిల్లలెంతమం"దని ప్రశ్నించి, "ఇంకేం! ఇద్దరూ మగపిల్లలే!"అంటూ కనుబొమలెగ్గరేస్తూ, తలకాయాడిస్తూ వోనవ్వునవ్వాడు. "వాడికేమయ్యా! మహారాజు యిద్దరూ చెరో పదివేలూ కొట్టుకొస్తారు" అగ్గిపుల్ల వెలిగించి చుట్టముట్టిస్తూ మూడువాయిదాల్లో పూర్తి చేశారామాటను రంగనాధరావుగారు.

పంగనామాలనుతీర్చి ప్రత్యక్షమయ్యాడు మునసబు రంగారెడ్డి అదేసమయంలో. బంగారుమురుగులూ, పంగనామాలూ, మొలనవ్రేళ్లాడే తాళాలగుత్తి, తలగుడ్డా, చేతిలో వంకకర్రా, ఎదురరొమ్మున సగం నెరసిన రోమసముదాయం, మంచి నిండుగా వున్నాడు మనిషి. వస్తూనే చలపతి క్షేమాల్నడిగి, చేతిలో సిద్ధంగావున్న చుట్టచివర కొరికిపారవేసి, "ఏది రంగయ్యా!" అంటూ చుట్టా చుట్టా జోడించి గుప్పుగుప్పుమంటూ కాల్చారు శ్రేష్టి, మునసబూ మరో అగ్గిపుల్లను శ్రమపెట్టకుండా.

కరణం రంగనాధరావు మునసబు రంగారెడ్డితో చెప్పాడు చలపతి సంకల్పాన్ని. చప్పరించిన మునసబు, "ఇప్పుడేం ధరలున్నయ్యనీ, యెవడికాడ డబ్బుందనీ? మీ బ్రాహ్మల పనులన్నీ యింతేనండీ! అదునులో అయితే యెవుడికైనా చెప్పినా అందంగానీ!" అన్నాడు.

"అది నిజమేగాని మరి యెవురవుసరం వారిది. లేకపోతే కరణంగారు చెప్పినప్పుడే యినుకునేవారు. ఏదో వుపాయం జెయ్యకపోతే యెట్టాగండీ మీరూ అట్టా అనీ" సపోటా జేశాడు చలపతిని రంగయ్య శ్రేష్టి.

"అవును రెడ్డి! తప్పనిసరయ్యేగదా వాడైనా నిక్షేపంలాటి భూమిని విక్రయం జేయాలనుకోవటం. అవతల పిల్ల పెండ్లితో వ్యవహారమాయె. ఏదో వొకటి చెయ్యకతప్పదు మనకు," రంగనాధరావు కర్తవ్యాన్ని వెలడించారు, దమ్ములాగి దగ్గుతూ.

పొగవదుల్తూ ఆలోచిస్తున్న మునసబు, "యెట్టా తగలబెట్టటం యిప్పుడు?"అని అటు ప్రకాశమూ, యిటు స్వగతమూ గాని గొంతుకతో అవటమే తడవుగా రంగయ్య శ్రేష్టి అందుకున్నాడు:

"పొలమైనా మరీ అన్యాయమైంది గాదుగా! యేదో కాడికి తగలేయుందండి" అని.

"ఎంతకైనా కొనేవా డేడీ?" అన్న మునసబుకు, "ఏడీ? అంటే యెవడైనా పుట్టుకొస్తాడేమిటి మున్సబూ, నీ చేలో కలిసేదాయె నీవేతీసుకో ధరగట్టి" అని రంగనాధరావుగారు తేల్చారు.

"బాగా చెప్పారు. వొకరిచ్చే ధరకి పదిరూపాయలు తక్కువేయియ్యి" అని లాభసాటి బేరాన్ని శ్రేష్టి సూచించాడు.

"రామ! రామ! అవస్థల్లోవున్న ఆయనకి పదిరూపాయ లెక్కువియ్యాల్సింది బోయి అదేం మాటయ్యా అంతా కోసు లేసం!" యీ సడించుకుంటూనే మునసబు అన్నాడు.


చలపతిని కనుగీరి లోనికి తీసుకొని వెళ్లి వచ్చిన రంగనాధరావు, "మునసబూ! పాపపుణ్యాలు నీమీదబెట్టాం, యిహ నీకు తప్పదు నీయిష్టమొచ్చిన ధరయిచ్చి తీసుకో నీవైనా బ్రాహ్మణిసొమ్ము వుట్టపుడియంగా తీసుకుంటావుట్లే. హరాయించుకోవద్దూ!" అంటూ తీర్మానించారు.

"నాకాడ డబ్బేదండీ? ఆయనకిప్పుడు మిన్నెట్లమీద లెక్క కావాల్సుంటే!"... మునసబు.

"డబ్బు నేనిస్తా, ధరదేల్చు. నీవు కావాలంటే డబ్బేదొరకనట్లు"...కరణం.

"బాగా జెప్పారు" సాయకారం పలికాడు శ్రేష్టి. చలపతి మాట్లాడేందు కవకాశమే లేదు.

రంగనాధరావు ఫైసలు చేసిన ధరకు అతి కష్టంమీద, శ్రేష్టి డబ్బిచ్చే షరతుమీద, మునసబు రంగారెడ్డికి చలపతి చేను విక్రయించబడ్డది, మొత్తం మూడు వేలకు. పంట కళ్లాల నాటికి గాని మునసబుకు డబ్బు అందదు గాబట్టి యీ ఆర్నెల్లకూ శ్రేష్టి యిచ్చే డబ్బుకు ధర్మవడ్డీ మూడు పావలాలుగా నిర్ణయించి, అవసరం చలపతిది గాబట్టి అర్ధరూపాయి అతనిమీదా, పావలాను పొలం కొన్న మునసబుమీదా నిర్ణయించారు ధర్మంగా కరణంగారు. వ్రాతకోతలయ్యాక కరణంగారింట్లో వే



★ రావూరి రంగయ్యలు ★

భోజనానికాగాడు చలపతి, ఆయన ఆహ్వానంమీద.

సాయంత్రం దేమీ తోచక చివరి సారిగా పొలాన్ని చూచుకొని వద్దామని వెళ్లి చలపతి తిరిగి వచ్చేసరికి రంగనాథరావు గారి గొంతుక: "......పాపేభ్యోః రక్షంతాం యదాహ్న పాపమకార్షం మనసా వాచా హస్తాభ్యాం పద్భ్యాం ఉదరేణ శిశ్నా..." అని వినిపిస్తోంది. అక్కడనుండి శివాలయాని కొకసారిగా వెళ్ళివద్దామని వెళ్ళిన చలపతికి భక్తి ముద్రలో నిన్నటిలాగే నిలబడి ప్రార్థన జేస్తున్న రంగయ్య శ్రేష్ఠి కనిపించాడు. అతని వెనకే తానూ నిలబడ్డాడు చలపతి బొమ్మలా. నిన్నటికీ ఈరోజుకీ శ్రేష్ఠి విధానంలో మార్పేమీ కన్పించలేదుగాని, రుద్రపాదాలు స్వీకరిస్తూ "నిన్న అర్జనా యిచ్చా" నని మాత్రమన్నాడు శ్రేష్ఠి. పూజారిపున్నయ్య పళ్లెం నిన్న ఘలుమన్నది ఈరోజున లేదంటే. త్రోవలో పున్నయ్య చలపతితో శ్రేష్ఠికి రోజూ కానీ వేయటం రివాజనీ, నిన్న అర్జనా యివ్వటంవల్ల యివ్వాళ కానీ చెల్లుపడిపోయిందని చెప్పాడు. చిన్న గుడిలో చిన్నా పెద్దా నిన్నటిలాగానే కూర్చొనున్నారు. నిన్నటిలాగే భజన ప్రారంభమైంది "క్రూరకర్మము నేరక జేసితి నేరము లెంచకు రామా! పాపహరా నీ పాలనుబడితిని పరిరక్షింపుము రామా!" అని కరణం రంగనాథరావు ప్రారంభించిన పాట నిన్నటి రసాల్నారించలేదు చలపతిలో. కాని ధర్మాత్ముడైన కరణంగారు యీ పాటను మాత్రం పాడనవసరంలేదు, క్రూరకర్మ లాయన నేరకకూడా చేయజాలడు గాబట్టి యనుకున్నాడు తన కష్టగాథను విని యేదో వో ధరకు పొలా న్నమ్మిపెట్టిన సందర్భాన్ని ఉదాహరణగా తీసుకొని. రంగయ్యశ్రేష్ఠి "సీతమ్మకు జేయిస్తి చింతాకు పతకము రామచంద్రా!" యన్నప్పుడు, వచ్చే మూడు వేలలో రెండు వేలు అల్లుడికి కట్నంగా యిచ్చి, మిగిలిన వెయ్యితో పెండ్లిజేస్తే యిక తన చిల్లర వ్యాపారం సంగతేంగానని పించి, చివరి "రామచంద్రా!"తో మాత్రం స్వరం కలిపాడు. ప్రక్కన భజనగీతం కుస్తీపట్ల ఫక్కీలో నడుస్తోంది. "ఎ...వ......డ..... బ్బా....., సొమ్మంటా?" అని శ్రేష్ఠి ప్రశ్నిస్తుంటే, "నిన్నే నోయ్, రామచంద్రా!" అని కరణం మునసబు ఏకమై నిలవేస్తున్నారు. చలపతి నిన్నటి, "ముదమున సీతా ముదిత లక్ష్మణుడూ చేరి కొలుస్తున్న పట్టాభిరామయ్యను" దర్శించలేకపోయాడు. చెల్లి పెండ్లియినమర్నాడు ఆకలితో కూడుకూ డొక్కలు పీక్కుపోయి దీనంగా నిలబడి తనకేసి చూస్తున్న తనభార్యా, పిల్లలూ, తల్లీ మాత్రం కన్పించారు.

స్వస్తి వాచక మయ్యాక శ్రీనివాసాచార్యులు, "కరణం రంగయ్య, కోమటి రంగయ్య, మునసబు రంగయ్య ముగ్గురూ కలిసి చేయించారీరోజు ఆకుపూజ" అంటూ మంత్రపుష్పం మొదలుపెట్టారు. తీర్థప్రసాదాలు పుచ్చుకొని యెవరి యిండ్లకు వారు వెళ్లారు. చలపతిని కరణంగారు స్వయంగా వెంటబెట్టుకొని వెళ్లారు స్వగృహానికి.

* * *

"రావూరు,
జ్యేష్ఠ బ॥ ౧౨ బుధవారం

మిత్రులు చలపతిరావుగారికి,

ఉభయ కుశలోపరి:—

మీరు మీ చెల్లెలి వివాహప్రయత్నం చేస్తున్నారని తలుస్తాను అలస్యం గానీకుండా శుభకార్యాన్ని నెరవేర్చవలసినది. మీ చిల్లర వ్యాపారానికి పెట్టుబడిని ఎలాగైనా అందులోనే మిగుల్చుకోవలసింది. లేకపోతే ముందు యిబ్బందిపడవలసివస్తారు. మీకు నేను చెప్పవలసినంతవాణ్ణి కాను. వీలైనంత తక్కువ ఖర్చుతో వివాహాలు నెరవేర్చకపోతే మనవంటి 'మధ్య కూడా లేని కుటుంబాలు' ముందుకు రాలేవు.

మీరు మొన్న మునసబు రంగయ్యకమ్మిన పొలం విషయంలో చాలా చిత్రాలు వింటున్నాము. మొదటిరోజు తరువాత మిమ్మల్ని కలుసుకోలేకపోవటంవల్ల నాకు ఇందులో నిజానిజాలు తెలియలేదు. వెంకటశివుడను వొక రైతుకు ఎకరం మూడు వేల చొప్పున మీ యెకరం నలభై సెంట్ల భూమిని నాలుగు వేల రెండు వందల రూపాయలకు మునసబు నిన్ననే అమ్మాడు. వెంకటశివుడితో మీరు పొలాన్ని యీ సంవత్సరాని కమ్మమని చెప్పారట. వెంకటశివుడు నాతో నిన్న పాపం ఆ పేద బ్రాహ్మడికైనా మిగిలేవి యీ వెయ్యి రూపాయలూ, మన రంగయ్యలు ముగ్గురూ నాటకమాడి నాదాకా రాకుండా జేసి అయనకు టోపీ వేశారని అన్నాడు. మీ దగిరనుంచి నెలకు నూటికి అర్ధ రూపాయి వడ్డీ చొప్పున మూడు వేల మీదా ఆరు నెలలకు 90 రూ.లు. మినహాయించారటగదా! ఆతొంభై రూపాయల్లోనూ తలా ముప్ఫై సమంగా పంచుకుండా, "మా కేగదా నీవద్దే మేసిందని తనకు 10 రూపాయలే యిచ్చి, కరణం రంగయ్యగారు యాభై రూపాయలూ, మునసబు రంగయ్యగారు ముప్ఫయి రూపాయలూ తీసికొన్నారు, ఈకాలంలో న్యాయమెక్కడుం" దని, కోమటి రంగయ్య నిన్న రహస్యంగా నాతో అన్నాడు.

ఇంతకూ మీ కన్యాయం జరిగిందని కాసేపు అఘోరించాను అంతకన్నా చేసేదేమీ లేదు గాబట్టి. ఎవరి అదృష్టం వారిది.

తరచు మీ యోగక్షేమాలు తెలియజేస్తుండండి. సెలవు.

మిత్రుడు,
శ్రీనివాసాచార్యులు."


చలపతి బుర్ర గిర్రున తిరిగిపోయింది. రెండు కండ్లనుంచీ రెండు నీటి బిందువులు టపటపా రాలాయి జాబుపైన. పండ్లు బిగుసుకుపోయి పటపటలాడాయి; ఆరోజు సంఘటన యిట్టే కండ్లకు కన్పించింది.

వెంకటశివుడు చలపతిని పొలాన్ని గురించి హెచ్చరించి ఎకరం రెండువేల అయిదు వందల చొప్పున బేరం తనదనీ మరొకరికి మాట యిచ్చే ముందు తనతో వో మాట చెప్పి అవతల మాట యిమ్మనీ చెప్పాడు. రహస్యంగా పిలిచి లోలికి తనను తీసుకొని వెళ్లినప్పుడు కరణంతో చెప్పాడీమాటను చలపతి "అబ్బాయ్! ఈ వూ రోట్టి దగుల్బాజీ రకం. అంత ధర యింతధర అని వూరికే బేరాలు పెంచి చివరకు చెడగొట్టటం యిక్కడి ఆచారం. అందులో ఆ వెంకటశివుడు మొదటివాడు. అసలే అవతల అమ్మాయి పెండ్లి పెట్టుకున్నవాడివి. దగాపడబోకు" అని చెప్పి యీ వడ్డీ వ్యవహారం అట్లా పరిజేస్తానని చెప్పాడు. అది నమ్మిన తను మళ్లీ వెంకటశివుడు హెచ్చరిస్తే అమ్మనని అబద్ధమాడాడు.

ఈ ఆలోచనతోనే చలపతి ముగ్గురు రంగయ్యల్నీ తలుచుకొన్నాడు. ముగ్గురివీ యొక్కరంగు పంచలే. ముగ్గురూ భజనపరులే. ముగ్గురూ రంగుల రంగయ్యలే. రంగు వేసికోకుండానే నాటకమాడి తనకు బురదపులిమినందుకు కుమిలిపోతూ నులకమంచంమీద నడుంవాల్చి కన్నుమూసిన చలపతికి, "పాపేభ్యో రక్షంతాం మనసా, వాచా,...." అంటూ సంధ్యావందనాన్ని జేస్తున్న కరణం రంగయ్య, శివాలయంలో చేతులు కట్టుకొని నిలబడి ప్రార్థనజేస్తున్న కోమటి రంగయ్య, క్రూర కర్మములు నేరకజేసినంటూ భజనజేస్తూ ఆకుపూజలు చేస్తున్న మునసబు రంగయ్య కలలోకొచ్చారు.

"రంగు పంచేలేమిటి? రావూరి రంగయ్యలేమిటి? లెండి లెం"డని లేపింది చలపతివి భార్య.

"ఊళ్లు ప్రింగేవాళ్లు, గుళ్లు దోచేవాళ్లు వూళ్లో చలామణీ అవుతారయా!" అంటూ ప్రక్కింట్లో రేడియోలోంచి వినిపిస్తోంది. ★



మంచిచెడ్డా:

పెరిగిన గిరాకీ

అన్నపూర్ణా రామారావు
(హైదరాబాద్.)

నిజం చెప్పాలంటే ఇప్పటి రోజులలో పనిమనుషుల కున్నంత గిరాకీ ఇంకెవ్వరికీ లేదు. మరీ మరీ ఈ విషయముగురించి ఎందుకు వ్రాస్తున్నానంటే ఇప్పుడు మనకి కొత్త రాజధాని అవతరించటములో ఇక్కడ వీళ్ళగిరాకీ మరీ హెచ్చిపోయినది. అందులోను ఈ హైదరాబాదుకి కొత్తగా వచ్చిన వాళ్ళస్థితి చెప్పనక్కరలేదు.

రాజధాని ఎప్పుడు హైదరాబాదుకి మారిందో అప్పుడే పనిమనుషులకు రోజులు మారాయి. వాళ్లని అమ్మా! బాబూ! అని బతిమాలుకోవాలి. అప్పటికీ తిక్క తిరిగితే పోతాము అంటారు. వాళ్ళు పెట్టే అగచాట్లు ఆ బ్రహ్మకైనా వద్దు.

ఇంకో చిక్కు వచ్చింది. వీళ్ల భాష మనకి రాదు. ఎక్కడ చూచినా ఈ ఉర్దూ ఘోష ఒకటి మనని వెన్నంటు తుంది. ఇంక జీతం వాళ్ళ ఇష్టమొచ్చినంత అడగటము. ఇదీ ఇక్కడి వరస. ఇంకే బజారుకో వెళ్ళితే అక్కడ మనుషులనుబట్టి వాటిధర ఎక్కుతూ తగ్గుతూ ఉంటుంది. మొన్న ఒక చిన్న తమాషా జరిగింది.

మాయింట్లో ఒకళ్లకీ ఆ భాష సరిగా రాదు. సరే అమ్మ మిరియాలు అయిపోయాయి తీసుకొని రమ్మంది. దుర దృష్టవశాత్తు మేమందరము కార్లో ఎక్కడికో వెళ్లి వస్తూ కొన్నాము. వాడు శేరు 9 రూ చెప్పాడు.

కర్నూలులో 4 రూపాయలే అని అమ్మ అంది ఇంటికొచ్చిన తరువాత. సరే ఇంక రాత్రి, అమ్మ నాన్నగారితో చెప్పింది. ఇక్కడి ధరలు చాల విపరీతమని.

మరునటిరోజే మా ఎదురింటి ఆవిడ వస్తే ఆవిడతో కూడా ఈ సంగతి చెప్పింది. ఆవిడ ఆశ్చర్యంగా నవ్వటము మొదలుపెట్టింది. తరువాత మెల్లగా చెప్పింది "శేరు రూ 3-8-0 సుమండీ! వాడు మిమ్మల్ని. మీతర హాని చూచి ఇష్టమొచ్చినంత చెప్పాడు" అని. ఇట్లా ఉంది ఈ హైదరాబాదులో ఉండేవారి అవస్థ. ఏది కొనాలన్నా ఒకటి రెండురెట్లు పెటందే మనకిరాదు.

సరే అసలు సంగతికి వద్దాము. మచ్చుకి రెండుమూడు చెప్తాను.

మేము కర్నూలునుండి వచ్చేటప్పుడు నౌకర్లను అందరినీ తీసుకొని వచ్చినాము కాని పనిమనిషి ఎందుకనో అని తీసుకొనిరాలేదు. ఇంక ఇక్కడ చూచుకోండి మా అవస్థ. ఒక పనిమనిషి వస్తుంది ఇల్లు ఊడ్చి, బాసండులు (వంటగిన్నెలు) తోమటకు పాతికరూపాయలు అడుగుతుంది. ఇంకా ప్రొద్దున్న టిఫిను, మధ్యాహ్నము అన్నము సాయంత్రము టీ.

పోనీ మనము ఇంత ఇచ్చిపెట్టు కుంటే ఏమైనా సుఖముందా అంటే అదీలేదు. ఒక్కపని ఎక్కువ చెప్పినామా చాలు వాళ్ళు ముందు గొణుగుతారు. తరవాత విసుక్కుంటారు. మళ్లీ తోటవాళ్లు కుడిఖరు. దానికి ఇంకొకరిని పెట్టుకోవాలి ఏదోపదో ఇచ్చి. మనకొత్తరాజధానిలో ఇదీ వరస.

ఇంకా ముఖ్యమయినది, మరో విషయము ఏమిటంటే ఇక్కడ దొంగతనము కాస్త ఎక్కువ అనిపిస్తుంది.

వీళ్ళకి బాసండులు వేస్తే మనము లెక్కపెట్టి వెయవలసిందే, లేదా వారి దగ్గర ఒకరు కాపలా కాయాలి. లేకపోతే మన సామాను మనది కాదు అనుకోవాలి. ఇం తెందుకు మేము ఇక్కడికి వచ్చి నెల అయింది. అప్పుడే 80 రూపాయలు చేసే స్టెయిన్‌లెస్‌స్టీల్ సామాను పోయింది.

ఇంట్లో గిన్నెలు ఏమైపోతాయి నువ్వు తీసుకొని వెళ్లకపోతే ఇంట్లోనే ఉంటాయా చూడు అన్నది అమ్మ పనిమనిషితో. అంతే ఆమెపని మానేసుకొని వెళ్ళిపోయింది. పోనీ ఎన్నో రోజులయేక చూచేమా అంటే అదీకాదు. మరురోజు అడిగితే "లేదు నాకు తెలియదు" అని వెళ్లిపోయింది. ఇంక ఏమి చేస్తాము ఉన్నవయినా జాగ్రత్త పెట్టుకొందామని ఇక మాట్లాడకుండా ఊరుకొన్నాము.

ఇంకా విచిత్రమైనది ఏమంటే మా పక్కింటి ఆవిడ తన చేతితోనే మజ్జిగ పోసి ఇచ్చిన గిన్నె మాయంచేసి, ఏదే అని అడిగితే "నామీద దొంగతనము కట్టుతారా, సెలాఖరవికి" అని కేకలు వేసు కుంటూపోయింది. ★




రచయిత్రి

శ్రీరామ రక్ష

తెలంగాణా కాంగ్రెస్ అధ్యక్షుడుగా గోల్కొండ పత్రిక సంపాదకుడు, రాజ్యసభ సభ్యుడు అయిన శ్రీ ఎన్. నరోత్తమరెడ్డిని డిసెంబరు 20 న జరిగిన ప్రదేశ్ కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీ నరోత్తమరెడ్డి యువకుడు; ఉత్సాహభరితుడు; విద్యాధికుడు. ఈ స్థానానికి ఎన్నిక అయినందుకు వారిని తప్పక అభినందించవలసిందే. అయితే, రాజకీయంగా ఆంధ్రలో విలీనమైన తెలంగాణాకు ప్రత్యేక కాంగ్రెస్ ఎంతవరకు అవసరమన్నదే ప్రశ్న. ఏకరాష్ట్రంగా పాటిస్తున్న ఒక ప్రదేశానికి ఒకే ఒక కాంగ్రెస్ సంఘం ఏర్పడి పనిచేస్తే, ప్రత్యేకరాష్ట్ర స్థాపన ద్వారా సాధించిన రాజకీయ సమైక్యతకు, సామరస్యానికి ఒకవిధమైన సంపూర్ణత్వం సిద్ధించే అవకాశం వుండేది; హృదయ సమైక్యతకు కూడా అది దారితీసేది. కొన్ని ప్రయోజనాల దృష్ట్యా పరిపాలనా బాధ్యతల నిర్వహణంలో ప్రత్యేక ప్రతిపత్తి కొంతకాలంపాటు కొనసాగాలని కోరడంలో అర్థంవుంటే వుండవచ్చు; జాతీయ కాంగ్రెస్ సంస్థ ఉపశాఖలైన ప్రాంతీయ సంఘాల స్థాపన విషయంలో "ఒక రాష్ట్రం; ఒక కాంగ్రెస్" అన్న సూత్రమే సర్వదా అభిలషణీయం. ఇలాంటివిభేదాలు కాంగ్రెస్ విషయంలో అనవసరమని శ్రీ ధేబర్ ప్రభృతులు ఇదివరకే తమ అభిప్రాయాలను వ్యక్తీకరించి వున్నారు. తెలంగాణాకు 1962 వరకూ ప్రత్యేక కాంగ్రెసు వుండాలనే ఒప్పందం చేసుకున్నప్పటికీ, దాన్ని పరస్పర అంగీకారంతో సడలించుకోడానికి గాని, సవరించుకోడానికిగాని ఎంతవరకు అవకాశంవున్నదో నాయకులు పరిశీలించాలి. రేపు ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు, పార్లమెంటుకు జరిగే ఎన్నికలతో తెలంగాణాకు ప్రత్యేక కాంగ్రెసు వుండవలసిన అవసరం చాలావరకు తీరిపోవచ్చు. అందుచేత, ఈసారి జరిగే కాంగ్రెసు ఎన్నికలనాటికైనా ఆంధ్రప్రదేశ్‌కు ఒకే కాంగ్రెసు ఏర్పడుతుందని ఆశిద్దాము.

* * *

సేలం జిల్లాలోని హోసూరు, కృష్ణగిరి ప్రాంతాలపై ఆంధ్రులకు హక్కు లేదనీ, అవి వివాదగ్రస్తమైన సరిహద్దు ప్రాంతాలే కావనీ మద్రాసుప్రభుత్వం మొదటినుంచీ వాదిస్తూవచ్చింది. ఈ విధంగా వాదించిన కారణంచేతే, దాదాపు పదమూడు నెలల క్రితం సరిహద్దు వివాద పరిష్కారానికి ఆంధ్ర మద్రాసు ప్రభుత్వాలమధ్య మంత్రివర్గ స్థాయిలో జరిగినచర్చలు అర్ధాంతరంగా ఆగిపోవడం సంభవించింది. ఈ వివాదాన్ని ఒక కేంద్ర మంత్రి వచ్చి పరిశీలిస్తాడనీ, పరిష్కరిస్తాడనీ తెలుసుకున్న తర్వాత, తిరుత్తని ఇతర ప్రాంతాలతోపాటు హోసూరు సమస్యనుకూడా పరిశీలనలో చేర్చడానికి మద్రాసు ప్రభుత్వం ఇష్టపడ్డది. కాగలపనిని గంధర్వులే తీరుస్తారన్న ధీమాయే ఈ విధంగా ఇష్టపడడానికి కారణమని ఇప్పుడిప్పుడే బయటపడుతున్నది. దీనికి మొన్న శనివారంనాడు మద్రాసు శాసనసభలో సభ్యులువేసిన ప్రశ్నలు, సభానాయకుడు ఇచ్చిన సమాధానాలే నిదర్శనం. హోసూరు విషయం చర్చించడానికి మద్రాసు ప్రభుత్వం అంగీకరించిందా అని ఒక సభ్యుడు ప్రశ్నిస్తే, హోసూరు విషయం ప్రస్తావించడానికి ఆంధ్రప్రభుత్వానికి హక్కు లేదనే మద్రాసు ప్రభుత్వవాదమనీ, అయితే, మరో పెద్దమనిషిచేత ఈ సంగతి చెప్పించి ఒప్పించాలనే ఉద్దేశంతోనే ఈ సంప్రతింపులలో హోసూరు చేర్చడం జరిగిందనీ సభానాయకుడు బదులు చెప్పాడు. సరిహద్దు వివాద విషయంలో వీలైనంతవరకు కొత్త ప్రాంతాలను రాబట్టుకోవడమేగాని, ఇవ్వవలసినవి ఇచ్చే ఉద్దేశంమాత్రం మద్రాసు ప్రభుత్వానికి లేదేమోనని దీన్నిబట్టి అనుమానించవలసివస్తున్నది. కేంద్రన్యాయశాఖమంత్రి శ్రీ పటాస్కర్ వివాద పరిశీలనకు రాబోతున్నారు. ఆంధ్ర మద్రాసు ప్రభుత్వాలు రెండిటకీ మిత్రులైన కేంద్ర న్యాయ వ్యవహారాల మంత్రిమీద ఉభయులకూ న్యాయం చేకూర్చవలసిన బాధ్యత వున్నదని వేరే చెప్పవలసినపనిలేదు. ఏది ఏమైనప్పటికీ శ్రీ అర్చుదవాధన్ నివేదికకు ప్రాతిపదికస్థానం లభ్యం కాకుండా చూడడంలో ఆంధ్ర ప్రభుత్వం పరాకు చిత్తగిస్తే, ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అందుచేత వివాదగ్రస్త సరిహద్దు ప్రాంతాల మ్యాపులను, ఇతర సరంజామాను ఆంధ్రప్రభుత్వం సకాలంలో సంసిద్ధపరుచుకోవలసి వుంటుంది.



నరోత్తమ రెడ్డి

* * *

పాఠశాలలలో విద్యార్థులకు చక్కగా లెక్కలు చెప్పడానికి మార్గాలేమిటని, ఏ ప్రమాణాలను పాటిస్తే బాగుంటుందని కడపజిల్లా గణిత శాస్త్రోపాధ్యాయులందరూ ఈమధ్య ఒక ప్రత్యేక సదస్సు ఏర్పాటుచేసి చర్చించారు. ఇది నిజంగా విద్యార్థిలోకానికి చాలా ఉపయోగపడే సదస్సనే చెప్పాలి. ఒక్క మనదేశంలోనే గాక, అనేక ఇతరదేశాలలో కూడా గణితశాస్త్ర బోధనాప్రమాణాలు బాగా క్షీణించిపోయినవని పలువురు ప్రముఖులు తరుచూ బాహాటంగా వ్యాఖ్యానించడంకూడా జరుగుతున్నది. మిగతా ప్రాంతాలమాట ఎలావున్నప్పటికీ, మనరాష్ట్రంలో మాత్రం హైస్కూలువిద్యావిధానంలో చీటికీమాటికీ సిలబసులు మార్చడంవల్లనే గణితశాస్త్ర బోధనాప్రమాణాలు పతనం కావడం జరుగుతున్నదని చెప్పవలసి వుంటుంది. ఈ విపరీతమైన మార్పులవల్ల విద్యార్థులలో గణిత శాస్త్రాభ్యాస ఉత్సాహం సన్నగిలిపోవడం జరుగుతున్నది. విద్యార్థులు గణితశాస్త్ర సూత్రాలు వల్లెవేయడంమాత్రమే జరుగుతున్నది; ఆసూత్రాలను రకరకాల ప్రశ్నలలో అన్వయింపజేసే సామర్థ్యం వారికి ఎకోశానా అబ్బడంలేదు. చివరకు పెద్ద పరీక్షలలో వల్లెవేసిన విషయాలు వస్తేసరి; లేకపోతే, గోవిందా! వెనకటికి ఒక జామెట్రీ మేష్టరు తన క్లాసులో ఎప్పుడూ "ట్రయాంగిల్ A B C..." అని మాత్రమే పాఠం చెప్పేవాడట. తీరా పరీక్షలో మరో ఎక్జామినర్

★ శ్రీరామరక్ష ★

"ట్రయాంగిల్ PQR..." అని ఒక ప్రశ్నలో ఇచ్చాడట. ఈ ట్రయాంగిల్ ఎక్కడినుంచి వచ్చిందని ఆ నూర్గురు విద్యార్థులు తెల్లముఖం వేశారట. ఇలా వుంటున్నాయి మన చదువులు!

* * *

మామూలుగా ఒక్కొక్క క్లాసులో గాని, ఒక్కొక్క ఫారంలోగాని ప్రతి సెక్షనుకూ దాదాపు నలభైమంది విద్యార్థులకు మించి వుండరు. పాఠశాల క్రమానికి ఇప్పటికీ కూడా ఈ సంఖ్యలో పెద్ద మార్పేమీ వచ్చినట్టు కనుపించదు. ఆ రోజులలో ప్రతి మాష్టరూ తన క్లాసులో వుండే ఒక మొద్దబ్బాయిని తీసుకొని "వీడు ఈ తరగతికి బెరామీటర్" అని చెప్పి తన బోధనా కార్యక్రమాన్ని సాగిస్తుండేవాడు. ఒక లెక్కగాని, లేదా, పాఠంలో ఒక అంశంగాని ఆ విద్యార్థికి బాగా అర్థమైతే, మిగతా పిల్లలందరికీ అర్థమైనట్టే నిర్ధారణ చేసుకునేవాడు. పాఠాల్లో వెనుకబడి వుండే విద్యార్థులను ఎప్పుడూ ముందు బెంచీల మీద కూర్చోపెట్టుకునే వాడు. అలా వుండేది అప్పటి పద్ధతి. ఇప్పుడు కొంతమంది ఉపాధ్యాయుల దృష్టిలో చెప్పిన పాఠం అందరికీ అర్థమైతే ఆర్థికంగా పెద్ద దెబ్బ! వచ్చే ట్యూషన్ డబ్బులు గిట్టుబాటు కావు! లేకపోతే, రాష్ట్రంలో ఇన్ని "ట్యుటోరియల్ పాఠశాలలు" ఏర్పడడానికి వేరే కారణమేమిటంటారు? ఇంతకూ గణిత శాస్త్రంలో గాని, మరే విషయంలో గాని బోధనా ప్రమాణాలు పెరగాలంటే, ఉపాధ్యాయుల జీతనాలు పెరగాలి! ట్యూషన్లపై ఆశపోవాలి.

* * *

"రోగులను పీడించి డబ్బు తీసుకోకూడదు. ప్రభుత్వం నిర్వహించే ఆస్పత్రులలో రోగులకు ఉచితంగా సేవచేయవలసిన బాధ్యత వైద్యులదై వున్నది," అని రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి మెహిదీ నవాజ్ కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రి శతవార్షికోత్సవంలో ఈమధ్య ప్రసంగిస్తూ హితవు చెప్పారు. ఆరోగ్యమంత్రిగా వీరు ఆంధ్ర జిల్లాలకు రావడం ఇదే మొదటిసారి. ఉత్సవాలను భారత జాతీయ గీతంతో గాక, వేరొక గీతంతో ప్రారంభించినందుకు మంత్రి చాలా నొచ్చుకొని, నిర్వాహకులను మందలించారు కూడా. మెహిదీ నవాజ్ పరిపాలనా వ్యవహారాలలో కడుసమర్థులే గాక, జాతీయ భావోద్దీపితులని కూడా చెప్పడానికి ఈ మందలింపు ఒక నిదర్శనం. కాకినాడ ఆస్పత్రి చాలా సమర్థంగా పనిచేస్తున్నది కాబట్టి, అక్కడ ఒక వైద్య కళాశాలను స్థాపించడానికి అవసరమైన వసతులన్నీ వున్నవన్నారు. 'శుభస్య శీఘ్రం' అన్నారు పెద్దలు. అవశ్యం జరగవలసిందే. అయితే ఒకవిషయం. ఆంధ్ర జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రులన్నీ కాకినాడ ఆస్పత్రి అంత సమర్థంగా పనిచేస్తున్నవని మంత్రి అభిప్రాయపడితే మాత్రం, పొరపాటు పడుతున్నారనే చెప్పవలసి వస్తుంది. అనేక ఆస్పత్రులలో వైద్యులుంటే మందులుండవు; మందులుంటే వైద్యులుండరనే పాడుపేరు వీటికి ఇదివరకే వచ్చింది. తెలంగాణాలోని ప్రభుత్వ ఆస్పత్రుల మాటేమిటో తెలియదుగాని, ముందు ఏమాత్రం వర్తమానం పంపకుండా, ఆకస్మికంగా వచ్చి తనిఖీ చేస్తే, ఆంధ్ర జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రుల బండారం బయట పడుతుంది!

* * *

భారత రాజ్యాంగం వర్ణించిన ప్రాథమిక స్వత్వాలలో వ్యభిచారం చేరుతుందా అని ఒకానొక సాంఘిక కార్యకర్తలసమావేశంలో భారతసంఘ సంక్షేమసంస్థ అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయిదేశముఖ్ ప్రశ్నిస్తున్నారు. "వ్యభిచారం మన రాజ్యాంగం నిర్వచించిన వ్యక్తిగతమైన హక్కులలో చేరుతున్నదనే తన ప్రశ్నకు తానే జవాబు చెప్పుకున్నారు. ఎందుచేతనంటే: "రాజ్యాంగం ఇస్తున్న స్వేచ్ఛావ్యాపారపు హక్కు ప్రకారం వ్యభిచారం స్త్రీల ప్రాథమికహక్కు" అని ఒక భాగ్యశాలిని కోర్టులో దావా వేసిందట! నిజమే, ఇది ఏమంత పెట్టుబడి అవసరంలేని వ్యాపారం! రాజ్యాంగ నిబంధనను వెంటనే సవరణ చేయకపోతే, సాంఘికాభ్యుదయ కార్యక్రమమెంతో దెబ్బతింటుందనీ, తద్వారా దేశానికి ఎంతో ప్రమాదం వాటిల్లుతుందనీ శ్రీమతి దుర్గాబాయి హెచ్చరిక చేస్తున్నారు.

మరి, విద్యాసంస్థల దరిదాపులలోగాని, విద్యార్థుల వసతిగృహాల వద్దగాని (200 గజాలదూరంలో) వ్యభిచారం సాగించినా, వ్యభిచారగృహాలు నడిపినా మూడునెలల కారాగారశిక్ష విధించడం జరుగుతుందని పార్లమెంటు ఈమధ్య ఒకశాసనం చేసింది. కేవలం శాసనాలు చేసినంతమాత్రాన, రాజ్యాంగాన్ని సవరించినంతమాత్రాన ఈసాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి వీలవుతుందా అన్నదే సందేహం. వ్యభిచారం ప్రబలిపోవడానికి దాదాపు మాటికి తొంభై వంతులు ఆర్థిక సంబంధమైన కారణాలే వుంటవి. అందుచేత స్త్రీల ఆర్థిక సమస్యను ప్రముఖమైన ధోరణిలో త్వరిత గతిని పరిష్కరించినప్పుడే, చాలావరకు వ్యభిచార దుర్వ్యవహార నిర్మూలనం సాధ్యపడుతుంది.

* * *

ధాన్యం హామీగా బ్యాంకులు పెద్ద పెద్ద మొత్తాలు బయానాలు ఇవ్వడాన్ని అరికట్టడంతో ధాన్యం ధరలు తగ్గినవంటూ కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి.

దక్షిణాది రాష్ట్రాలలో ధాన్యం ధర ఇప్పటికే మణుగుకు ఆరు రూపాయలు తగ్గిందనీ, ఇది తీవ్రంగా తగ్గిపోవడం మొదలు పెడితే వచ్చే ఎన్నికలలో ప్రతిపక్షులు ప్రభుత్వంపై ప్రతికూల ప్రచారంచేసే ప్రమాదమున్నదనీ కేంద్ర ఆహారమంత్రి శ్రీ కృష్ణప్ప తమ భయాందోళనను ప్రకటిస్తున్నారు. ధాన్యం, ధర ఏ ప్రాంతంలో ఇంతచేటు ఆందోళన పడవలసినంతగా తగ్గిపోయిందో తెలియదు. మద్రాసు రాష్ట్రంలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ ధరలు ఇంకా పెరుగుతున్నవేగాని, తగ్గిన జాడలు కనిపించడంలేదు. ఇప్పటికీ మద్రాసులో పడి బియ్యం రూపాయిబేడకు తక్కువ లేదు! ముఖ్యమంత్రి ఇటీవలచేసిన ప్రకటన కూడా ఇదేస్థితిని ధ్రువపరుస్తున్నది. "ఆహార పదార్థాలధరలపై కఠిన నిర్బంధాలు విధించడంవల్ల ఉత్పత్తిదారులుగాని, కొనుగోలుదారులుగాని బాగుపడకపోగా, మధ్య దళారులు మాత్రమే బాగుపడడం జరుగుతుంది. అందుచేత ఆపద్ధతిని నేను వ్యతిరేకిస్తున్నాను" అన్నారు శ్రీ సంజీవరెడ్డి ఈమధ్య రాజధానిలో ఒకసభలో ప్రసంగిస్తూ. ఇంతేగాక ఇతరరాష్ట్రాలకు ధాన్యం ఎగుమతులను నిషేధించడంకూడా అవివేకమే అవుతుందన్నారు. "ధరలు పెరిగితే, పేదల ఆందోళన; తగ్గితే, రైతులఆందోళన; కనుక అందరికీ తృప్తికరంగావుండే స్థాయిన ధరలను వుంచాలి," అని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత అధిక ధరల పరిస్థితిని, ఆహార క్లిష్టసమస్యను 120 కోట్ల ధనంతో నిర్మిస్తున్న నాగార్జునసాగరం పూర్తి అయితే పరిష్కరించవచ్చునన్నారు. కోతలు పూర్తిఅయి కొత్తపంట చేతికివస్తే ధర దానంతటదే తగ్గుతుందని పాత పల్లవే ఇస్తున్నారు.

కోతలు! కోతలు!! కోతలు!!! కొత్త కోతలకోసం ఎదురుచూడాలి ప్రజలు.


24-12-56 —భార్గవ



యెంచాతంటే యేం చెప్తాం. అంటే యేం చెప్పలేం అన్న మాట. పీళ్లు అన్నీ ఇలాగే మాట్లాడతారు.

ఇప్పుడేమో మనం నిద్దరోతు నప్పుడు ముద్దోస్తాం అంటారా.

ఇలాగే నేను మెడ్రాసు క్రాపింగు దువ్వి...కుంటే పండులా ఉంటానుట. కుంటకపోతే ఉండ నుట. ఇంకా, జులాయి భడవలా ఉంటానుట.




ఇలా అని అమ్మ చెప్తుంది. నాన్నకూడా చెప్తాడు. (వాడు ఎప్పుడూ అమ్మ పార్టీయే లే)

యేం? మరి అమ్మకూడా దువ్వు కుని జెడేసుకోవాలిగా. అప్పుడే పండులా ఉంటుందిగా.

అయినా ఒక్కొక్కప్పుడు అమ్మ జుట్టు రేగిపోయి ఉంటుందిగద పొద్దున్నే. అప్పుడు నాన్న కాఫీ తాగడానికి వస్తాడుగా వంటింట్లోకి.

అప్పుడు అమ్మ ఈ చేత్తో ఇలా కాఫీఇస్తుంది. ఇంకో చేత్తో ఇలా మొహంమీద జుత్తుని పైకి తోసు కుంటుంది చూడు. అప్పుడు నాన్న డేంజరులా మాట్టాడడూ.

ఆ హో హో హో హో రాధా ఆ జుట్టు అలా ఉంచరాదా. అలాగే ఎంతో బాగున్నావుకదా అనేస్తాడు గదా.




యెందుకవాలి అంట. అందుకే నాకు కోపం. నేను జుట్టు దువ్వుకోపోతే బాగు లేదు అంటాడుగదా. అమ్మకి ఎందుకు అనడు? నాకు ఒక రూల్సు పెడేసి, అమ్మకి ఇంకో రూల్సు మార్చేస్తాడు.

ఇలా రూల్సు మార్చేస్తే నేను హోచ్చర్లు పడిపోయేస్తాను. (రూల్సు మార్చడం అంటే అన్యాయం చెయ్యడంట,. అని బాబాయి చెప్పాడు. అన్యాయం అంటే నాకు తెలీదు.)

వీడు లేడూ ఈ బాబాయి. వీడికి నాన్న పోలిక ఉంది.

ఈ బాబాయికి నేను యేడిచినప్పుడు చూట్టానికి బావుంటుందిట. అందుకని



బుడుగు, చిచ్చుల పిడుగు

ఒక్కోసారి, యెవరూ లేకుండా నన్ను మొట్టికాయి కొట్టేస్తాడు. నేను యేడిస్తే చూడాలని.

నేను యేడవను అనుకో. పెద్దవాళ్ళు యేడవరుగా. అంతెందుకు నేను పక్కింటి పిన్నిగారి మొగుడుగారు లేడూ. వాడు ఏడిస్తే ముద్దొస్తాడా చూట్టానికని ఓసారి మొటికాయ కొట్టా.

నా చెయ్యి నెప్పెట్టింది కాని వాడు యేడవడే. అందికని ఇంకోసారి రాయిబెడ్డ విసిరికొట్టా. అప్పుడు వాడు కాదు కాని నేను ఏడిచాను. వాడు ముందస్తుగా అబ్బ అనేసి, గభుక్కుని నను పట్టేసుకుని నా క్రాపింగు మీద ప్రెవేటు చెప్పేశాడు - అంచుకూ. వాడికీ ఏడుపొచ్చి ఉంటుందిలే.

అయినా, పెద్దవాడుగా అందుకని పైకి యేడవకూడదు.

అందుకనే బాబాయి కొట్టినా నేను ఎప్పుడేనాగాని యేడవను.

యేం? నాన్న కూడా అంతే. నాన్నకి నేను యేడిస్తే చూట్టానికి యెలావుంటుందో తెలీదుగాని, అమ్మకి ఖోపం వచ్చినా యేడుపు వచ్చినా నాన్నకి నవ్వొస్తుంది. అప్పుడు అమ్మ బావుంటుందిట.

యవళేనా వింటే నవ్వరూ? అని నేను అంటే నాన్న ఏడిశావులేవోయ్ నాగన్నా అంటాడు బెంకిజెల్ల పుచ్చుకుని.


ఇలాగే నేను ఏమేనా అడిగితే, నాన్నకి జ్ఞాపకం రాకపోతే ఏడిశావు అంటాడు.

యెందుకంటే ఓసారి నాకు ప్రెవేటు చెప్పాడు. ఇది నిజం ప్రెవేటులే. యెప్పుడేనా చెప్తాడు.

ఏంరా బుడుగూ, మనకి పాలిచ్చే జంతువులు అయిదు చెప్పరా అన్నాడు.

హాఁ ఇంత తెలీదనుకున్నావా అనేసి





నేను చెప్పేశాను. కాని తప్పంటాడే.

నేనేం చెప్పానంటే, ముందస్తుగా ఆవు, గేదీ, చెప్పాను. తరవాత, వాళ్ళ చిట్టీ వాళ్ళు పట్టుకుని తాడుకి కడతారే-అదేమిటి? మేక... మేక అని ఇంకోటి చెప్పాను.

అప్పటికి నాన్న చేతివేళ్ళు మూడు ముడిచాడు. ఇంకో రెండేగా. రెండావులు అని చెప్పేశాను.

నాన్న, అమ్మకూడా నవ్వేశారు.

ఆవు ముందరే చెప్పావుగా ఇంకో రెండు కొత్తవి చెప్పాలి అన్నాడు నాన్న.

ఇంక లేవు ఫో అన్నాను నేను.

పోనీ మీరు చెప్పండి అంది అమ్మ. (అమ్మలు నాన్నల్ని మీరు అంటారులే చాలా మంది)

నాన్న కొంచెంసేపు బుర్ర గోక్కుని గొర్రి అన్నాడు.

మర్రేనండోయ్ అంది అమ్మ. అనేసి ఊరుకుంది.

మరి ఇంకోటో? ఇంకో వేలుందిగా అన్నాను నేను.

అప్పుడు నాన్న ఏడిశావు అని నన్ను కోప్పడేశాడు.

అంటే ఇంకో వేలుకి యేం చెప్పాలో తెలీదన్న మాట.


ఇలా అని అమ్మ అనేసింది కూడా. అనేసి నవ్వేసింది.

అప్పుడు నాన గబగబా బుర్ర గోక్కుని తెలీకేం బోల్డున్నాయి. జిరాఫీ, పులి, పిల్లి, కుక్క అన్నాడు.

అవన్నీ మనకి పాలిస్తాయా యేమిటి అంది అమ్మ ఇంకా నవ్వుతూ.

అపుడు నాకూ నవ్వొచ్చేసింది. నాన్నకీ నవ్వొచ్చేసింది. అందరికీ నవ్వొచ్చేసింది.

కుక్కంటే ఇంకోటి జ్ఞాపకం వస్తోంది.



ఆ పిన్నిగారు మొగుడుగారు లేరూ? వాడేమో, ఓ సారి రోడ్డుమీంచి వెళ్తున్నాడు.

కాదు ముందస్తుగా, ఓ కుక్క వచ్చింది. నేను దాన్ని మా యింట్లోకి రమ్మన్నాను పెంచుకుందామని.

అది రానంది నేను తోకపట్టుకుని రమ్మన్నాను.

అప్పుడు వీధిలో వెళ్తున్న పిన్నిగారు మొగుడుగారు వచ్చారు. పిన్నిగారు కాదు మొగుడు అన్నమాట



వ్యాపారనిమిత్తం ఈ మధ్య అమెరికా వెళ్ళిన దేవీదయాళ్ పరిశ్రమల డెరెక్టరు శ్రీ హరికృష్ణదాస్ అగర్వాల్.

ఒరేయ్ బుడుగూ అలా తోకని లాగకూ కరుస్తుంది సుమీ అన్నాడు ఇలా బయంగా చూసి.

ఇంకేలా వీళ్ళతోటి తోకెక్కడేనా కరుస్తుందా.

తోకని లాగితే, అప్పుడు కుక్కకి నెప్పెట్టితే మన్ని నోరుతో కరుస్తుందన్నమాట

అలాగే మనికి జటకా కొనుక్కోవాలని ఉందనుకో. నాన్నతో చెప్తే నాన్నంతట నాన్న కొనడుగదా. పోనీ దేముడిని అడిగితే వాడంతటవాడు ఇలా వచ్చేసి ఇగుగో బుడుగూ డబ్బులిందా, జటకాబండీ కొని ఎంచక్కా తోలుకో అంటాడా?

మరి అనడుగదా. మరి యాలాగా?

అందుకే మనకి మూడు చక్రాల సైకిలు కావాలనుకో. దేముడి దగ్గిర నించుని చేతిలో వెన్నముద్ద చెంగల్వ పూదండ అని ముందస్తూగా పద్యం చదవాలి ఆనక, ఓ దేముడూ నాకు జెటకాబండీ, కొరడా కొనిపెటాలమ్మా అని కళ్ళు మూసుకుని గట్టిగా చెప్పాలి

అప్పుడేమో మా బామ్మ వింటుంది. అమ్మ వింటే లాభం లేదనుకో.

అమ్మ వింటే నవ్వేసి, యిలా బుగ్గమీద గిల్లేసి, మహా అయితే ముద్దు పెట్టుకుని వెళ్ళిపోతుంది.

నాన్నకి వినపడినా లాభం లేదు.

అందుకని బామ్మకి వినేలా, చెప్పు

ఒక పెద్దమనిషి టూత్ బ్రష్ కావలసివచ్చి షాపులోకి వెళ్లాడు. షాపువాడు రెండురకాల బ్రష్‌లు చూపించాడు. ఒకటి మెత్తగా వుంది. రెండోది గరుకుగా వుంది ఏది తీసుకుందామా అని పెద్దమనిషి తటపటాయించాడు.

"రెండూ తీసుకెళ్ళండి. ఏది బావుంటే అది ఉంచుకుని, రెండోది రేపు తీసుకురండి," అని చెప్పాడు షాపువాడు.

పెద్దమనిషి ఆశ్చర్యపడి సరేనని రెండూ తీసుకువెళ్ళాడు. మర్నాడు మెత్తటిబ్రష్ తీసుకువచ్చి ఇచ్చాడు.

"మెత్తటిది మీకుగూడా పని[illegible]లేదన్నమాట. అదేమిటోనండి, అంతా ఈ మెత్తటి బ్రష్ తీసుకు వెళ్ళడం, మరునాడు తీసుకురావడం— చిత్రంగా లేదూ?" అన్నాడు షాపువాడు.

దేముడికి బామ్మకి మరి కొంచెం చెముడు కదా. అందుకని దేముడికి మరి కొంచెం గట్టిగా చెప్పాలి అంగుడు.

నేను అలా చేస్తే బామ్మ నాకు ఓ సారి బొంగరం, రెండు సార్లు గోళీకాయిలూ కొనిచ్చింది.

నా దగ్గిర గోళీకాయలు చాలా లేవు. ఓ పదిది కూడా లేవు.

ఎదురుగుండా ఉన్న ఇంటిలో కుర్రాడి దగ్గిర పదిది ఉన్నాయి

అంటే వాళ్ళ బామ్మ పదిది గోళీకాయలు కొని పెటింది అనుకోకు. వాడు నా దగ్గిర గోళీలు రెండు కొట్టేశాడు నిన్నో రేపో. ఇలాగే ఇంకోడి దగ్గిర బెల్లించి, డబాయించి లాక్కున్నాడు. అందుకే.

(ఇంకా వుంది)

నెహ్రూ శాంతి దౌత్యం

డిసెంబరు 16 వ తేదీ.

భారత ప్రధాని నెహ్రూ, పలువురు అమెరికన్ ఉన్నతాధికారులు వెంటరాగా 'వైట్ హౌస్' ఆవరణలో అడుగుపెట్టారు. అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ ఎదురువచ్చి "ఈ దేశానికి ఈ గృహానికి మిమ్మల్ని ఆహ్వానించడం నా అదృష్టం" అంటూ ప్రధాన మంత్రితో గౌరవపురస్సరంగా కరచాలనంచేసి లోపలికి తీసుకు వెళ్ళారు.

ఆనాడు ఆకాశం మేఘాచ్ఛాదితమై ఉంది. ప్రపంచ రాజకీయ వాతావరణం కూడా మేఘాచ్ఛాదితంగానే ఉంది.

దేశదేశాల ప్రజల మనస్సులనుపట్టి పీడిస్తున్న యుద్ధభీతిని తొలగించే కృషిచేయడానికే, ప్రపంచంలోకల్లా పెద్దవైన రెండు ప్రజాస్వామిక దేశాల అధినేతలు సమావేశమై మంతనాలు జరిపారు.

నెహ్రూ, ఐసెన్ హోవర్‌లు ఏం మాటాడుకున్నారు?

వీరి చర్చల వివరాలింతవరకూ బయటపడలేదు ప్రపంచ సమస్యలపై ఉభయదేశాల దృక్పథాలను గురించి మాట్లాడి ఉండవచ్చును. భారతదేశపు ఆర్థికావసరాలు అమెరికా చైనాల శత్రుత్వం, సూయజ్, హంగరీ, వలసరాజ్యాల దమన విధానం, సైనికకూటాలు, కాశ్మీర్, గోవా ఇత్యాది అనేక సమస్యలపై ముఖాముఖి నిర్మొగమాటంగా చర్చించి ఉండవచ్చును. చర్చల అనంతరం వెలువడిన సంయుక్త ప్రకటనలో అనేక విషయాలమీద ఉభయులకు ఏకీభావం కుదిరిందనిమాత్రమే ఉందిగాని ఏవిషయాలపై ఏకీభావం కుదిరిందో ఏవిషయాలపై కుదరలేదో వెల్లడికాలేదు.

తొలగిన అపోహలు

అయితే ఈ అగ్రనాయకులచర్చలు అత్యంత ప్రధానమైనవనడంలో సందేహంలేదు. అయిదారు నెలలుగా ప్రపంచ రాజకీయాలు చినికిచినికి గాలివానగా పరిణమించాయి. గాలివాన వెలిసి పరిస్థితులు కుదటబడుతున్న ఈ తరుణంలో ప్రాక్పశ్చిమ ఖండాల ప్రతినిధులవంటి నెహ్రూ, ఐసెన్‌హోవర్‌లు సమావేశమయ్యారు. సమావేశంకూడా సరైన తరుణంలో జరిగింది. అసలీ సమావేశం గడిచిన వేసవిలో జరిగి ఉండవలసింది. అప్పట్లో ఐసెన్‌హోవర్‌కు శస్త్రచికిత్స చేయడం వల్ల సమావేశం వాయిదాపడింది. ఆ తరువాత సూయజ్ సమస్య ప్రకోపించి రాగాన పడింది. తూర్పుయూరప్‌లో కల్లోలం చెలరేగింది. ఇంతలో అమెరికాలో ఎన్నికలు వచ్చాయి. ఐసెన్‌హోవర్ తిరిగి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. నెమ్మదిగా అంతర్జాతీయ పరిస్థితి కూడా సద్దుకుంది. వెంటనే సమావేశానికి అమెరికా అధ్యక్షుడు సంసిద్ధతను వెలిబుచ్చారు. అంతేగాక, అమెరికా, భారత దేశాల మధ్య చాలకాలంగా ఉంటోన్న అపోహాల ఉధృతం కూడా తగ్గింది. భారతదేశం పశ్చిమ రాజ్యాలను కాదని సోవియెట్ కూటమి వైపు మొగ్గుతోందని అమెరికనులు ఇంతకాలంగా ఆగ్రహిస్తూ వచ్చారు. కాని సూయజ్, హంగరీ సమస్యలపై భారతదేశం తన విధానాన్ని స్పష్టపరిచింది. తటస్థ విధానం అంటే అన్యాయం జరిగినప్పుడు తటస్థంగా ఉండడం కాదనీ, సైనికకూటాలకు సంబంధించినంతవరకే తాము తటస్థులమనీ ప్రధాని నెహ్రూ ఉద్ఘాటించారు. ఈజిప్టుపై బ్రిటిష్, ఫ్రెంచి దురాక్రమణను ఖండించడంలో భారత, అమెరికన్ విధానాలు ఇదివరకెన్నడూ లేనంత సన్నిహితంగా వచ్చాయి భారత దేశంపట్ల అమెరికాలో గౌరవం, సుహృద్భావం పెరిగాయి. ప్రధాని నెహ్రూ అమెరికాలో అడుగుపెట్టగానే పత్రికలు ప్రకటించిన ప్రశంసలే ఇందుకు నిదర్శనం.

నెహ్రూకు జోహార్లు

"వలభైకోట జనంమీద ఇంతగా పలుకుబడిగల వ్యక్తి మరొకరు లేరు. సామ్యవాద దిశగా భారతదేశంఅనుసరిస్తున్న మార్గం ప్రత్యేకంగా నెహ్రూ సూచించినమార్గమే. భారత విదేశాంగ నీతికి ఏకైక సూత్రధారుడుకూడా నెహ్రూయే" అని న్యూయార్క్ టైమ్స్ వ్రాసింది. నెహ్రూ మహాపురుషుడనీ, శాంతి రాయబారి అనీ ఇతర పత్రికలు వర్ణించాయి. న్యూయార్కు నగరవాసులు చేసిన సన్మానంలో, నెహ్రూ గొప్పదేశభక్తుడు, రాజకీయవేత్త అనీ, దేశ స్వాతంత్ర్యానికీ, పురోభివృద్ధికి, శాంతి రక్షణకు జీవితం అంకితంచేసిన మహావ్యక్తి అనీ న్యూయార్క్ మేయర్ కొనియాడారు. ఇదంతా నెహ్రూపట్ల వ్యక్తిగతంగానే కాక, భారతదేశంపట్లకూడా అమెరికా వారికున్న సుహృద్భావాన్ని వెల్లడి చేస్తోంది

అమెరికా నైతిక ప్రతిష్ఠ

రెండవ ప్రపంచ యుద్ధం తరవాత కొన్ని సంవత్సరాలపాటు అమెరికాపై ఆసియా దేశాల్లోను, ఇతర దేశాల్లోనూ కూడా గౌరవం ఇనుమడించింది అంతకు ముందు రూజ్వెల్టు కాలంలో అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకి అని పేరుపొందింది. భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అమెరికా నైతికంగా బలపరిచింది. కాని అమెరికా గడచిన ఏడెనిమిదేళ్ళనుంచీ బ్రిటన్ ఫ్రాన్సు మొదలైన వలస రాజ్యాలతో చేతులు కలిపి వ్యవహరించడంవల్లా, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమాలను, భారతదేశంవంటి దేశాల తటస్థ విధానాలను అపార్థంచేసుకుని వ్యవహరించడంవల్లా పూర్వపు నైతిక ప్రతిష్ఠను పోగొట్టుకున్నది. అమెరికా విధానాలు యుద్ధానికి దారితీస్తున్నాయనీ, వలస రాజ్యాలను బలపరుస్తున్నాయనీ ఆసియా, ఆఫ్రికాలలో దృఢమైన భావం ఏర్పడింది. గోవా పోర్చుగల్‌లో భాగమని గత సంవత్సరం అమెరికన్ విదేశాంగమంత్రి డలెస్ ప్రకటించడంతోను, తటస్థవిధానం అవినీతికరమైనదని ప్రకటించడంతోను ఈ భావం బలపడింది.

ఈ పరిస్థితిలో సూయజ్ సమస్య తల ఎత్తింది. సూయజ్ తగాదాలో అమెరికా ఏ పక్షాన్నీ దాదాపు సమర్థించకుండా, ఏ తాటస్థ్యాన్ని ఇంతకాలం తాను నిరసిస్తూ వచ్చిందో దాదాపు ఆ తాటస్థ్యాన్నే అనుసరించింది. నిగ్రహం ప్రదర్శించి శాంతియుత పరిష్కారానికి ఒప్పుకోవలసిందని బ్రిటన్, ఫ్రాన్సులను ఒత్తిడి చేసింది. బ్రిటన్ ఫ్రాన్సులు దురాక్రమణకు దిగినప్పుడు, అవి తన మిత్రరాజ్యాలైనప్పటికీ నైతికంగాను, ఆర్థికంగాను ఒత్తిడిని తీవ్రంచేసి యుద్ధ విరమణకు కొంతవరకూ తోడ్పడింది. ముఖ్యంగా ఈ చర్యతో అమెరికా పేరు ప్రతిష్ఠలు ఆసియా, ఆఫ్రికా దేశాలలో మళ్ళీ పుంజుకున్నాయి. అమెరికా తనవిదేశాంగరాజనీతిని అత్యవసర పరిస్థితులు తటస్థమైనప్పుడు కొంతవరకూ మార్చుకోగలదని దీనివల్ల తెలియవచ్చింది. ఆశాజనకమైన ఈ మార్పును పటిష్ఠంచేసి

అమెరికనులకు ఆసియా ఆఫ్రికా వాసుల దృక్పథాలను వివరించి చెప్పే ఉద్దేశంతోనే భారత ప్రధాని పనిగట్టుకుని అమెరికా వెళ్ళారు.

భారత ప్రధాని అమెరికా యాత్ర ఎంత వరకూ సఫలమయిందో ముందుముందుగాని బయటపడదు.

ఎందుచేతనంటే, ప్రపంచశాంతి అవకాశాలు ముఖ్యంగా అమెరికన్ విధానాల మీద ఆధారపడి ఉన్నాయి.

సైనికకూటాల ఓటమి

అమెరికన్ విధానాలకు మూలకీలకం కమ్యూనిజం వ్యతిరేకత. యూరప్ ఖండానికీ, మధ్యప్రాచ్యానికీ రష్యావల్లా, దూర ప్రాచ్యానికి చైనావల్లా ప్రమాదం ఉందని అమెరికా నమ్ముతోంది. ఈ మూడు ప్రాంతాలను సైనికకూటాల సూత్రంతో కలిపి రష్యా, చైనాలను నిగ్రహించాలని భావిస్తోంది. టర్కీద్వారా అట్లాంటిక్, బాగ్దాద్ కూటాలను, పాకిస్తాన్‌ద్వారా బాగ్దాద్, మనీలా కూటాలను సంధించి బంధించి ఉంచింది. ఈకూటాల రాజ్యాలకు విరివిగా ఆయుధసామగ్రి సరఫరా చేస్తోంది. ఆ రాజ్యాలలో సైనిక స్థావరాలు ఏర్పరచుకుంది.

ఈ సైనికకూటాలను చూసి, వీటికి ప్రతిక్రియగా అటు రష్యా తన సరిహద్దుల్లో ఉన్న ఇతర కమ్యూనిస్టు రాజ్యాలన్నిటినీ కలుపుకుని వార్సాకూటమిని తయారుచేసుకున్నది. ఆ రాజ్యాలలో సైనికస్థావరాలు ఏర్పరచుకుంది.

వీటి ఫలితంగా ఏం జరిగింది?

ప్రపంచం యుద్ధానికి మరింత దగ్గిరిగా జరిగింది!

బాగ్దాద్ కూటమి మూలంగా అరబ్ రాజ్యాల్లో స్పర్థలు, కలతలు ఎక్కువయ్యాయి.

పాకిస్థాన్‌కు అమెరికా చేస్తున్న సైనిక సహాయంవల్ల భారత, పాకిస్థాన్ దేశాల మధ్య విభేదాలు పెరిగాయి.

వార్సా ఒడంబడిక ఫలితంగా తూర్పు యూరప్‌లో రష్యన్ ప్రాబల్యంపై అసంతృప్తి బయలుదేరింది. ఈ అసంతృప్తి హంగరీలో అగ్నిపర్వతంలా ప్రబద్దలైంది.

మరి ఈ సైనికకూటాలు సాధించిన ప్రయోజనం ఏముంది?

చిన్న దేశాలకు పెద్దదేశాల భయం ఎక్కువైంది. జెనీవా చర్చల మూలంగా కొంచెం అణగిందనుకున్న ప్రఛ్ఛన్నయుద్ధం తీవ్రరూపం దాల్చింది.

హంగరీనుంచి, తూర్పు యూరప్‌నుంచి రష్యన్ సైన్యాలు తొలగిపోవాలని అమెరికా, అమెరికన్ మిత్రరాజ్యాలు పట్టుబడుతున్నాయి. జర్మనీనుంచి, పశ్చిమయూరప్ నుంచి అమెరికన్ స్థావరాలను ఉపసంహరించాలని రష్యా పట్టుబడుతోంది.



ప్రపంచ సమస్యలపై అమెరికా, భారతదేశాల దృక్పథాలను చర్చించిన నెహ్రూ, ఐసెన్‌హోవర్.

రద్దుచేయక తప్పదు

ఈ ప్రతిష్టంభనకు పరిష్కారం ఏమిటి?

భారత ప్రధాని నెహ్రూ డిసెంబరు 20వ తేదీన ఐక్యరాజ్య సర్వసభా వేళంలో ప్రసంగిస్తూ పరిష్కారమార్గం సూచించారు. సైనిక కూటాలను వెంటనే రద్దుచేయాలని, ప్రపంచ శాంతికి ముఖ్యావరోధం ఈ కూటాలేనని నిష్కర్షగా చెప్పివేశారు. కొంతకాలం క్రిందటా ఈ సైనికకూటాలకు అర్థం ఉంటే ఉండవచ్చునుగాని, ప్రస్తుత పరిస్థితిలో వీటివల్ల కించిత్తయినా ప్రయోజనం లేదనీ, పైగా హాని ఉందనీ ఆయన చెప్పారు.

"త్వరలో ఏదో ఒకటి తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. పాత పద్ధతులవల్ల ప్రయోజనం లేదని తేలిపోయింది. ఇక వాటిని అనుసరించి లాభంలేదు." అని ఆయన అన్నారు.

ప్రపంచానికి అంతరాత్మ

సైనిక కూటాలను రద్దు చేయడానికి ఇదే తరుణమని చెబుతూ ఆయన చెప్పిన కారణాలివి: అన్యాయం, అక్రమం జరుగుతున్నప్పుడు వాటిని నిరసించగలిగినంత బలంగా ప్రపంచాభిప్రాయం వ్యక్తంకాగలదని ఇటీవలి ఈజిప్టు, హంగరీ సంఘటనలు ఋజువు చేశాయి. ఇంతవరకూ ఏ దేశమైనా అన్యాయం తలపెట్టినప్పుడు, తనకు కొన్ని దేశాలైనా అండగా నిలుస్తాయనే నమ్మకంతో నేరిలపెట్టేది. అలాంటిఅండలేనప్పుడు ఏ దేశమూ ఇకమీద అన్యాయం కొనసాగించలేదని ఇప్పుడు స్పష్టపడింది. దీన్నే మరొకవిధంగా చెప్పాలంటే ప్రపంచానికి అంతరాత్మ అనేది ఏర్పడిందని చెప్పవచ్చును. ఈ అంతరాత్మయే ప్రపంచ శ్రేయానికి కాపుదలగా పని చేస్తుంది. అందుచేత సైనికకూటాలవల్ల ఒనగూడే ప్రయోజనమేమీ ఇకమీద ఉండబోదు.

అంతేకాదు. ప్రబ్బాండమైన అణ్వస్త్రాల ఫలితంగా యుద్ధాల స్వభావమే మారిపోగలదు. యుద్ధం ప్రపంచ వినాశానికి పర్యాయపదమైపోయింది. ఈ పరిస్థితిలో సైనిక స్థావరాలు, కూటాలు నిష్ప్రయోజనమైపోతాయి. అందుచేతకూడా వీటిని రద్దుచేసి సమాధానపడవలసి వుంది. సమితిలో నెహ్రూ ప్రసంగ సారాంశం ఇదే.

సైన్యాల ఉపసంహరణ

పశ్చిమ యూరప్‌నుంచి అమెరికా తొలగిపోతే తూర్పుయూరప్‌లో తామొక్క క్షణమైనా ఉండమని రష్యానాయకులు ఇటీవల ప్రకటించారు. ఈ ప్రకటనను ప్రాతిపదికగా తీసుకుని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులు రష్యాతో ఒప్పందం చేసుకుని ఒక గడువులోగా ఉభయపక్షాల సైన్యాలు ఉపసంహృతాలయ్యేట్లు చెయ్యాలి. ప్రఛ్ఛన్నయుద్ధాన్ని అంతమొందించడానికి జరగవలసిన పనుల్లో ఇది మొట్టమొదటిది; అత్యంత ప్రధానమైనది ఇలా చెయ్యడా

(56-వ పేజీ చూడండి)





అమెరికాలోని భారతరాయబార కార్యాలయంలో ప్రధాని నెహ్రూను చూడడానికి భారతీయులు వచ్చారు. ఒక బాలికతో ముద్దులాడుతున్న ప్రధాని.

★ న్యూఢిల్లీ లేఖ ★

లోను, విమానాల శాఖలోనూ కూడా ప్రవేశ పెట్టడం అవసరం.

ఉత్తరాల బట్వాడా అసమర్థంగా ఉందని తంతితపాలామంత్రి స్వయంగా ఒప్పుకున్నారు.


పోనీ విమానశాఖ సంగతి చూద్దాం. చౌ ఎన్‌లై భారత పర్యటన సందర్భంలో ఆయన వెంట సంచరించడానికి విదేశీ పత్రికా విలేఖరులు ఒక విమానం కుదుర్చుకున్నారు. ఆ విమానంలో వెచ్చదనం కలిగించే ఏర్పాటేమీ లేవట. విపరీతమైన చలితో, తగినన్ని దుప్పట్లుకూడా లేకుండా విలేఖరులు బాధపడ్డారట. వారిలో ఒకరు న్యుమోనియాతో మంచం పట్టారు. భోజనం కూడా ఛండాలంగా ఉందట.

ఇండియన్ ఎయిర్ లైన్స్ కార్పొరేషన్ ఉద్యోగులకు శ్రీ జగ్జీవన్‌రామ్ ఏడాదికి 50 లక్షల రూ.లు ఇచ్చేవారు. కాని ఆ 'కార్పొరేషన్ పరిపాలన ఎంత అధ్వాన్నంగా ఉందో ఊహించలేము. రైల్వేల పరిపాలన యుద్ధకాలంలో ఉన్నంత సమర్థంగా కూడా లేదని అంటున్నారు. శ్రీ జగ్జీవన్‌రామ్, ఫ్రాంక్ ఆంతోనీ ఇద్దరూ లోక్‌సభ సభ్యులే కాని ఒక తేడా ఉంది. రైల్వే కార్మికుల క్షేమానికి జీవితమంతా కృషి చేసిన మనిషి ఫ్రాంక్ ఆంతోనీ, నిన్ననే రైల్వే మంత్రి అయినమనిషి శ్రీ జగ్జీవన్‌రామ్ ఎవరిమాటకు ఎక్కువ విలువ ఇవ్వాలి? విదేశీయులు చెప్పినదానిమీద గాని, కాంగ్రెసేతర సభ్యులు చెప్పిన దానిమీద గాని ఆధారపడి మనం నిర్ణయాలకు రానక్కరలేదు. ఆర్థిక మంత్రి ఇచ్చిన తీర్పులనే మనం నమ్మవచ్చును. ఆయన నియమించే 'పని తనిఖీ' ఉద్యోగులచేత నివేదిక తయారు చేయించాలి. ఢిల్లీ బొంబాయిల మధ్య నడిచే ఫ్రాంటియర్ మెయిల్, ఢిల్లీ కలకత్తాల మధ్యనడిచే పంజాబ్ మెయిల్ ఎలా పని చేస్తున్నవో తనిఖీ చేయించాలి. ఈ 'పని తనిఖీ' సంఘంలో రైల్వేబోర్డు మాజీ అధ్యక్షుడు శ్రీ ఎఫ్. సి. బద్వార్‌ను కూడా నియమించాలి. వారితీర్పును అప్పుడు దేశం అంగీకరించగలదు.

*   *   *

స్వాతంత్ర్యం వచ్చిన తరవాత రాయబార వర్గాలను, రాయబారవర్గాలు వచ్చిన తర్వాత ఆ వర్గాలలో సైనికోద్యోగులను ఏర్పాటు చెయ్యడం ఆనవాయితీ అయింది. భారతదేశంలో ఏదేశపు సైనికోద్యోగి అయినా తనకు కావలసిన సమాచారాన్ని సేకరించుకోవచ్చు. కాని విదేశాలోని మన దేశపు సైనికోద్యోగులు కేవలం అలంకారార్థమేనా, లేక ఏదైనా పనిసాధిస్తున్నారా అని ఒక అనుమానం. ఆ సైనికోద్యోగులు ఉన్న దేశాన్నిబట్టి దీనికి జవాబు లభిస్తుంది. రష్యాలోనో చైనాలోనో ఉన్న సైనికోద్యోగి, అలంకారార్థమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. భాష తెలియకపోవడం ఒక చిక్కు. ఆ దేశాల రక్షణ ఏర్పాట్లు మరొక చిక్కు. పాకిస్థాన్ పద్ధతి మరీ విచిత్రం. పాకిస్థాన్ కామన్వెల్తులో సభ్యదేశం. భారతదేశం కూడా సభ్యదేశమే కాని పాకిస్థాన్‌కు మనిలా, బాగ్దాద్ కూటాలలో సభ్యత్వం ఉంది. పైగా అమెరికానుంచి ఆయుధ సహాయం ముట్టుతోంది పాకిస్థానీ సైనికోద్యోగి న్యూఢిల్లీలో స్వేచ్ఛగా సంచరించవచ్చును అతడు 1947 ఆగస్టు 15 దాకా ఇక్కడే ఉండేవాడుగనుక మన పౌర, సైనికోద్యోగులు చాలమందితో పరిచయముంపైవుం అతడు ఈ దేశంలో ఎక్కడికైనా వెళ్లవచ్చును. ఏ సమాచారం కావల్సినా తెప్పించుకోవచ్చును. కాని మన సైనికోద్యోగికి పాకిస్థాన్‌లో ఇలాంటి స్వేచ్ఛ లేశమైనా లేదు అతనికి అక్కడి అధికారులతో వ్యక్తిగతంగా పరిచయం ఉందో లేదో మన కనవసరం. కాని పాకిస్థానీ సైనికోద్యోగికి ఢిల్లీలో ఉన్న స్వేచ్ఛ భారతీయ సైనికోద్యోగికి పాకిస్థాన్‌లో ఉందా? ఇదేదో పంతానికి పంతులు పోవడంకాదు భారతదేశ రక్షణకు సంబంధించిన విషయం.

పాకిస్థానీ స్త్రీ పురుషులు భారత భూభాగం మీదుగా వెడుతూ ఢిల్లీలో కొన్నాళ్లు గడపడం అలవాటైపోయింది. వీరు ఎవరు తెలిపిలేకుండా చంగులకు వాటికే హాజరవుతూ ఉంటారు. వీరి ద్వారా ఏవేవో సందేశాలు బట్వాడా అవుతున్నాయని పుకార్లు వినవస్తున్నాయి. ఇది నూయజ్ సమస్య అంత పెద్దసమస్య కాకపోవచ్చు కాని భారత పాకిస్థాన్ సంబంధాలను చెడగొట్టడానికి ఇలాంటివి చాలవా? ★



"రెండవ ప్రపంచయుద్ధ చరిత్ర" లో సర్ విన్‌స్టన్ చర్చిల్ ఒక చోట నౌకా శాఖా మంత్రి సర్ డడ్లీ పౌండ్ ఆరోగ్యం బాగా లేదని రాజీనామా ఇవ్వడం, ఆయన తర్వాత ఎవర్ని నియమించాలా అని ఆలోచనలు జరగడం ప్రస్తావించారు.

"ఆయన స్థానంలో ఎవర్ని వేద్దామా అని చాలా తర్జనభర్జనలు జరిగాయి. మధ్యధరాసముద్ర రంగంలో జరిగిన యుద్ధాలన్నిటిలోనూ పేరుపొందిన ఎడ్మిరల్ సర్ ఆండ్రూ కనింగ్‌హామ్ ఆ పదవికి సమరుడని తోచింది. ఆయన పేరును ఫస్ట్ లార్డ్ అలెగ్జాండర్ సూచించారు. కాని మధ్యధరా రంగంలో యుద్ధం తీవ్రంగా ఉన్న ఆసమయంలో సర్ ఆండ్రూ కనింగ్‌హామ్‌ను ఆరంగంనుంచి తొలగించినట్లయితే ఆ రంగం దెబ్బ తినవచ్చును. హోమ్ ఫ్లీట్ అధికారిగా ఉన్న అడ్మిరల్ ఫ్రేజర్ కూడా నౌకాధికారిగా మంచి పేరు సంపాదించారు. అడ్మిరాల్టీ పరిపాలనలోను, పనిలోను ఆయనకు బాగా అనుభవం ఉంది. అసలు మొదట్లో నేను ఆయనకే నౌకా మంత్రి పదవిఇద్దామని అనుకొన్నాను దాని మీద అడ్మిరల్ ఫ్రేజర్ తన నెక్కడికి పంపించినా వెళ్ళడానికి అభ్యంతరం లేదనీ, కాని ఆండ్రూ కనింగ్‌హామ్ ఒక్కరే ఆ పదవికి అర్హులనీ చెప్పారు.

'నా క్రింద పనిచేసే నౌకాదళానికి నా మీద పూర్తివిశ్వాసం ఉన్నది. కాని కనింగ్‌హామ్ అన్ని నౌకాదళాల విశ్వాసవిధేయతలూ చూరగొన్నారు' అని ఫ్రేజర్ అన్నారు కనుక మళ్లీ ఆలోచించవలసిందని నన్ను కోరారు"

సర్ విన్‌సన్ హైవిధంగా వ్రాశారు.

సర్ డడ్లీపౌండ్ గాని, అడ్మిరల్ ఫ్రేజర్ గాని మన కేంద్ర ప్రభుత్వ మంత్రుల్లాగా గాంధీజీవద్ద శిష్యరికం చెయ్యలేదు. గాంధీజీనుంచి స్వార్థ రాహిత్యం, కఠోర వ్రతం, సేవానిరతి నేర్చుకునే భాగ్యం వారికి పటలేదు. అయినా సర్ డడ్లీ పౌండ్ అనారోగ్య కారణంగా తన ఉన్నత పదవికి రాజీనామా ఇచ్చినట్లు, మన మంత్రులెవరూ అనారోగ్యంతో బాధపడుతున్నా రాజీనామా ఇవ్వడానికిగాని, రిటైరు అవడానికిగాని ఒప్పుకోవడం లేదు. కొందరు దాదాపు గుడ్డివాళ్ళైపోయారు. కొందరికి బ్రహ్మ చెముడు వచ్చింది. కొందరు వారానికి కనీసం మూడు రోజులైనా మంచం పడుతున్నారు. కొందరు మంత్రులను రాజీనామా ఇమ్మని ప్రతిపక్షంవాళ్లు కాదు, కాంగ్రెసువాళ్లే ఒత్తిడి చేస్తూ ఉన్నారు. కొందరు మంత్రులు 1946 సెప్టెంబరు 2 నుంచీ, అంటే, స్వాతంత్ర్యానికి ఏడాది ముందునుంచీ గద్దె మీద తిష్ఠ వేసుకుని ఉన్నారు వీళ్లు తమని పదవినుంచి తీసేస్తే తమ తెలివితేటలు వృథా అయిపోతాయనీ, 'మీరు తప్పుకోవద్దు, మీరు లేకపోతే ఎలా?' అని ఎవరో తమ్ము బలవంతాన పట్టి ఆపుతున్నారనీ అంటూరు.

'నాకంటె నాతోటి ఉద్యోగి సమర్థుడు; అతనికే ఆ పదవి ఇవ్వండి' అని అనగలిగిన అడ్మిరల్ ఫ్రేజర్‌కున్న ఔదార్యం మన మంత్రులలో ఎవరికీ లేదు. పదవులకోసం పాకులాటలో ప్రధాన మంత్రి ఇరుకున పడిపోతున్నారు. ఆయన కొందరిని విధిలేక సహించి ఊరుకుంటున్నారు. కాని చాలా మందిని తొలగించి వేసే అవకాశాలున్నాయి. వారెవరయా అనేది దేవరహస్యం కాదు.

* * *

పర్లిమెంటరీ గ్రాంట్లను లోక్ సభ ఆమోదించింది. రైల్వేలపై వచ్చిన విమర్శలకు జవాబిస్తూ కొత్త రైల్వే మంత్రి శ్రీ జగ్జీవన్ రామ్ "పరిస్థితి ఫ్రాంక్ అంతోనీ చెప్పేటంత పాడుగా లేదని నేను చెప్పగల" నన్నారు. రైల్వే పరిపాలనను బాగుచెయ్యడానికి పూర్వపు మంత్రి కృషి చేశారనీ, ఆకృషిని తాను కొనసాగించుతాననీ, రైల్వే ఉద్యోగులకు ఫించనుస్కీమును గూర్చి కూడా తానాలోచిస్తున్నాననీ, స్కీము ఇప్పటిఉద్యోగులకు కాకపోయినా కొత్తగా చేరే ఉద్యోగులకు నిర్బంధంగా ఉంటుందని చెప్పారు.

"చేసినపనిని తనిఖీ చేసే పద్ధతి" ని తాను ప్రవేశపెడుతున్నానని ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి రాజ్యసభలో వెల్లడించారు. ఈ సందర్భంలో ఆయన ఒకో నౌకమంత్రిగారి శాఖ ప్రసక్తి తెచ్చారు. ఆ శాఖలో ఉద్యోగులు గడచిన 90రోజులలోనూ ఏం పని చేశారో తనిఖీ చెయ్యమని తాను తన ఆఫీసర్లలో ఒకర్ని పురమాయించారట. ఆ ఉద్యోగులు 90 రోజుల్లోనూ 80 గంటలో 90 గంటలలో మాత్రమే పని చేశారని తనిఖీవల్ల తేలింది. అంటే రోజుకొక గంటపని మాత్రమే జరిగిందన్న మాట. ఆ శాఖ మంత్రిగారు జగ్జీవన్ రామ్ గారి లాగానే తన శాఖ రోజురోజుకీ చురుకుగా పని చేస్తోందని బడాయిగా చెప్పుకున్నారు. నిజానికి రోజురోజుకి గంట గంటమాత్రమే ఆ శాఖలో ఉద్యోగులు పనిచేస్తున్నట్లు తనిఖీవల్ల తేలింది.

రైలు ప్రయాణాల ఇబ్బందుల్ని గూర్చి ప్రయాణికు లెంత మొత్తుకున్నా, మంత్రిగారు, అందులో లోక్ సభలాంటి చోట, రైలుప్రయాణాలు బావుంటున్నాయని చెప్పేసిన తరవాత, ప్రయాణికుల మొరాలకించే దెవరు? "పని తనిఖీ పద్ధతి" వల్ల నిజానిజాలు తేలే అవకాశాలున్నాయి. ఈ పద్ధతిని ఆర్థికమంత్రి రైల్వే శాఖలో నే కాక, ఇప్పటి దాకా జగ్జీవన్ రామ్ గారి అజ్మాయిషీలో ఉన్న తంతి, తపాలాశాఖ

మంత్రాల మహిమను సమర్థిస్తూ వ్రాసేవారిలోను, ఈసడిస్తూ వ్రాసేవారిలోను, మంత్రాలను స్వయంగా పరీక్షించి నిజానిజాలను తేల్చుకున్న వారెవ్వరూ దాదాపు లేరనే చెప్పాలి. ఫలానావారు గొప్ప మంత్రవేత్త అని ప్రతివారూ వ్రాయడమేగాని స్వయంగా మంత్రవేత్తలైన వారెవరూ ఈ వివాదంలో పాల్గొనడానికి ముందుకు రాకపోవడం శోచనీయం. ఈ దిగువ లేఖ వ్రాసినవారు స్వయంగా మంత్రాలు నేర్చుకొని, వాటిలో శక్తిలేదని గ్రహించినట్లు తెలుపుతున్నారు. మంత్రాలశక్తిని నిరూపించండని వేత్తలకు సవాలు చేస్తున్నారు. సమర్థులైనవారు ఈ వివాదంలో పాల్గొనేట్లు ఈ లేఖ ప్రేరేపించగలదని ఆశిస్తున్నాము.

★ మంత్రాలు: నమ్మకాలు ★

మంత్రం అంటే వట్టి మూఢ నమ్మకమే

మంత్రములలో శక్తిలేదని కేవలము మూఢనమ్మకమే తప్ప మరేమీ కాదనీ నేను అనుభవపూర్వకముగా గ్రహించాను.

ఒకప్పుడు నేను, మా చిన్నాయనగారు- ఒక పేరుబడిసిన పాముమంత్రగాని వద్ద - అమావాస్య - ఆదివారము ప్రొద్దు-పాము మంత్రము నేర్చుకొన్నాము.

మా గురువుగారు వారి కాలములో- పోయే పాములను నిలిపేవారని - కరిచి పారిపోయిన సర్పరాజును సహితము మంత్రబలిమిని, రప్పించి విషమును మరల పీల్చి-వెళ్లునట్లు చేయగలిగేవాడని ప్రతీతి ఇప్పటికీ ఆమంత్రము-నావద్ద జాగ్రత్తపరుచబడి వుంది - నేను దాన్ని అనుసరించుట లేదుగాని - మా బాబాయిగారు - తురాయి కట్టుతూనే వున్నాడు, విషాలు నల్పుతూనే వున్నాడు

నేను తొలుత నిష్ఠగా అహోరాత్రులు స్మరించాను. అప్పటికే నన్ను మంత్రవేత్తగా తలంచేవారు జనము - నాచే యిసుక మంత్రింపించుకొని తీసికొనివెళ్లేవారు-అయిసుక జల్లిన తావులకు పాములు రావని నమ్మిక.

ఈ మంత్రము మంచి దేవని చెప్పుకుంటుంటేవారు. వాలో నేను తర్కించుకొని ఒకతూరి మంత్రించిన యిసుకతో వొక నాగుపాము చుట్టూ జల్లి మాచినాను. కాని అది యిసుక జల్లిన స్థలముదాటి సురక్షితముగా వెళ్లిపోయినది - అప్పట్ల నా మంత్రముయొక్క ప్రభావముపై నమ్మిక సడలుట మొదలు పెట్టినది. ఒకతూరి ఒకపాము కరచిన వానిపై మంత్రించినాను. కాని ఆపాము - నీటిపాముగా తరువాత తెలియవచ్చినది. పాము కరచినవారు బ్రతికినారు.

ఒకతూరి, త్రాచుపాముచే కరువబడి, పడిపోయినవారిని నావద్దకు తెచ్చినారు. వారికి నేను మంత్రము పెటినాను. కాని నామనస్సు వుండబట్టలేక, వానిని వెంటగొని పాములనరసయ్యగారిచే మంత్రము పెట్టించుటకు, రైల్వేస్టేషనుకు తీసికొనిపోయినాను. శ్రీ నరసయ్యగారికి ఫోను చేయబడినది వారు మంత్రించినారు-కాని-పాము కరువబడినవారు - లేవలేదు - చచ్చిపోయినారు.

తదుపరి నాకు మంత్రములయందు నమ్మిక తగ్గి - నేను మంత్రముల పెట్టుట మానినాను- నేను - పాముమంత్రము పెట్టుట వదలిపెట్టినప్పటినుండి దాని నిజానిజములు కనుగొన ప్రయత్నించుట నాకు పరిపాటి.

ఆంధ్రదేశమున ముఖ్యముగా పాము మంత్రములలో మేటి-ఆయన మంత్రముతో, చచ్చినవారు బ్రతుకగలరని ప్రతీతిగలవారు శ్రీ పాముల నరసయ్యగారు. వారు మంత్రము పెటుట స్వయంగా నేను చూడలేదుగాని - పాము కరిచి - స్పృహతప్పినవారిని పాముల నరసయ్యగారిచే మంత్రము పెట్టించుటకు రైల్వేస్టేషనుకు తీసికొనిపోవువారి వెంట చాలసార్లు వెళ్ళినాను.

అచ్చట వారు చెప్పినట్లుగా - ఈపాము కరువబడినవారివద్ద - పాగాకు, తాళాలు - యిత్యాదులైన వస్తువులను తీసివేయుట - ఆచారము. తదుపరి పాముల నరసయ్యగారు చెప్పమన్నట్లుగా-"పాముల నరసయ్యగారు చెప్పినారు లెమ్మని - పాము కరువబడినవాని చెవివద్ద అదేపనిగా, చెప్పించుతారు.

కొందరు కొంతసేపటికి లేచి తిరుగుట, కొందరు చనిపోవుట జరుగుతుంది. నేను రెండుతూర్లు పాముకరచినవానివెంట రైలుస్టేషనుకు వెళ్లుట జరిగినది.

రెండు తూర్లు మనిషి చనిపోవుట జరిగినది. విచారించగా కరచినపాము-త్రాచుపాముగా తేలింది

మూడవతూరి, నేను అచ్చట వుండగా- ఒక పాముచే కరువబడి నురుగులు కక్కుకొనుచున్న వాని చెవిలో - పాముల నరసయ్యగారు చెప్పమన్నట్లు చెప్పినారు. ఈ తూరి ఒక గంటలోపల మనిషి, తెలివిగల్గి బ్రతుకుట జరిగింది.

ఈ తూరి విచారించితే కరచినది త్రాచుపాము కాదని తెలియవచ్చినది.

ఈవిషయాలు స్వయముగా చూచినాను. ఇలాగే ఇంకా ఎన్నో నా అనుభవంలో జరిగాయి.

వీటిని బట్టి ఆలోచించితే తేలే విషయాలు యివి :—

(1) కరచినపాము ఏజాతిదో చూడాలి- అది త్రాచుపాము అయితే అది సరిగా-విషము తిత్తులనిండా వున్నప్పుడు కరచినచో-మనిషి బ్రతుకడు. ఇది సత్యము.

(2) కరచిన పాము యితర జాతికి చెందినదైతే, అంటే కరిస్తే ప్రాణహానిలేని జాతిపాములు కరచిన-మంత్రముల సాకుతో- బ్రతుకుతున్నారు - అప్పుడు మంత్రము వేయకపోయినా జీవించగలరు. అట్లుగాక, పాము మంత్రమునకు ప్రభావము వుంది- అని రుజువు చేయగలవారు, తమ స్వంత బాధ్యతపై ఒకరిపై ప్రయోగించి, పాము

(30-వ పేజీ చూడండి)

బొంబాయి సినిమాలేఖ

ఒకప్పుడు సభ్యురాలుగా వున్న శ్రీమతి జ్యోత్స్న పి. భట్ ఈ సభను ఏర్పాటు చేశారు. బొంబాయి సంక్షేమమంత్రిణి కుమారి ఇందుమతి చిమన్‌లాల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మొట్టమొదటి టెక్నికలర్ చిత్రం (ఝాన్సీ-కీ-రాణి) నిర్మించిన భారతీయ నిర్మాత శ్రీ సొహ్రాబ్ మోడీకీ, ఆయన భార్య శ్రీమతి మెహతాబ్‌కు సన్మానం చేశారు.

ఆఖరిరోజు, డిసెంబరు 22న వల్లభ్ భాయ్ పటేల్ స్టేడియంలో శ్రీ దివాన్ షరార్, చలనచిత్రోత్సవ సంఘాల సంయుక్త ఆధ్వర్యాన వినోద కార్యక్రమం జరిగింది. నటుడు జైరాజ్ నిర్వహించాడు.

ఈ సభలోనే, చలనచిత్ర పరిశ్రమకు మార్గదర్శకులు అయిన శ్రీ అర్దేషిర్ ఇరానీ, మాస్టర్ విఠల్, ఆది ఇరాని, అబ్దుల్ అలీ, యూసఫ్ అలీ (ఈయన "ఆలం ఆరా" నిర్మాణంలో అర్దేషిర్ ఇరానికి భాగస్వామి.) లకు సత్కారం జరిగింది.

ఉత్సవం ఒకవిధంగా శెభాసనిపించుకో తగినట్టు సాగింది. మరోవిధంగా అభాసు అయిందనాలి.

టిక్కెట్టు కొల్లలుగా అమ్ముడుపోయినందువల్ల ఆర్థికంగా ఇది ఘనవిజయం. అయితే, చూడవచ్చినవారు, ముఖ్యంగా 2-10-0 పెట్టి టిక్కెట్టుకొన్న అధిక సంఖ్యాకులు, స్టేజికి ఆమడ దూరాన కూర్చోవలసి వచ్చింది. వాళ్లకి స్టేజిమీద లీలగా ఏవో శాల్తీలు అటూ ఇటూ తిరుగుతున్నట్టు మాత్రం గోచరించింది. అందుకని వాళ్లంతా నిరసనగా కేకలువేశారు. అధ్యక్షతవహించిన శ్రీ హెచ్. పి. మోడీ, నిర్వాహకుడు శ్రీ సొహ్రాబ్ మోడీల ప్రసంగాలు సవ్యంగా సాగడానికి ఈ గోల మూలాన చాలా అవరోధం కలిగింది.

పత్రికా ప్రతినిధులకు ఏర్పాటుచేసిన స్థానాలు కూడా స్టేజికి దూరంగానే ఉన్నందువల్ల ఎవరేం చేస్తున్నదీ సులభంగా తెలియడం కష్టం అయింది.

ఆరోజున అనిల్ బిశ్వాస్ ఆధ్వర్యాన వాద్యబృందం సంగీత కార్యక్రమం ఉత్తమంగా ఉంది. తరవాత తలత్ మహమూద్ సుధామల్హోత్రా కొంతసేపు పాడారు. తెలుగు నాట్యతార వహీదా రెహమాన్ భరతనాట్యం చేసింది నరీస్ "ఏ చక్ దా నా" (శ్రీ 420 లోది) నృత్యం, సితారా కథక్ నృత్యం చేశారు. జానీవాకర్, అన్వర్ హుసేన్‌లు హడావుడిచేశారు. తరవాత రాజ్‌కపూర్ స్టేజి ఎక్కాడు..

ఈ ఉత్సవంకూడా, నటీనటులలో అధిక సంఖ్యాకులు గైరుహాజరు అయినందువల్ల ఆశించినంత శోభాయమానంగా, ఉత్సాహభరితంగా భాసించలేదు.

ఇండో చైనీస్ చిత్రం

చైనాతో కలసి ఒక చిత్రం నిర్మించడానికి ఇక్కడి ఫిలిం టెక్నీషియన్లు కొందరు ఆలోచనలు జరుపుతున్నారు. ఇటీవల చైనీస్ ప్రధాని ఇక్కడికివచ్చి ఇష్టాగోష్ఠి నెరపి వెళ్ళినమీదట వీరికీ సంకల్పం కలిగింది.

ఈ సంయుక్త నిర్మాణానికి "అండర్ త బ్లూస్కై" అని పేరు పెట్టారు. కథ, చైనా బర్మాలలో జరిగినట్టు చిత్రిస్తారట. దీనికి రామానంద సేన్‌గుప్త, దిలీప్ నాగ్, సత్యేన్ చటర్జీ, డా॥ భూపేన్ హజారికాలు సమష్టిగా దర్శకత్వం నిర్వహిస్తారు.

'పథేర్ పాంచాలీ' చిత్రంలో పాల్గొన్న శ్రీమతి కరుణా బెనర్జీ ఇందులో ఒక చైనీస్ నటునితో కలసి ఒక ప్రముఖ భూమిక నిర్వహించగలదని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని హిందీ, చైనీస్ భాషలలో నిర్మిస్తారు. ★



అన్నపూర్ణావారి "తోడికోడళ్లు" చిత్రంలో జగ్గయ్య, సూర్యకాంతం, రేలంగి.


మాంత్రికుడు
మాండ్రేక్
కల్పన, రచన:
...లీ ఫాక్, ఫిల్ డేవిస్...
నార్దా అనే యువతి, అర్ధరాత్రివేళ శ్మశానంలో .... ఎగిరిపోయిన టోపీ వెతుకుతూ ఉంటే....
చ్...బాబోయ్! దె..దె.య్యం.పు.చెయ్యి, పట్టుకుంది! ఎలాగైనా విడిపించుకోవాలి....
అమ్మ! బయటపడ్డా
పోతే పోనీకా
ఎందుకా పిల్లచేయి పట్టుకున్నావ్!

'చైతన్య'

చలపతిరావు, కరణం రంగనాధరావుగారింటికి చేరేసరికి యింకా సూర్యాస్తమయం పూర్తిగా కాలేదు. రంగనాధరావుగారి గొంతుక కొంచెం గంభీరంగానే వినిపిస్తున్నది.

"ఓం అగ్నిశ్చ, మా మన్యుశ్చ, మన్యుపతయశ్చ, మన్యుకృతేభ్యః పాపేభ్యోరక్షన్తాం, యదాహ్నా పాపమకార్షం మనసా, వాచా, హస్తాభ్యాం పద్భ్యాముదరేణ శిశ్నా..."

ఆచమనమంత్రాన్ని వినటంతోటే సిగ్గుపడ్డాడు చలపతి; తాను బ్రాహ్మణుడై పుట్టి సంధ్యావందనానైనా నిత్యవిధుల్లో చేర్చుకుని నిర్వర్తించలేక విసర్జించినందుకు. రంగనాథరావుగారి అనుష్ఠానం పూర్తికావటానికింకా ఆలస్యముందిగదా యీ లోగా రంగయ్యశ్రేష్టి నన్నా చూచివద్దామని సరాసరి శ్రేష్టిగారింటికి వెళ్లాడు. ఏడు గంటలు దాటలేదమో ఇంకా అప్పటికి "శివాలయానికెళ్లారు" అని శ్రేష్టి భార్య వరహాలు చెప్పటంతో పోనీ యీ రూపేణానన్నా శివదర్శనం చేసుకున్నట్లవుతుందని సంతోషిస్తూ శివాలయానికి దోవతీశాడు.

శివాలయానికి ప్రదక్షిణంచేసి లోనికి వెళ్లిన చలపతిరావుకు, చేతిలో చేయివేసికొని, వడుముకు గుడ్డ బిగించి, అరమోడ్పు కన్నులతో ధ్యానముద్రలో నిలబడిన రంగయ్యశ్రేష్టి కన్పించాడు. శ్రేష్టి పెదవులు శ్రేష్టి భగవద్ధ్యానంలో మునిగివున్నాడని అడగకుండానే చెపుతున్నయ్. రంగయ్యశ్రేష్టికి మరే ధ్యాసా లేదని చలపతిరావు కొట్టిన గంటలూ, పూజారి చేయిజారిపడి గొల్లున గోలపెడుతూ చిందరవందరగా పడిపోయిన తీర్థంచెంబు, వుద్ధరిణా, రుద్రపాదాలూ కూడా అతన్ని చలింప జేయలేకపోవటం వల్ల గ్రహించగలిగాడు చలపతిరావు. శ్రేష్టి అదృష్టానికి చలపతికి యీర్ష్య కూడా పుట్టింది, జన్మ ఎత్తినందుకు తాను శివరాత్రి శివరాత్రికైనా శివదర్శనం చేసుకోలేకపోగా, యీ శ్రేష్టి యీ రోజూ ఆ రోజూ అనకుండా 'ప్రతినిత్యం' ఆ మహాద్భాగ్యాన్ననుభవిస్తున్నందుకు.

"నాగేంద్రహారాయ త్రిలోచనాయ... తస్మై నకారాయ నమశ్శివాయ" అన్న శివానంద లహరిలోని శివపంచాక్షరీ ధ్యాన శ్లోకాన్నీ, తరువాత "పాప పంకిలాన్ని క్షాళనం జేసి పునీతుణ్ణి జేయుమయ్యా! మహేశా! పాప జనోద్ధారకా!" అనే అర్థాన్నిచ్చే మరో శ్లోకాన్నీ, సజల నయనాలతో అతిదీనుడై తలమోడ్చి, వల్లించి సాష్టాంగ నమస్కారంజేసి నిలుచుని, అతులితభక్తిని లెంపలు వేసికొని ప్రదర్శించి, పూజారి పున్నయ్య "పాదోదకం పావనం శుభం" అని యిచ్చిన తీర్థాన్ని పుచ్చుకొని, "శ్రీ ఉమామహేశ్వర ప్రసాద సిద్ధిరస్తు" అని దీవిస్తూ యిచ్చిన రుద్రపాదాలను స్వీకరిస్తూ, 'అరణా' కాసును పళ్ళెంలో ఘలుమనేట్లు వేసి, విభూతినీ మారేడు దళాలను గ్రహించి, విభూతిని భక్తి శ్రద్ధలతో పూసుకొని, మారేడుదళాలను నంది ముఖంపైన వేసి నమస్కరించి, మూపురంమీదుగా శివలింగాన్ని దర్శించి "హరహరా మహాదేవా!" యని లేచి, మళ్లీ లెంపలు వేసుకుని- నందిమూడుమీది మారేడు దళాన్ని భక్తితో పుచ్చుకుని తలమీద వేసుకొని, ఉమాదేవి దర్శనం చేసుకొని, పూజా కుంకుమ నుదుట ధరించి, సరాసరి ఆలయపు మంటపంమీదకు చేరి "మహేశా! మహేశా!" అంటూ కూర్చునితనవెంట అనుసరించివస్తున్న చలపతిరావును చూచాడు శ్రేష్టి. చలపతిరావు కళ్ళు నిజంగా చెమ్మగిల్లాయి; శివదర్శనం జేసుకుందుకింత కాండ ఉందనైనా తనకు తెలియనందుకు.

చలపతిరావును హస్తసంజ్ఞతో ప్రశ్నించాడు శ్రేష్టి ఎప్పుడు రావటమని. వెంటనే తనవెంట రమ్మని చేతితోనే చెప్పాడు. అప్పటికే దాదాపు ఎనిమిదిగంటలు కావటం వల్లా, మరెవరూ వచ్చేవాళ్ళు లేనందువల్లా గుడికి తాళం వేసి పూజారి పున్నయ్యకూడా వీళ్లననుసరించాడు. త్రోవలో పున్నయ్య చలపతిరావుకు శ్రేష్టి చాలా భక్తిపరుడనీ, నాగాలేకుండా దేవాలయానికి వస్తాడనీ, శివాలయంనుంచి విష్ణ్వాలయానికి వెళ్ళి అక్కడ భజన పూర్తయ్యేకగాని, యెవరితోనూ మాట్లాడడనీ. పూజారియిల్లు రావటంతో పున్నయ్య చీలిపోయాడు. చలపతిరావూ శ్రేష్ఠి గోపాలస్వామి ఆలయానికి చేరుకున్నారు.

* * *

గోపాలస్వామి ఆలయాన్ని చిన్న గుడంటారు రావూరులో. ఎప్పుడో గుడికట్టించినప్పుడు పరచిన పెద్ద పెద్ద బండలు నునుపు దేలిపోయాయి గుడిముందు. ఆ బండలమీద భజనపరులంతా ఆసీనులై ఉన్నారు రెండు వరుసలుగా యెదురెదురుగా. ఓ వరుసకు తలవైపు కరణం రంగనాధరావుగారు చేతిలో జేగంట పుచ్చుకుని పట్టుపంచెతో కూర్చున్నారు. వారి యెదురు శ్రేణిలో జగన్నాధంగారు మరోజత తాళాలతో కూర్చున్నారు. వారివెంట రాయసంవారూ, వారి తర్వాత సాతాని తాతయ్య; తాతయ్య కెదురుగా ఖాళీలో చతికిలబడ్డాడు రంగయ్య శ్రేష్ఠి కరణంగారి శ్రేణిలో. ఈ శ్రేణికెదుటి శ్రేణిలో మునసబు రంగారెడ్డి పంగనామాలూ, పట్టెవర్ధనాలతో వో జతతాళాలు తీసుకొని కూర్చొనున్నారు. భజన పరులంతా యిక సంసిద్ధంగా వున్నామన్నట్టు తాళాలు చప్పుడు చేయసాగారు. మునసబు రంగారెడ్డి "కానివ్వండి కరణంగారూ!" అన్నప్పుడు గుర్తించాడు మునసబును. వెంటనే మళ్ళీ జీవితంమీద విరక్తివంటిది పుట్టుకొచ్చింది చలపతికి. పంగనామాలూ, పట్టెవర్ధనాలూ తీర్చి, పిలక ముడి వేసుకొని భజనకు వచ్చిన మునసబును చూడగానే; అంతా భగవంతుణ్ణి గురించీ పరలోకాన్ని గురించి ఇంత పాటుపడుతుంటే తను యీ సంసారపు జంజాటంలో పడి వుక్కిరి బిక్కిరయిపోతూ జీవితాన్నంతా ఇహ చింతలతోనే వృధా చేస్తున్నందుకు.

తాళాలు ఆదితాళంలో ధ్వనితరంగాల్ని కలిగిస్తున్నయ్. భజన బృందమంతా రంగనాధరావుగారు చెపుతున్న కీర్తనను పాడుతున్నారు. సజీవంగాని మృదంగం సైతం భగవద్భజనను విని సజీవమై 'తక తక' ధ్వనులను పుట్టిస్తూ తన జీవితాన్ని ధన్యం జేసుకుంటున్నది. చైతన్యరహితమయిన జేగంట

★ రావూరి రంగయ్యలు ★

చైతన్యవంతమై భగవత్కీర్తనలు జీవితాన్నర్పిస్తున్నది. అతి భవ్యమై, ఈయందుకో సిగ్గుపడుతూ, మరెవ్వరికీ వినిపించని అంతటి స్థాయిలో చలపతి పాడుతున్నాడా పాటను. "ప్రారబ్ధము లెల్ల తీరక చేసితి నేరములెంచకు రామా! పావనా నీ పాలను బడితిని పరిరక్షింపుము రామా! శ్రీ రఘునందన సీతారమణా శ్రిత జన పోషక రామా!" అరమోడ్పు కన్నులతో కూర్చొని కరిగిపోయాడా ప్రార్థనలో చలపతి. హృదయం ద్రవించి రసం వెల్లువికి కంటిధారతో గానంచేశాడు. తాళగతి మారింది. తాడనగతి మారింది. రాగధోరణి మారింది. రస మింకిపోతున్నట్లయి కండ్లు తెరచిన చలపతిని కర్ణేంద్రియాలూ చక్షురింద్రియాలు వెక్కిరించాయి నీవా తాళాన్ని వేయగలవా? అన్నట్టు ప్రశ్నించి తదేకధ్యానంతో అవగాహనజేసికో ప్రయత్నిస్తున్నాడా తాళాలను చెవులు రిక్కించి వింటూ. "జై శ్రీమద్రమారమణ గోవిందా హరి!" అని గోవిందకొట్టారు. తాళాలు నిలచాయి. మృదంగం శ్రుతి సరిజేసికొంది. భజన పరులంతా వోరూరు మారులు కుడుచుకున్నారు.

శ్రేష్ఠి 'వూ' అని కొద్దిగా ఆలాపనజేసి అందుకున్నాడు. "ఎవడబ్బ సొమ్మనియ్యా? రామచంద్రా! సీతమ్మకు జేయిస్తి చింతాకు పతకాము రామచంద్రా!" అని. తాళాలు తాళాన్నందుకున్నయ్. మృదంగం మృదువుగా వరుస నందుకుంది. భజనపరులు పాట అందుకున్నారు. "ఆ పతకాముదనూ బట్టె పదివేల వరహాలు రామచంద్రా!" భద్రాద్రి రామన్నా, కంచర్ల గోపన్నా మెదిలారు చలపతి హృదయంలో. పాట నడుస్తున్నట్లల్లా గోపన్న చెప్పించి కట్టించిన ప్రహారీలదగ్గరనుంచి, రామయ్య కురాయీ, సీతమ్మ చింతాకు పతకమూ, లక్ష్మయ్య పచ్చలపతకమూ అన్నీ వరుసన రూపులు కల్పించుకున్నాయి చలపతి అంతర్దృష్టిలో. "అదిగో భద్రాద్రీ, గౌతమి యిదిగో, చూడండీ!" మునసబు రంగారెడ్డిదీ గొంతుక. "మునముందు సీతా మాదేవి, లక్ష్మణుడూ చేరి కొలుస్తుండగా, భరతుడు దండాన్ని ధరించి వో వైపూ, శత్రుఘ్నుడు వింజామర వేస్తూ మరోవైపూ, పాదసేవ జేస్తూ పవనసుతుడూ వుండగా పట్టాభిరామయ్య నీలమేఘచ్ఛాయతో, పద్మనయనాలతో, ఆజానుబాహువులతో, విల్లును ధరించి, పీతాంబరధారియై" దర్శనమిచ్చాడు చలపతికి. ధన్యుణ్ణయ్యాననీ తలచాడు చలపతి. స్వస్తి చెప్పారు 'లోకాస్సమస్తా స్సుఖినోభవంతు' అని.

ఇవ్వాళ రంగారెడ్డిగారిది అనుపూజ అని వెల్లడిస్తూ శ్రీనివాసాచార్లు 'మంత్రపుష్పం' మొదలుపెట్టారు. తీర్థప్రసాద పానీయాదులు కరణంరంగనాథంగారు పుచ్చుకున్నాక అందరికీ పంచిపెట్టారు. ఎవరిఇండ్లకువారు బయల్దేరారు. రంగనాధ రావుగారు చలపతిని కుశల ప్రశ్నలు వేసి, మన భజనా కార్యక్రమాన్ని ప్రకాశంగా పలికి, "రేపు వుదయం వస్తావు కదూ?" అని అడిగి, అలాగేనని చెప్పించుకొని అందరికీ సెలవిచ్చి వెళ్లారు. సెలవు పుచ్చుకున్న చలపతి శ్రీనివాసాచార్యులింట్లో గడిపాడా రాత్రి.

* * *

చలపతిరావు తండ్రి కడపజిల్లాలోని రాయచోటికి వుద్యోగరీత్యా వెళ్ళి స్థిరపడిపోయాడక్కడ. రావూరిని ఆయన ముప్పై నలభై సంవత్సరాలైంది వదలిపెట్టి. చలపతిరావు జననమూ బాల్యమూ అంతా రాయచోటిలోనే. రావూరును తాతగారి వూరనే అభిమానం కొద్దీ వూహ తెలిసిన తరువాత వొకటి రెండుమార్లు తండ్రితో వచ్చి చూచాడు. ఆ రోజుల్లో రాయచోటిలో వున్న మిడిల్ స్కూల్లోనే మూడవఫారం దాకా చదివి పై చదువుల కక్కడకూ వెళ్లలేక అదే ఘనంగా భావించి సాహుకారు గుమాస్తాగా జీవితాన్ని ప్రారంభించాడు చలపతి. అతను వుద్యోగానికి వచ్చిన కొద్ది రోజుల్లోనే తండ్రి ఖాయిలాపడి వుద్యోగాన్ని విరమించుకోవలసి వచ్చింది. చలపతి రావు సంపాదనకుతోడు రావూరులో వున్న యెకరం నలభై సెంట్ల భూమి మీద వచ్చే ఆదాయంతో, భారమే అయినా, యెట్లాగో కాలాన్ని గడుపుకొస్తున్నారు నోటిమంచితనాన. మరి, కొన్నాళ్లకు సాహుకారు ఐ.పి. పెట్టటం వల్ల ఆ కాస్త ఆధారం కూడా పోయింది. కష్టాలన్నీ కట్టగట్టుకొని వస్తాయంటారు. దీనికి తోడు తండ్రి జబ్బు యెక్కువైంది. ఒక్కగా నొక్క చెల్లి కమల పుష్పవతి అయిం దాదాపే. తల్లి దిగులు తోచన కేడ్చింది అచ్చటా ముచ్చటా తీర్చుకోవటానికి లేకపోయిందని. చలపతి భార్య ఆ రోజే ప్రసవించింది. చచ్చి బ్రతికిం దను కున్నారామె నంతా. ఊళ్ళోనే వున్న అత్తవారూ అంతంత మాత్రపు స్థితిగలవారే గాబట్టి పురిటి కూడా తీసుకోలేకపోయాడు చలపతి. ఎవరో వో ధర్మరాజు దయవల్ల మరో వారం రోజుల్లో 'రోడ్డుమేస్త్రీ' వుద్యోగం దొరికింది చలపతికి. తండ్రి రోగం తగ్గుకొంది. చెల్లికి పెళ్ళి కోరారు. భార్యకు పథ్యం పెట్టారు. అంతా చలపతి అదృష్టవంతు డనుకొన్నారు. బిడ్డ పుట్టిన వేళా విశేషమన్నారు భార్యవైపు బంధువులంతా, ఇదంతా చూసి మురిసిపోవటానికి చలపతి మేస్త్రీకి తీరిక చిక్కలేదు దాదాపుకూడా రోడ్డుమీదికి పోవలసివచ్చే.

ఎప్పుడో అయిదారేండ్ల నాటి దీసంగతి. క్రిందటనెల ఒకటో తారీఖు నాటికి చలపతి యిద్దరు పిల్లలకు తండ్రై, తాను తండ్రిలేని వాడయ్యాడు. చెల్లెలికి మాట్లాడిన సంబంధం శ్రావణంలో వివాహం చేయకపోతే చెడిపోవటానికి సిద్ధంగా వుంది. రోడ్డు మేస్త్రీ వుద్యోగం రూపు మాసి పోయింది దయా దాక్షిణ్యాలులేకుండా. కానీ అర్థనా కూడబెట్టితే తండ్రి దినవారాలు గడచాయి, మరో ఐదో పదో అప్పుతో. ఈ స్థితిలో యేం చెయ్యటానికి పాలుబోక చలపతి రావూర్లోని భూమి అమ్మి, చెల్లెలు పెండ్లయిం దనిపించుకొని, వో నాలుగైదు వందలు మిగిలితే చిల్లర కొట్టయినా పెట్టుకొని కాలం గడపాలని నిశ్చయించుకొని, పదేండ్ల తర్వాత మళ్లీ యిప్పుడొచ్చాడు రావూరుకు. పదేండ్ల క్రిందట తండ్రితో వచ్చినప్పుడు యేర్పడ పరిచయమే చలపతికి, కరణం మునసబులతోటీ, శ్రేష్ఠితోటీ.

* * *

మర్నాడు ప్రొద్దున్నే కరణం రంగనాధరావుగారింటికి వెళ్లాడు చలపతి. అనుష్ఠానాన్ని పూర్తిజేసుకొని, విభూతి రేఖలతో, నవ్వుతూ వెలుపలికి వచ్చారు రంగనాధరావుగారు. నిండు చేతులచొక్కా, యెర్రరంగుపంచా, చేతికి 'వాచి' ధరించి, క్రాపుదువ్వి, పిలక ముడి వేసి యెంతో ముచ్చటగా వున్నాడు పెద్దమనిషి తరహాలో. చలపతిని వో కుర్చీలో కూర్చోమని, నరసరావుపేట పడకకుర్చీలో కూర్చుంటూ యోగక్షేమా లడిగి, తండ్రి గతించినందుకు సానుభూతి వెల్లడించి, "నీవు వ్రాసినవుత్తరం అందిందోయ్. భూములకు ధరలు బాగా పడిపోయివున్నయ్. రైతాంగం దగ్గిర నాట్లకాలం కావటాన డబ్బు వుండేరోజులూ కావు. ఈ యేటికి విక్రయం మానుకుంటే మంచిదని నా అభిప్రాయం." అన్నారు నగిషీగా చుట్ట చుట్టుతూ. వళ్లు ఝల్లుమన్న చలపతి తన స్థితంతా యేకరువుపెట్టి చెల్లి పెండ్లి యీ శ్రావణంలో చేయకపోతే మళ్లీ సంబంధం దొరకటం కష్టమనీ, యెలాగైనా వచ్చినంత ధర రాబట్టి అమ్మకపోతే గత్యంతరం లేదనీ వెళ్లబోసుకున్నాడు.

కీడు చేసిన మేలు

కె. శైలజ

కూతురు వాలకం చూసి-కృష్ణమూర్తి గారు విస్తుపోయారు...ఏదో పెద్ద షాక్ తిన్నట్లు బాధపడుతూ, ముకుళించుకు పోయిన మొహంతో బరువుగా అడుగులు వేస్తూ, చావిడిలో వున్న తండ్రిని గుర్తించకుండానే మేడమీదకు వెళ్లిపోయింది శ్యామల. కాలేజీకి వెళ్ళేటప్పుడు నవ్వు మొహంతోనే వెళ్ళిన శ్యామల తిరిగి ఇంటి కొచ్చేసరికి విచారంగా ఎందుకుందో-ఎంత ఆలోచించినా ఆయనకు అంతుపట్టలేదు. అప్రయత్నంగా నిట్టూర్పి సోఫాలో కూలబడ్డా రాయన.

మేడమీదకు వెళ్ళిన శ్యామల, చేతిలో వున్న పుస్తకాలను టేబుల్ మీదకు గిరాటేసి మంచంమీద వాలిపోయింది. ఆమెలో కోపం ఉప్పెనగా పొంగుతోంది; దుఃఖం పరవళ్ళు తొక్కుతోంది. అందాలు చిందులాడే ఆమె ముఖం-ఆ ఉద్రిక్త పరిస్థితిలో అరుణరాగ రంజితమైంది. ఆమె మనస్సంతా అతలాకుతలమైపోతోంది... ఏదో నిస్సహాయత, అంతకు మించిన కసి ఆమె శరీరాన్ని జలదరింప జేస్తున్నాయి. ఆమె బలవంతంగా వెనక్కి నెట్టేస్తున్నకొద్దీ కాలేజీ ఆమె కళ్ళ ముందు లాస్యం చేస్తోంది.

క్లాసులో తెలివైన విద్యార్థిని-మీదు మిక్కిలి మంచివాడని తను రామం దగ్గర ఫిజిక్సు నోట్సు తీసుకుంది; రెండు మూడుసార్లు తనతో పాఠాల విషయమై ప్రసంగించింది. అంతే-అంతకు మించి తప్పేం చెయ్యలేదు. దీనికి చిలవలు పలవలు అల్లి కాలేజీ అంతా నీచాతి నీచమైన పుకారు లేవదీశారు కొంటె విద్యార్థులు. తనపేరు, రామం పేరు కాలేజీగోడల నన్నిటినీ అలంకరించాయి. క్లాసులో బల్లలు బ్లాక్ బోర్డులే గాక-ప్రిన్సిపాల్ గారి ఆఫీసురూమ్ తలుపులపై కూడా ఈ పేరెక్కాయి. కాలేజీ అంతా అట్టుడికి నట్టుడికి పోయింది, ఈవిషయంతో. తనే పాపం ఎరక్క పోయినా నలుగుర్లో తలవంపులైంది.

ఏ విద్యార్థి నోటివెంబడి విన్నా తన పేరే వినవస్తోంది అందరూ తనవంక హేళనగా చూస్తున్నారు; తనరాకను గమనించి ఏవేవో గుసగుసలాడుకొంటున్నారు; వ్యంగ్యంగా నవ్వుతున్నారు. ఇదంతా తల కొట్టేసి నట్టుంది తనకు. తనను ఎన్నెన్ని విధాలుగానో 'రోడ్డు సైడు రోమియోలు'-రెచ్చగొట్టడానికి ప్రయత్నించేవారు; అయినా వాళ్ళకి తను జడిసిందా? ఒక తీక్షణమైన వీక్షణం వాళ్ళమీదకు ప్రసరింపజేసేది. అంతే—వాళ్ళంతా పిల్లులైపోయి, కిమ్మనకుండా తనవెంట వచ్చేవారు—బాడీ గార్డ్సులా!!—వాళ్ళు ఎన్నెన్ని వెకిలి వేషాలేసినా, దస్తాల తరబడి ప్రేమలేఖలు రాసినా తాను కించిత్తుకూడా చలించలేదే? అంత జాగ్రత్తగావున్న తనమీద ఈ అభాండం పడటం చాల శోచనీయమైన విషయం. తనవలన భంగపడిన కొంటె విద్యార్థులే ఈపని చేసి ఉంటారు.

ఈవిధంగా శ్యామల తలపోస్తూ ఉండగా—ఆమెతల్లి అన్నపూర్ణమ్మ ఆగదిలోకొచ్చింది.

"అదేమిటే అమ్మడూ, అలా వున్నావ్?" ఆదుర్దాగా అడిగింది. తుళ్ళిపడింది శ్యామల. "కళ్ళ నీళ్లు పెడుతున్నావేం, శ్యామలా?" ఆతల్లిహృదయం ఆందోళన పూరితమైంది

"అహా, ఏంలేదు" ముక్తసరిగా శ్యామల అంది.

"ఏదో బాధపడుతూనే ఏం లేదంటావేమిటి?" కొంచెంకోపం ధ్వనించింది కంఠంలో, శ్యామల మంచంమీదనుంచి లేచి పోయింది. "నాకంట్లో బావుండలేదమ్మా; అంతకు తప్ప మరేంలేదు" అంది విసుగ్గా.

"వంట్లో బావుండలేదా?" ప్రశ్నించింది అన్నపూర్ణమ్మ.

"అవును తలనొప్పిగా ఉంది." తల్లి కళ్లలోకి, చూస్తూ అంది.

"అయితే మధ్యాహ్నం - కాలేజీకి వెళ్లవా?"

"వెళ్ళను."

"సరే...భోజనం చేద్దువుగాని రా."

భోజనం చెయ్యనంటే తల్లి అనుమానిస్తుందని, ఇష్టం లేకపోయినా అందు కంగీకరించింది. ఇద్దరూ మేడదిగి క్రిందికొచ్చారు.

"ఏవమ్మా శ్యామా, అలా ఉన్నావ్?" చావిడిలో వున్న కృష్ణమూర్తిగారు ప్రశ్నించారు. "తలనొప్పిగా ఉంది నాన్నగారూ!" అంది తండ్రివంక చూడకుండానే. ఆమె కంఠస్వరం కృత్రిమంగా ఉంది. తన కూతురు అంతర్గతంగా ఏదో బాధపడుతోందని తెలుసుకొని, తనలో తానే విచారపడ్డా డాయన.

ఆ సాయంత్రం కాలేజీకి వెళ్ళకపోవడం వలన శ్యామలకు ఫిజిక్సు క్లాసు పోయింది. మేడమీది గదిలో ఒంటరిగా కూర్చొని, ఫిజిక్సు పాఠాలు తిరగేస్తోంది శ్యామల. ఆమె కళ్లు పుస్తకంమీదే వున్నా-మనస్సు మాత్రం ఎటో కళ్లెం తెగిన గుఱ్ఱంలా పరుగులిడుతోంది.

ఇంతలో క్రిందనుంచి తల్లి పిలుస్తూ ఉండడంవల్ల శ్యామల వెళ్ళింది.

"ఏమిటమ్మా, పిల్చావ్?" అంది.

'ఎవరో పిల్లవాడొచ్చి నీవు కావాలంటున్నాడు; ఏదో పుస్తకం తెచ్చాడు," అని తల్లి చెప్పింది. శ్యామల ఆశ్చర్యపడుతూ వే బయట వరండాలోకి వెళ్ళింది.

"ఎవరబ్బాయ్, నువ్వు?" అడిగింది.

"మా అన్నయ్య మీకీపుస్తకం ఇచ్చి రమ్మన్నాడండి" అంటూ పుస్తకాన్ని అందిచ్చాడు ఆమెకు. పుస్తకం వంక తేరిపార జూసింది శ్యామల...అది ఫిజిక్సు నోట్సు... దానిమీద రామం పేరుంది. ఆమె ఏదో అందామని నోరు విప్పి-తలెత్తి చూసేసరికి ఆకుర్రాడక్కడ లేడు. ఆమె నిట్టూర్చి ఆ పుస్తకాన్ని తీసుకొని మేడమీదకు వెళ్ళి పోయింది. మంచంమీద కూర్చొని నోట్సు తెరిచింది. లోపల్నుంచి ఒక పచ్చరంగు కాగితమొకటి ఆమెవళ్లో పడింది ఆదుర్దాగా దాన్ని తెరిచి చూసింది శ్యామల.

అందులో ఇలా ఉంది. "శ్యామల గార్కి-; నమస్కారములు. మీరు సాయంత్రం కాలేజీకి రాకపోవడం వలన ఇంపార్టెంటైన ఫిజిక్సు లెసన్ పోయింది. అయినా విచారపడకండి. నేను పంపిన నోట్సు ఉపయోగించుకోండి.

శ్యామలగారూ! మీమీదా, నామీదా ఏవేవో కట్టుకథలల్లి ప్రచారం సాగిస్తున్నారు కాలేజీలోని నోటి విద్యార్థులు. ఆ ప్రచారంలో ఎంత సత్యముందో పైనున్న భగవంతునకు మన అంతరాత్మలకు మాత్రమే తెలుసు. నిజంనిప్పులాంటిది. శ్యామలగారూ! అదిప్పుడు నివురుగప్పినా - మరోకప్పుడైనా

★ కీడు చేసిన మేలు ★

ప్రకాశించినా బయటకు రాకమానదు. మనవల్ల ఏ తప్పూ లేనప్పుడు బాధపడడం అనవసరం. మీరు నిశ్చింతగా ఉండండి మీరు బాధపడుతున్నట్లు కనుపిస్తే, దుష్టశక్తులు ద్విగుణీకృతోత్సాహంతో పురోగమిస్తాయి. కనుక మీరు సాధ్యమైనంతవరకు నిబ్బరం అలవరచుకోండి. నాకు తెలియకుండానే నావల్ల మీకేమైనా ఆపద వాటిల్లి వుంటే, నన్ను హృదయపూర్వకంగా క్షమించండి.

మీకీ విధంగా లేఖ రాసినందుకు, అన్యథా భావించకండి. రేప్రొద్దుట మా తమ్ముడొస్తాడు, ఫిజిక్స్ నోట్సు అతని కివ్వండి.. కాలేజీకి తీసుకురావద్దు—

సెలవు,

మనఃపూర్వక అభినందనలతో, రామం."

తనకు తెలియకుండానే యాంత్రికంగా ఆ జాబును అనేకసార్లు చదివింది శ్యామల. తన యందలి ఔదార్యంతో నోట్సు పంపినందుకు రామాన్ని మనసారా అభినందించింది. అతని విశాల హృదయాన్ని కొనియాడింది. ఆ లేఖ చదివాక ఆమె మనస్సు కాస్త తేలిక పడింది.

దీర్ఘ నిశ్వాసం విడిచి ఫిజిక్స్ నోట్సు రాయనారంభించింది. ఒక అరగంటలో నోట్సు రాయడం ముగించి ఏదో కూనిరాగం తీస్తూ గదిలో అటూ-ఇటూ పచార్లు చెయ్యసాగింది ఏదో అవ్యక్తమైన ఆనందం ఆమెను ముప్పిరిగొంది కూతురు మొహం చిరునవ్వుతో కలకల్లాడుతుండడం చూసి అన్నపూర్ణ సంబరపడింది; కృష్ణమూర్తిగారు కూడా ఆనందించారు.

ఆ మర్నాడు ప్రొద్దుటే రాజశేఖరంగారు శ్యామల ఇంటికొచ్చారు. ఆయన-శ్యామల చదువుతున్న కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్. కృష్ణమూర్తిగారి స్నేహితుడు. కాఫీ ఫలహారాల అనంతరం ఇష్టాగోష్ఠిలో పడ్డారు ఉభయులు.—వారి మాటల్లో కాలేజీ ప్రసక్తి వచ్చింది. కాలేజీలో జరిగిన పుకార్లు గురించి సవిస్తరంగా వివరించి చెప్పారు రాజశేఖరంగారు, కృష్ణమూర్తి గారికి. క్రితం రోజు శ్యామల ఎందుచేత బాధపడిందో కృష్ణమూర్తిగారి కిప్పుడు అవగాహనమైంది. ఆయనకు తన కూతురు మీద ఏనాడు అపనమ్మకం లేదు. పురుషులంటే—అందులో యువకులంటే, తన కూతురు యెంతో దూరదూరంగా తొలగి తొలగి ఉంటుందో—ఆయనకు తెలియని విషయం గాదు. అయినా ఆయన ఆలోచిస్తున్నారు అపుకార్లగురించి. అసలు—నిప్పంటూ లేందే పొగరాదుగదా. ఇదే ఆయన ఆలోచనలంతా.

తన కూతురొక వేళ నిజంగానే రామాన్ని. ఏమో యెందుక్కూడదు? మనస్సులో ప్రేమ జనించాలంటే ఎంతసేపు, ఒక్క విఘడియచాలు.

"ఏమిటోయ్, ఆలోచిస్తున్నావ్?"... రాజశేఖరం ప్రశ్నించాడు.

కృష్ణమూర్తిగారు తేరుకొని, "ఇంతకీ ఆరామం ఎవరోయ్, శేఖరం?" కుతూహలంగా అడిగారు. లెక్చరర్ గారు పకపకానవ్వారు.

"అరి నీ అసాధ్యం గూలా; అతన్నే ఎరుగవోయ్?" అన్నారు వ్యంగ్యంగా. ఎరుగనట్లు తలపంకించారు కృష్ణమూర్తిగారు.

"అతనెవరో కాదు—జడ్జీ దేవేశ్వరరావు గారబ్బాయే!" చిరునవ్వుతో అన్నారు.

"ఆఁ!" అని నోరుతెరచారు కృష్ణమూర్తిగారు సంభ్రమాశ్చర్యాలతో. దేవేశ్వరరావుగారు-ఆయనకు బాగా తెలిసినవాడే, మెరుపులాంటి ఆలోచన వచ్చింది కృష్ణమూర్తిగారికి. ఆయన మొహం సంతోషంతో విప్పారింది. "రైటో...!" అంటూ ఆయన చిటిక వేశారు.

చిరునవ్వు పెదవులలోనే కప్పిపుచ్చుకొని రాజశేఖరం గారన్నారు:

"అదేమిటో నాక్కూడా చెప్పవోయ్, విని ఆనందిస్తాను."


కృష్ణమూర్తిగారు పెద్ద పెట్టున నవ్వేశారు. "అబ్బ ఏం వంగనాచివోయ్! అన్నారు. "ఈవిషయం గురించి నీవు దేవేశ్వరరావుగారికి రికమెండ్ చేస్తే మరీ మంచిది ఏమంటావ్?...ఆయన వెంటనే అంగీకరిస్తారు కదూ!"

"హారి పిడుగా!...పెద్దెత్తే వేశావ్; జడ్జీగారి కోడల్ని చెయ్యబోతున్నావన్నమాట మీ అమ్మాయిని?".. సౌజన్యం వెల్లివిరిసేటట్లు నవ్వారు కృష్ణమూర్తిగారు.

"వూ, కానియ్ ... శుభస్య శీఘ్రం అన్నారు." ఇరువురూ కలిసి హాయిగా, స్వేచ్ఛగా నవ్వుకున్నారు.

లోపల తలుపు ప్రక్కనే దాగి-ఈ మాటలన్నీ శ్యామల వింటోందని వాళ్ళు గ్రహించనే లేదు.

ఆ సంభాషణ విని, శ్యామల మొహం ఈసారి ప్రణయ రాగరంజితమైందని వేరే చెప్పనక్కర్లేదు! ★



ఆంధ్రదేశంలో ప్రఖ్యాతినొందిన శ్రీ నాజర్ శిష్యులు, బుర్రకథ బృందం ఈ మధ్య మద్రాసులో 'పల్నాటియుద్ధం' బుర్రకథ చెప్పారు. ఈ చిత్రంలో కథకులు: శ్రీ లక్ష్మణరావు; రాజకీయం: శ్రీ శత్రుఘ్నరావు, హాస్యం: శ్రీ హనుమంతరావు.

గ్రీకుపురాణ గాథ:

లోభి మైదాసు గాడిదచెవులు

౧

ఫ్రిజియా దేశం గులాబీపూలకు పెట్టింది పేరు.

ఆ రోజుల్లో మైదాస్ ఫ్రిజియా రాజ్యం పరిపాలిస్తూండేవాడు.

అతని మేడచుట్టూ పెద్ద పెద్ద గులాబీ తోట లున్నాయి. ఒకనాడు సిలేనియస్ తప్పతాగి గోడదూకి ఆ తోటలో ప్రవేశించాడు.

సిలేనియస్ అంటే సామాన్యుడు కాడు. అతగాడు బాకస్ నమ్మిన బంటు. బాకస్ అంటే గ్రీకుల మద్యదేవత.

అసలే సిలేనియస్ బాగా పెద్దవాడై పోయాడు. ఆ పైన తప్పతాగాడు. అందుచేత మైమరిచి మైదాస్ తోటలో పడుకుని నిద్రపోయాడు.

మైదాస్ గులాబీ తోటమాలీలది పనిగట్టారు. సిలేనియస్ మెడనిండా గులాబీదండలు వేశారు. కాళ్ళు, చేతులు గులాబీ దండలతో కట్టివేశారు. ఆ పైన మెల్లిదిగా లేవదీసి ఊరోప్రబెట్టారు.

సిలేనియస్‌కు కొంచెం తెలివి వచ్చింది. తోటమాలీ లతన్ని వెంటనే మైదాస్ దగ్గిరికి తీసుకుపోయారు.

మైదాస్ సిలేయనియస్ ధోరణి చూచి విరగబడి నవ్వాడు. అంతేగాని అతని కేవిధమైన అపకారము చెయ్యలేదు. పైగా అతని నెన్నో విధాల గౌరవించాడు. పదిరోజుల పాటు సిలేనియస్ గౌరవార్థం పెద్ద పెద్ద విందులు చేయించాడు.

తరవాత స్వయంగా అతన్ని బాకస్ దగ్గిరికి తీసుకుపోయాడు. బాకస్ తన సేవకుని యెడల మైదాస్ చూపించిన గౌరవాదరాలకెంతో ఆనందించాడు. నీ కేమి కావాలో కోరుకోమన్నాడు.

మైదాస్ మహాలోభి. బంగారం కోసం అతడు పడే తాపత్రయం ఇంతా అంతా కాదు. ఆ క్షణంలో అతనికి బాగా బంగారం సంపాదించాలని దురాశ కలిగింది. ఇక వెనక, ముందు ఆలోచించకుండా తాను ముట్టిన దంతా పట్టినదంతా బంగారం కావాలని కోరుకున్నాడు.

బాకస్ అత డలాంటి వరం కోరుకున్నందు కెంతో ఆశ్చర్యపోయాడు. కాని పైపై కేమీ మాట్లాడకుండా 'సరే! నీవు కోరుకున్నట్లే జరుగుతుందిలే!' అని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు.

తరవాత మైదాస్ మళ్ళీ తన రాజ్యానికి తిరిగి వచ్చాడు.



(ప్రయాణం బడలికవల్ల ఎక్కువగా అలిసిపోయి ఉన్నాడేమో! వెంటనే భోజనశాలలోకి వెళ్ళిపోయాడు. భోజనం చెయ్యడం మొదలుపెట్టాడు. అతని కెదురుగా పళ్ళెంలో పెట్టిన ఆపిల్ మైదాస్ చెయ్యి తగలగానే బంగారు ఆపిల్‌గా మారిపోయింది. అలాగ ఆహారపదార్థాలన్నీ అతడు ముట్టీముట్టడంతో బంగారంగా మారిపోయాయి.

అతని కెంతైనా ఆకలివేసింది. కాని ఏమిచెయ్యగలడు? పట్టినవన్నీ బంగారమైపోయాయి.

ఇక చేసేదేమీలేక అలాగే లేచి బాకస్ దేవత దగ్గిరికి పరిగెత్తాడు. ఆ వరం తన కక్కరలేదనీ, అది లేకుండా చెయ్యవలసిందనీ అనేక విధాలుగా బతిమాలుకున్నాడు.

"వినాయక"

కొంతసేపటికి బాకస్ మనసు కరిగింది. పక్టోలస్ నదిలో చేతులు కడుక్కుంటే ఆ వరం మరి బాధించదని భరవసా ఇచ్చాడు. మైదాస్ వెంటనే పరిగెత్తుకువెళ్ళి అలాగే చేతులు కడుక్కున్నాడు. దానితో అతని కాబాధ తొలగిపోయింది. అందుచేతనే ఆ నది ఇసకలో ఈ నాటికీ బంగారు పలుకులు దొరుకుతూంటాయని అంటారు.

౨

తరవాత మైదాస్ ఇంకొక ఇబ్బందిలో ఇరుక్కున్నాడు.

అపోలో దేవతకీ పాన్ దేవతకీ మధ్యన ఒకప్పుడొక సంగీతంపోటీ జరిగింది. వారిద్దరు సంగీతంలో నేను గొప్ప అంటే నేనుగొప్ప అని తగువులాడుకున్నారు.

పాన్ దేవత పిలనగ్రోవి ఊదితే అరణ్యాలన్నీ ఆనందంతో తలలూచేవి. అపోలో లైర్ వాద్యంలో చాలా గట్టివాడు. వెండిలైర్ మీద అతని వేళ్ళు కదులుతూంటే సంగీతంవెన్నెల లా ప్రపంచం అంతా వ్యాపించేది. ఆ లైర్ గాన మాధుర్యం ఆస్వాదిస్తూ ఆకాశమే నిద్రపోయేది.

ఇంతకుపూర్వం ఒక పర్వతదేవత వీరిద్దరి తగాదాలలోను జోక్యం కలగజేసుకుంది. ఆ ఇద్దరిలోను అపోలో దేవతే గొప్పవాడని తీర్పు ఇచ్చింది.

మైదాస్ మందబుద్ధిలో కూడా బాగా పేరుమోసినవాడే. గొప్ప దేవత లిద్దరు తగాదా పడుతూంటే తన కెందుకని మాటాడకూరుకోక తగుదునమ్మా అని తగాదా తీర్చడానికి సిద్ధపడ్డాడు. వారిద్దరి సంగీతాలు విని తనకు తోచినట్టుగా తీర్పు ఇచ్చాడు. ఆ ఇద్దరి సంగీతాలలోను పాన్ దేవత సంగీతమే తనకు బాగా నచ్చిందని అన్నాడు. నిజానికతనికి సంగీతంలో లోతులంత బాగా తెలియవు. అసలే మందబుద్ధి. ఆ పైన తెలిసీ తెలియని ఘోష.



“స్వాప్నిక ప్రణయం”

చిత్రకారుడు : కేతినీడి భాస్కరరావు—విజయనగరం.

★ లోభిమైదాసు గాడిదచెవులు ★

ఏది ఏమైనా ఆ తీర్పు వినీ వినడంతో అపోలోకు పట్టరాని కోపం వచ్చింది. పాన్ దేవత అపోలో అంత గొప్పవాడు కాదు.

అపోలో మైదాస్ కేసి చూసి వెటకారంగా ఒక వికపు నవ్వు నవ్వాడు.

"మైదాస్! నీ పరిశీలన శక్తి చాలా గొప్పది. అందుచేత నీకు గాడిద చెవులు బహూకరిస్తున్నాను. ఇకనించీ నీకు గాడిద చెవులే!"

ఆ మాట విని మైదాస్ అపోలో దేవతను కాళ్ళా వేళ్ళా పడి బతిమాలుకున్నాడు. అపోలో మళ్ళీ ఇంకొక ఛలోక్తి విసిరాడు:

"మైదాస్! అసలు నీవి పుట్టుకతోనే గాడిద చెవులు! నేను వాటి కిప్పుడు ఆ ఆకారం మాత్రమే ఏర్పాటుచేశాను! అంతేనే గాని నేను నీకు ప్రత్యేకంగాచేసిన అపకార మేమీ లేదు!"

అని మరింత వెటకారంగా నవ్వడం మొదలు పెట్టాడు.

మైదాస్ ఇక చేసేదేమీ లేక చల్ల చల్లగా తన ఇంటికి వచ్చేశాడు

ప్రత్యేకంగా ఒకటోపీ తయారుచేయించి తలకు తగిలించుకొన్నాడు.

ప్రజలంతా అదేదో విచిత్రమైన కొత్త టోపీ కాబోలని అనుకున్నారే, గాని ప్రభువు వారికి గాడిదచెవులు మొలిచాయని గ్రహించలేకపోయారు.

కాని ప్రభువువారి మంగలి కామహా దౌర్భాగ్యం పట్టింది మంగలి ప్రభువువారికి క్షౌరం చేసే సమయంలో ఆ గాడిదచెవులు రెండు అతగాడి కళ్ళ బడ్డాయి

"ఇదిగో! మంగలీ! ఈ సంగతి ఇంకెవరికీ తెలియకూడదు సుమా!"

అని మైదాస్ ప్రభువువారు గట్టిగా హెచ్చరించారు! మంగలి ఆ హెచ్చరికతో అదిరిపడ్డాడు:

"ఎంతమాట! బాబూ! మళ్ళీ ఇది ఇంకొక నరమానవుడికి తెలియనిస్తానా? ప్రభువు వారి గాడిదచెవులంటే మాటలా!"

అన్నాడు తరవాత తొందర తొందరగా తన పని ముగించుకొని ఇంటికి వచ్చేశాడు.

అయితే మంగలికి తనకి తెలిసిన రహస్యం కాస్తా ఇంకొకరి కెవరికైనా చెప్పేదాకా నిద్ర పట్టలేదు. చాలాకాలం అతిగాడంతైనా ఓపిక పట్టాడు. చివరికి ఆ బాధ అతనికి పెద్ద తలకాయనెప్పి పట్టుకుంది. అయితే అది ఇంకెవరికైనా తెలిసిందంటే అతని తల ఎగిరిపోతుంది!

మంగలి ఒక నాడొక ఉపాయం ఆలోచించాడు. ఒకచోట ఒక చిన్నగొయ్యి తవ్వాడు. ఆ రహస్యంకాస్తా ఆ గోతిలో ఊదాడు. తొందర తొందరగా అది మన్నుతో పూడ్చి వేశాడు. 'హమ్మయ్యా!' అనుకున్నాడు సుఖంగా ఇంటికి వెళ్ళి గుర్రుపెట్టి నిద్రపోయాడు.

కొంతకాలానికి మంగలి గొయ్యి పూడ్చిన చోట ఒక పెద్ద వెదురుపొద మొలిచింది. దానిలోనించి కొన్ని వెదుళ్ళాకాశం అంత పొడుగున పైకి లేచాయి.

అవన్నీ కలిసి ఒకే గొంతుకతో "మైదాస్ చెవులు గాడిద చెవులు!" అని గుసగుసలాడడం ప్రారంభించాయి.

అప్పటిదాకా జనం అంతా మైదాస్ బుద్ధి మాత్రమే గాడిదబుద్ధి అనుకొనేవారు. వెదురుపొదల గుసగుసలతో అతని చెవులు కూడా గాడిద చెవులే అని అందరికీ తెలిసిపోయింది! ★

మనమనసుల మరమ్మత్:

"ఆ వెళ్తున్న పిల్లని చూశావటే!"

బి. ప్రేమలీల (పెద్దాపురం)

"ఈ ఉద్యోగంలో ఏక్షణం చేరానో గానీ అడుగడుక్కీ అవాంతరాలే: ఉత్సాహమంతా నీరుకారిపోతూంది ...పుల్ల విరుపు మాటలువింటూ ఉంటే..."

ఫ్లవర్ ఎక్జిబిషన్‌లో రోజాపూల బ్లాక్ దగ్గరనుంచుని వివిధ రకాల వింత వింతల రోజాపూలను చూస్తూ సంభ్రమంలో విహరిస్తున్నట్టున్న నా హృదయాని కేదో ముల్లు గుచ్చుకున్నట్లయింది. చటుక్కున తలతిప్పి ప్రక్కకి చూశాను. నాకు కొంచెం దూరంలోనే ఇద్దరమ్మాయిలు నుంచుని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు పువ్వుల్ని చూస్తున్నారుగాని వాళ్ళ మనస్సు లెక్కడో విహరిస్తున్నా యనిపించింది.

నీలంచీర కట్టుకున్న అమ్మాయిని ఆమె స్నేహితురాలు అనునయిస్తోంది. "ఏం జరిగింది? అంత నిరాశపడి పోతున్నావు?" అంటూంది.

నీలంచీర అమ్మాయి దీనంగా స్నేహితురాలికేసి ముఖంతిప్పింది. "నిన్న ఉదయం గుమ్మం దిగి రోడ్డెక్కానో లేదో కులకమ్మ వాళ్ళరుగుమీద నలుగురయిదుగురు ఆడవాళ్ళు చేరి నా వైపు మింగేలాచూస్తూఒకటే గుసగుసలు. అవీ నాకు వినిపించేలానే.... 'ఆ వెళుతూన్న అమ్మాయిని చూశావుటే, పెళ్ళీ పెటాకులూ లేకుండా ఉద్యోగం చేస్తూంది. మగాళ్ళ ఆఫీసులోనట. మరీను....నారాయణ...' అంది ఒకావిడ చీదరించుకుంటూ. మిగతావాళ్ళు నేనేదో ఘోరమైన పాపం చేస్తున్నట్టు, నావేపు మిర్రున చూడడం——ఏడుస్తూ పోయాననుకో......."

"ఛా! వూరుకోవే. అంతమాత్రాన బెదరి పోతావా?"

"కాదు పద్మా. ఈ మాటలే మగాళ్ళని వుంటే అంత బాధపడేదానిని కాదు. తోటి స్త్రీలే, ఇలా కించపరుస్తున్నారని నా బాధ. నే నేంతప్పు చేశాను? చేతిలోవున్న విద్య సద్వినియోగం చేసుకుంటూ నా బ్రతుకు దెరువు నేను చూసుకోవటం తప్పా? హీనమయినపనా!"

"వూరుకోవే. విచారపడకు. ఏవో గడ్డి కాపులన్నాయని, అదిలోనే జడిసిపోతే ఎలా."

"గడ్డికాపులు కాదే పద్మా. కళ్ళున్న పేనే..."

"సరి సరి. బాగానే వుంది. గాని పద. అలా పదదాం గా తిరుగుదాం" అంటూ స్నేహితురాల్ని మధ్యలోనే ఆపేసి చేత్తో బరబరా లాక్కుపోయింది మరోచోటికి.



ఇటీవల హైదరాబాదులో నాలుగురోజులు జరిగిన ఆంధ్రాభ్యుదయోత్సవాలలో కుమారి ఎం. జానకీరాణి ప్రదర్శించిన ఊర్వశి నృత్యం.

ఉద్యోగ విషయాల్లో స్త్రీలుముఖ్యంగా అవివాహితలు ఎదుర్కొంటున్న పరిస్థితులు నిరుత్సాహకరంగా వుంటున్నాయనడానికి పై ఇద్దరి సంభాషణే నిదర్శనం. ఉద్యోగాలు చేస్తున్న ఆడపిల్లల్ని లోకువగా చూడటం-నాటి పోటి మాటలనటం-ఎగతాళి చేయటం-మొదలయినవి - చేసేవారు పురుషులకన్న స్త్రీలే ఎక్కువ. తోటి స్త్రీలే అలా తమ సోదరీమణులను తేలిక పరచటం మహిళాభ్యుదయానికి తీరని అవరోధం కాదా? స్త్రీలకి విద్యకావాలి అభివృద్ధికావాలి అంటూ వివాదాలు చేసేవారు ఆ స్త్రీలు ఉద్యోగాలు చేయటం ఎందుకు నిరసించుతారు? ఆ విద్యని సద్వినియోగం చేసుకోటానికి సహించలేకనా? లేక ఎదుటివాళ్ళు పైకొస్తున్నారని దుఃఖమా! పెళ్ళికాకుండా ఉద్యోగం చేస్తున్నంత మాత్రాన ఆమెను హేళన చేయటమా? తన విద్యను, తన, బ్రతుకు తెరువునకు ఆధారపరచుకోవటం గౌరవ హీనమయినపనా?

నర్సులుగా మంత్రసానులుగా ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలంటే మరీ చులకన. 'అది' 'ఇది' అన్నంత నీచంగా మాట్లాడుతారు. మళ్లీ సమయంవస్తే వాళ్ళే ఆపద్బాంధవులు. సంఘంలో బాగా బలిసిపోయిన ఈ తృణీకారాన్ని-చిన్న చూపును మొదలంటా అరికట్టితేనే స్త్రీజాతి వృద్ధిలోకి వస్తుంది. సాంఘిక వాతావరణం-సాంఘిక కట్టుబాట్లుమార్పుముందు-బూజు పట్టిన ఆచారాలను సంస్కరించాలని కలలు కనేముందు-స్త్రీల మానసిక ప్రవృత్తులే మారాలి. స్త్రీలను స్త్రీలే న్యూనత పర్చుకోనక, సానుభూతితో విశాల దృక్పథంతో, తోటివాళ్ళను ఆదరించాలి. హాయిగా-సుఖంగా మేడల్లోవుంటూ-కార్లలో తిరుగుతూ-మిలమిలల మధ్య మెరిసిపోతున్న అదృష్టవతులు, కాయకష్టంతో, గౌరవంగా జీవితంగడుప ప్రయత్నించే తోటి సోదరీమణులను గౌరవ భావంతో చూడాలి. చేయూతనీయాలి.

ఇక ఉద్యోగాల్లో వుంటూన్న స్త్రీలుకూడా - బెదిరింపులకు. గుసగుసలకు - బెదరిపోకుండా, "ఈ ఉద్యోగం నాకో సంకానీ, నలుగురికో పనా. వాళ్ళేమని గుసగుసలు పోతే నాకేం. నాదారి మంచిదయితే నన్నెవరేం చేయగలరు." అని ధైర్యంతో-ఆత్మవిశ్వాసంతో తన లక్ష్యాన్ని అనుసరించాలి. ఇరుగమ్మా, పొరు

చింత చింత

ఈ మధ్య మా యిద్దరికీ ఒకేసారి జ్వరం వచ్చింది అదేం చిత్రమో మరి! కవల పిల్లలమా అంటే అదీకాదు! ఇద్దరికీ, ఏది వచ్చినా, ఒకేసారి వస్తుంటుంది! జ్వరం పడి లేచిన తర్వాత యిద్దరికీ, అమ్మ పథ్యం పెట్టితే ఏమీ సయించింది కాదు! అమ్మకు ప్రాణం విసిగి చిటికెడంత చింతకాయ పచ్చడివేసింది. దాంతో జిహ్వ లేచివచ్చి, మా మనస్సులు చింత చెట్టు మీదకు పోయాయి.

చింతచెట్టును గురించి చింతించకుండా వుండడం నిజంగా చింతించవలసిన విషయము. చింతచిగురు పప్పులో వేస్తారు. అది మహా కమ్మగా వుంటుంది. మా నాన్నగారు చింతచిగురు కాలంలో, చింతచిగురు పప్పులేనిదే అన్నం తినరు. మా కొకసారి కోయంబత్తూరు బదిలీ అయింది. అక్కడ చింతచిగురు అమ్మరు. అసలు దాన్ని వాడుకునే విషమే వాళ్ళకు తెలియదు. రోడ్లమీద అటూ యిటూ చిగిర్చిన చింతచెట్లను చూస్తుంటే నాన్నగారికి నోరూరేది. ఎలాగోలాగ ఆచిగురు తెప్పించి చింతచిగురు పప్పుచేయమని అమ్మను వేధించుకు తినడం మొదలెట్టారు. అమ్మ కావలలేక యింట్లో పనికుర్రాడిని, కాస్త చింత చిగురు కోసుకు రమ్మన్నది. వాడు తెలబోయి, వచ్చీరాని తెలుగులో "ఛీ! ఛీ! అది మనకెందుకు? మేకలు, పశువులు తినును" అన్నాడు. అమ్మ ఖచ్చితంగా తీసుకురమ్మని చెప్పడంతో ఎలాంటిది వేసుకుంటారో తెలియక, రొడ్డలాంటిది కోసుకు వచ్చాడు. అమ్మ, నానా తిప్పలుపడి, చిగుళ్ళేరి పప్పువండింది. చింతచిగురు పప్పు చవిచూచినవాడు, జన్మలో దాన్ని వొదిలి పెట్టలేకపోయాడు. దక్కటిచిగురు కోసుకు రావడమేగాక, చింతకూర పప్పు చిట్కా అమ్మదగ్గర గ్రహించి, యింటికి కూడా కొంత పట్టుకుపోయేవాడు.

చింతకాయ నిలవ పచ్చడి పెట్టుకుంటారు. ఈపచ్చడి రోగులకు మంచి పథ్యముగా పనికివస్తుంది పాతబడ్డ కొద్దీ పథ్యానికి మరీ మంచిది. పుల్లటి చింతకాయపచ్చడి నోట్లో వేసుకుంటే, జిహ్వ లేచివస్తుంది. చింతకాయలు పచ్చి పచ్చడి కూడా చేస్తారు. ఇదీ రుచిగానే వుంటుంది. కాని బలహీనులుమాత్రం తినదగదికాదు. తిన్నదగ్గరనుండి ఎందుకు తిన్నాంరా బాబూ! అని చింతించవలసివస్తుంది. మరేం లేదు, పచ్చి పచ్చడి తింటే వొళ్ళు నొప్పులు పట్టుకుంటాయి. మా అమ్మమ్మ అమోఘంగా చింతకాయలతో చారుచేస్తుంది. అసలు చింతకాయల కాలంలో ఆవిడ, చింతపండు చారుసంగతి చింతించనే చింతించదు! ఆవిడ ధ్యాస సదా చింతకాయల చారుమీదనే! ఈ చారు నిర్మలంగా రుచిగా వుంటుంది.

మా యింట్లో ఏ పచ్చడిలేకున్నా ఏదాది గడుస్తుంది కాని, చింతకాయపచ్చడి లేనిది మట్టుకు గడవదు. ఏది పెట్టినా పెట్టకపోయినా యిది మాత్రం తప్పదు. ఇంక మా బంధువులొకరు అమలాపురంలో వున్నారు.

మందరపు లలిత, పద్మ

ఆ యింటాయనకు చింతకాయపచ్చడి తప్ప మరో ఆధరు వక్కరలేదు. జాడీలు జాడీలనిండా చింతకాయపచ్చడి సాకుచేసేవాడు. కొంటెపిల్లలు కొందరీ తాతగారి చింతకాయపచ్చడి చింతనుపసికట్టారు ఆయనకు చక్కగా "చింతకాయపచ్చడి" అని నామకరణం చేశారు. అంతటితో ఆగక, సరిగా పదిపదిహేనుమంది ఆ యింటి గుమ్మం దగ్గరకు రావడం, ఆయనకు వినపడేలా ఘట్టిగా "చింతకాయ పచ్చడి" అని కేక వేసి పారిపోయేవారు. దాంతో ఆయన తారాజువ్వలా "చివ్వున లేచి వీళ్ళమ్మ కడుపుకాల! వీళ్ళకెందుకు నాగోల! చింతకాయ పచ్చడో, గింతకాయపచ్చడో, వేసుకుతింటాను" అంటూ అందర్నీ దుమ్మెత్తి పోసేవాడు. ఏవో కుట్టుకుంకలని ఎదురుగ్గా వుంటున్న మా మామయ్య సర్ది చెబుతుండేవాడు. ఓనాడు రాత్రిపూట వేళకానివేళ తాతగారింటికి చుట్టాలొచ్చారు. ఆయన చుట్టాలను భోజనాలకు లెమ్మన్నారు. అందులో ఒకాయన వేళకానివేళ వచ్చినందుకు సిగ్గుపడుతూ "అయ్యా! ఇంత రాత్రిపూట భోజనానికి, యింట్లోవాళ్ళని అనవసరంగా శ్రమ పెట్టకండి. ఏ ఆధరువులూ అక్కరలేదు. ఏదో కాస్త చింతకాయ..." అని పాపం మాట పరుసకన్నాడు. ఆయన వాక్యంపూరికానే లేదు! తాతగారు దుడ్డుకఱ్ఱ లేవనెత్తి "ఈ పూరి వెధవలకే అనుకుంటే, మీకూ పుట్టిందా పొయ్యేకాలం! నేనేవి వేసుకు తింటే మీ కెందుకు! మీకు కావాలంటే పది పచ్చళ్ళా, పది కూరలతో భోజనం పెడతాను" అంటూ అపర రుద్రావతారం దాల్చేడు వాళ్ళేదో మాటవరుసకన్నారని నచ్చజెప్పి, ఆయన్ని శాంతింప జేసేసరికి, మధ్య మా మామయ్య పనైంది చింతకాయ పచ్చడిమీద అంత మోజున్న మనిషిమళ్ళీ తటస్థపడలేదు. ఇప్పుడా తాతగారూ లేరు! ఆ పేరూ మాసిపోయింది అమలాపురం మామయ్యగారింటికి వెళ్ళినప్పుడల్లా, ఆ చింతకాయపచ్చడి తాతగారే జ్ఞాపకం వస్తుంటారు.

తెల్లారి లేస్తే చింతపండు లేనిదే చిక్కు లేకుండా, ఒక్కక్షణంగడవదు ప్రొద్దున్నే పాచి పనిమనిషికి అంట్లు వేశామోలేదో "అమ్మా! చింతపండు" అంటూ అరుస్తుంది. ఈ మధ్య చింతపండుకు చాలా గిరాకీ వచ్చింది. చింతపండు ఖర్చు తగ్గించడానికి, అంట్లకు నిమ్మకాయలు వేసి, మామిడికాయ ముక్కలు వుపయోగించి, నానా అవస్థాపడ్డాము. ఇంతా చేస్తే గిన్నెలు చింతపండుతో తోమినంత చక్కగా లేనే లేవు! చారుగాని, పులుసుగాని, లేకుండా రోజు వెళ్ళదు. పులిహోర లాంటి పిండివంటలకు, దప్పళంలాంటి పులుసులకు చింతపండే శరణ్యము. చింతపండు శత్రువులు కొందరు, పులిహోర నిమ్మకాయలతో చేస్తామంటారు కాని, సాధారణంగా చింతపండు పులుసు లేనిదే పులిహోర చెయ్యడం పడదు!

చిగురు రూపంగా, కాయరూపంగా, పండు రూపంగా—యిన్ని రకాలుగా వుపయోగపడుతుందా? పోనీ, ఆ కఱ్ఱ ఎందుకూ పనికి మాలినదా అంటే, అది అంతకన్నా పనికి వస్తుంది! ఈ పప్పులు, పులుసులు వండుకోవడానికి కావలసిన వంటచెరకుగా వుపయోగ పడుతుంది. చింతకఱ్ఱను కాల్చి బొగ్గులను తయారుచేస్తారు. చింత బొగ్గుకు సాటి మరే బొగ్గూ లేదు! వాడి

★ చింతచింత ★

కళ్లు "చింతనిప్పుల్లావున్నాయి" అనడం మనం వింటుంటాం. ఈ ఎఱ్ఱటి ఎఱుపును పురస్కరించుకునే "చింతనిప్పు" అనే సామ్యం పుట్టింది.

పోనీ! ఎందుకూ పనికిరాని చింతగింజలనైనా పారవేస్తామా అంటే! ఊహు! దాని వుపయోగాలు దానికున్నాయి! ముఖ్యంగా ఆడవాళ్ళు ఆడుకునే ఆటలైన వామనగుంటలు, చింతపిక్కలాట కివి ఆయువుపట్టు! మామట్టుకు మాకు, చింతకాయ పచ్చడి పెట్టుకున్నప్పుడు, పోటీల మీద ఆ గింజలన్నీ డబ్బాల్లో పోగుచేసి దాయడమే పని! ముఖ్యంగా చింతపిక్కలాట మహా మజాగా వుంటుంది. పుంజీలు, కచ్చడాలు, గుజ్జం, ఏనుగు...యీ చింతపిక్కల వింతలెక్క తమాషాగావుంటుంది." అనగ్నా చదువుతున్నా అంట్లు తోమే దానితో మీకా చింతపిక్కలా ఏమిటే అంటూ అమ్మమ్మ ఒక శేగోల! ఏమైనా మేముమాత్రం చింతపిక్కలాట ఒదల్లేదు. అమ్మ "యిదికాదు పని" అనుకుని, గుప్‌చిప్‌గా చింతపిక్కలు ఎవరికో అమ్మేసి కూర్చున్నది! అప్పటికిగాని మాకు చింతపిక్కలను చిత్తుకాగితాలలాగ కొంటారని తెలియదు! ఎలాగూ అమ్మేసింది కదాని, వాటి నేంచేస్తారోనని ఆరా తీశాము. ఆ గింజలను పొడిచేసి, కాఫీపొడిలో కలుపుతారట. ఇంకా వాటి గంజిని బట్టలు నేసేటప్పుడుపయోగిస్తారట.

సరిసరి! చింతచెట్టు ప్రత్యవయవము, మానవుల కింత వుపయోగంకదా! మరి దీన్ని ఏ కవిచంద్రుడు, తన గ్రంథంలో వర్ణించ లేదేమా?" అని సందేహం వచ్చింది. పుస్తకాలన్నీ తిరగెయ్యగా కొరవిగోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశిక తృతీయాశ్వాసములో చింతచెట్టును చిత్రంగా వర్ణించి, దానికి శాశ్వతకీర్తి చేకూర్చినాడు. చింతచెట్టు చిత్రాన్ని చూడండి:

"కం. సంచిత పింఛసమంచిత,
    పంచాయుధ మరకతాతపత్రంబన, ని
  శ్చంచల శాఖాంచితమగు,
    చించావృక్షంబు..."

దీని ప్రభావంబు:—

క. చింతమది లేక మనుజులు
  చింతించిన కోలఁదిఁజవులు చేకూర్చుచుని
  శ్చింతులఁగా నొనరించెడు.
  చింతకు సరిగలదె లోకచింతామణికిన్.

క. ఈ చింతపంటి సరిగా
  నో చెల యమృతంబుఁ జెప్ప నొప్పదె దానిన్
  వాచవిగొని తమ జిహ్వల
  నేచవులును లేక చెడరె ఇంద్రాది సురల్

ఏ అభ్యుదయ కవి యిలా వర్ణించాడు?

చింత కిబ్బవ్యుత్పత్తిని చిత్తగించండి.
  భ్రాంతిపడి కల్పవృక్ష
  ప్రాంతంబునఁ గూడఁ గూర్కుఁ బట్టక సురల
  క్రాంతంబు దీనికి మదిఁ
  జింతించుటఁజేసి పరఁగెఁ జింతయనంగన్

మరింకా:—

క. మునుఁజిగురునఁ బువ్వన నో
  మన గాయల దోరపండ్ల మటి యారఁగఁబం
  డిన పండ్ల నెల కాలముఁ
  దనియఁగఁ జవులొసఁగ నొండు తరువులు గలవే.

క. ఉడుపతి తనలో నమృతము
  గడలుకొనియుఁ బెక్కుచవులు గానక కృశుఁడై
  విడిచిన కళలన్నియు నీ
  గొడిసెల రూపమునఁ జింత గొలువఁగఁ బోలున్.

క. వెసనిర్మించిన బ్రహ్మకు
  రసికుఁడు మ్రొక్కెడుచు ఫలము రంజిల్లఁగ ష
  డ్రసములలో నిది పమలెడు
  దెసఁగని నోరూరు నాదిదేవునికైనన్.

ఇంకా వెయ్యిమాటలెందుకు?

గీ. గరితలేని యిల్లు దొరలేని తగవును
  జింతపండు లేని వింతచవియుఁ
  జవులేని కొలువు శశిలేని రాత్రియు
  ముక్కు లేని మొగము వొక్క రూపు.

కొరవి గోపరాజేదో కవి కా... సాగా పద్యాల్లో చింతపండును చక్కగా వర్ణించాడు. మరి సామాన్యుల మాట? అందులోనూ అబల లయిన ఆడవాళ్ళు, చింతపండుమీద తమకుగల భక్తి భావాన్నెలాగ చాటడం? సామాన్య మానవులూ సామాన్యులు కారు! 'చింతాకు పతక'మని ఒక నగను కనిపెట్టారు. గోపన్న "సీతమ్మకు జేయిస్తి చింతాకు పతకం రామచంద్రా" అంటూ జైలులో గోలుగోలున ఏడ్చాడు. గోపన్న గోడు చెవులకు సోకలేదు కాని చింతాకు పతకంమీదకు చిత్రంగా మనస్సుపోయింది. ఇప్పుడు సాధారణంగా మెళ్ళో పెట్టుకుంటున్న మామిడిపిందెల నెక్లెసులాగే, చింతకాయల రూపంలో యిది వుండేదేమోనని ఊహ. ఏది ఏమైనా, చింతాకు పతకం చిత్రం చూడనిది, దాని ఆకారం మనస్సులో స్పష్టంగా తేలడంలేదు.

చింతాకు పతకం చిత్రం కనిపిస్తుందేమోనని, ఆదివారంనాటి ఆంధ్రపత్రికలన్నీ తెగ వెదికాము. పచ్చలపతకం ఫోటో కనపడింది కాని, చింతాకు పతకం చిత్రంలేదు! ఇక ముందు చిత్రిస్తారో, లేక చిత్రించినా మాకంట పడలేదో? మీలో ఎవరైనా చింతాకు పతకం చూడడం తటస్థిస్తే, కాస్త దాని చిత్రం మాకు పంపి పుణ్యంకట్టుకోండి! అమ్మ మామిడిపిందెల నెక్లెసు, రాళ్ళదైనా సరే చేయించుకోమంటున్నది కాని, చిత్తమంతా చింతాకు పతకంమీదే వున్నది. అది మెళ్ళో పెట్టుకుంటే కాని, నిశ్చింతగా నిద్రపట్టదు! ★

మంగలి చిత్తుగా తాగేసి ఒక పెద్దమనిషికి క్షవరం చేస్తున్నాడు. పెద్దమనిషి ప్రాణాలరిచేతిలో పెట్టుకొని కూర్చున్నాడు. అనుకున్నట్టుగానే, మంగలి నెత్తురు కళ్లజూశాడు.

"చూశావా, తాగుడువల్ల ఎన్ని నష్టాలున్నాయో?" అని పెద్దమనిషి మర్యాదగా మందలించాడు.

"మరేనుండి, తెగ తాగితే శర్మం మెత్తబడి పోతాదండి" అన్నాడు మంగలి.

ముందు మన తప్పులు దిద్దుకోవాలి

మొట్టమొదటి మెట్టు

మొగవాళ్లు స్త్రీలను చిన్నచూపు చూడకూడదనీ, సమాజంలో సమానస్థానం ఇవ్వాలనీ ఉపన్యాసాలు ఇచ్చేవాళ్ళు, అన్నిటికన్నా ముందర ఆడవాళ్లు తోటివాళ్లకి ఎంతగౌరవం ఇస్తున్నారో చూచి, ఇలాంటి సంస్కరణలకి ప్రయత్నం చేస్తే మంచిదనుకొంటాను.

ముఖ్యంగా స్త్రీలలో గొప్ప బీద అనే తారతమ్య దృష్టి ఎక్కువగా ఉంటోంది. కట్టుకున్న గుడ్డలనిబట్టే మనిషికి విలువ ఇవ్వడం ఎక్కువ అయిపోయింది. ఇన్నాళ్ళకి, ఇప్పుడు ఈ ఫ్యాషన్‌లు రావడం వరప్రసాదమే అనుకోవచ్చును. వీటి ధర్మమా అని జరీ చీరలు లేనివాళ్ళు లేమి కొట్టవచ్చినట్లు కనబడే దురవస్థ తప్పింది. ఇదివరకు లాగా పట్టుచీర, - సగం జరీ అంచులో, మూడు సెకెనులు మెడ తిరగకుండా పెట్టుకునే రోజులుపోయి, తెల్లటి షిఫాన్ చీర, బోసి మెడ ఫాషన్ అయ్యాయి. ఇది సామాన్యులకు కూడా అందుబాటులో ఉంటుంది. ఫాషన్ కాబట్టి వంకలు పెట్టడానికి వీలు ఉండదు

అయితే, తమ గొప్ప చూచుకుని గర్వము చెంది, ఎదటివాళ్ళను 'కొలీగ్స్'గా (తోటివాళ్ళులాగా) కాకుండా హేళన చేసేవాళ్ళకు, ఇలాంటి కారణాలవల్ల హేళన మానుకోవలసివచ్చినా అదేమీ సంతోషించతగిన విషయం కాదు. ఈ మార్పు పరిపూర్ణంగా అన్నిచోట్లా అన్ని వర్గాలలోనూ రావాలి. ఆడవాళ్ళస్థితి బాగుపడాలంటే, ఈమార్పు మొట్టమొదటిమెట్టు.

వై. లక్ష్మి (ఏలూరు)

* * *

నీతులలా; రీతులలా

రోగనిదానము, వైద్యవిధానము ఈనాడు ఎంతో అభివృద్ధి చెందాయి. ఎన్నో క్రొత్త విషయాలు కనిపెట్టబడ్డాయి. అయితే ఈ వైద్యశాస్త్రం ఎంతగా అభివృద్ధి అవుతోందో రోగాలు కూడా అంతగాను వృద్ధి అవుతున్నాయి. వైద్యశాస్త్రంవల్లనే ఇవి పెరుగుతున్నాయని కాదు దీనిఅర్థం జబ్బుచేస్తే డబ్బుపెట్టి మందు తిందాము అన్నధీమా ఒకటి చాలామందిలో, వారికి తెలియకుండానే ఏర్పడుతున్నది అనిపిస్తుంది. ఆరోగ్య నియమాలు క్రమంగా "అబద్ధము ఆడరాదు" అనే లాంటి నీతులుగా తయారయిపోతున్నాయి. ఈ నీతులు అందరికీ తెలుసును. కాని ఆచరణలో పాటించే వారు ఎందరూ లేరు.

ఆరోగ్యం కేవలం డాక్టర్ల మీదా, హాస్పిటల్స్ మీదా ఆధారపడిలేదు, అయినా చాలామంది కనీస ఆరోగ్య సూత్రాలు తెలిసీ, మరికొందరు తెలియకా, నెల నెలా తమ ఆదాయములను సగానికిసగం మందులకు డాక్టర్లకు ధారపోస్తున్నారు.

నిజానికి, కాఫీ, టీలు త్రాగకూడదని, దంపుడు బియ్యం శ్రేష్ఠమనీ, కూరలు వల్లగా మాడ్చి వేయించకూడదని, సకాలమున భోజనము చేయవలయునని, అందరికీ తెలియదని నేను అనటము లేదు. అయితే, స్త్రీలు వీటిని ఏమి పాటిస్తున్నారు అని ప్రశ్న. ఉదాహరణ పొట్లకాయ సంగతి చూడండి. పొట్లకాయను తరిగిన తరువాత దానిలోని నీటిని బాగాపిండటంకోసం అని, ఎంత అవస్థపడి ఎన్నిసార్లు పిండుతారో లెక్కలేదు. అక్కడికి తృప్తి చెందక, వల్లగా మాడేలా నూనెలో వేయించుతారు. అంటే, రెండు మూడు పొట్లకాయలు గుప్పెడుకూర అవుతుంది. చివరకు, అందులో మానవునికి అవసరమైన ఎన్ని విటమిన్లు మిగులుతాయో ఆలోచించండి. ఆ కూర ఎందుకు తిన్నట్టు! అది ఎలా అరిగేటట్టు? అలాగే మరబియ్యం కూడా. అసలే అవి మరబియ్యం. వాటిని వందసార్లు వత్తి కడగడం.

పట్టుచీరలకు పౌడర్లు స్నోలకు పెట్టే ఖర్చు తగ్గించడానికి ప్రాణం ఒప్పదు. నిజానికి ఆ ఖర్చు తగ్గించుకుని (అవసరమైతేనే లెండి) బలమైన ఆహారంమీద కొంచెం ఎక్కువ ఖర్చుపెడితే, మందుల ఖర్చు, డాక్టరు బిల్లులూ తగ్గుతాయి. అప్పుడు "ఆరోగ్యమే మహాభాగ్యము" అన్నది అక్షరాలా అర్థం అవుతుంది.

చంద్రభారతి (నిడుమోలు).

* * *

మన మనసుకే...

ఇతరుల సలహాలను కేవలము త్రోసివేయుటయే ముఖ్యముగా పెట్టుకోకుండా సహృదయముతో ఆలోచిస్తే, ఆడపిల్లలకు విద్యనేర్పే విధానాలలో కొన్నికొన్ని

★ వృధా కాకుండా ★

తించి పొయ్యిమీదపెట్టి ఉడకబెట్టాలి. అవి ఉడికినతరువాత క్రిందికిదించి, మెత్తగా పిసికి మూతపెట్టి, ఒక ప్రక్కగా పెట్టుకోవాలి. పొయిమీద కళాయిగిన్నె పెట్టి చారెడు నూనెవేసి అది మరిగాక, తరిగిన వుల్లి పచ్చిమిర్చిముక్కలు వేసి కొంచెం వేగినతరువాత, పిసికి ఉంచుకున్న ముద్ద వేసి, సరిపడ్డ మెత్తని ఉప్పు, కొంచెం కారంవేసి, సన్నని సెగలో దోరగా వేగేవరకు ఉంచి, దించేయాలి కారానికిబదులు కొద్దిగా మిరియాలపొడి వేసుకోనవచ్చు.

దించిన తరువాత కొద్దిగా లవంగాలు, దాల్చినచెక్కపొడి, వేసి కలియబెట్టి మూతవేసి ఒకవైపుగా పెట్టుకోవాలి. ఈ పనికి ముందే ఒకరొట్టె (బ్రెడ్) తెచ్చి పొయిదారగా ఉంచితే, అది చక్కగా గట్టిపడుతుంది. దానిని రోట్లోవేసి దంచి పొడిగాచేసి ఒక గిన్నెలో పోసుకోవాలి.

పొయిమీద కళాయిపెట్టి నూనెవేసి, అది మరిగేలోపల కూరముక్కల ముద్దను బిళ్ళలు బిళ్ళలుగాచేసి యీ బ్రెడ్ పవుడరులో రెండువైపులా అద్ది, కాగే చమురులో వేసి దోరగా వేగనిచ్చి చిల్లుల చట్రంతో దేవి ఒక పళ్ళెంలోకి తీయాలి. ఇవి చాలా రుచిగాను ఉంటవి.

కూరలనువృధాచెయ్యకుండా పొదుపుగా వాడుకుంటున్నామని సంతోషమూ కలుగుతుంది; వీటిని డిన్నర్స్‌లో కూడ సైడ్ డిషెస్ క్రింద సర్వుచేస్తే చాలా అందముగానూ ఉంటుంది. యూరోపియన్ కట్‌లెట్ చేసుకోవాలంటే కాలీఫ్లవర్, క్యారెట్, పీస్ (పచ్చిబటానీలు) మొదలైనవి, అవి కొంచెం ఇవికొంచెం, అన్నీ కొద్దికొద్దిగా వేసి పైన చెప్పినట్లుగానే చేసుకోవచ్చు. ★

మార్పులుగూడ అవసరమని మన మనస్సుకే తోస్తుంది.

ఆడవాళ్లకు ఆస్తిహక్కులు లేకుండా, చదువు సంధ్యా లేకుండా అణచివేయాలని ఏ ఆడదీ కోరుకోదు.

నిజంగా చెప్పాలంటే బి. ఎ. చదివిన ఇరవైఏళ్ల అమ్మాయిలు చాలామంది పటి పసిపాపాయిలే. ఆమె వివాహం చేసుకొని వాస్తవజీవితంలో ప్రవేశించినపుడు తన అంతస్తునుండి కొన్ని మెట్లు దిగి సామాన్య విషయాలు అనేకం నేర్చుకోవలసి వస్తుంది. ఈ 'విద్య'ను కూడా ఆ 'బి. ఎ.' డిగ్రీ తెచ్చుకునేటపుడే నేర్చుకుంటే, జీవితంలో సమస్యలు ఉండవు కదా ?

పవిత్రమైన దాంపత్యానికి, ప్రేమమయమైన జీవితానికి పాలిత పాలక సంబంధం అంటగట్టి, "పురుషజాతి" మీద యుద్ధం చేసినట్లు మాట్లాడడము కేవలము సృష్టికే అపచారము.

బి. పార్వతీదేవి (గుంటూరు).

ఉన్నమాట

ఉన్నమాట చెప్పుకోవాలంటే. మన మటుకు మన దేశంలో, స్త్రీలు ఎంత చదువుకున్నా, నూటికి 95%వరకూ, వివాహానంతరం ఉద్యోగాలకు వెళ్ళకుండా ఇంటిపట్టునే ఉంటారు. వీరిలో, ఆస్తిపాస్తులు అట్టే లేనివారూ, భర్త తెచ్చే జీతం ఇల్లు నడపడానికి చాలక ఇబ్బందిపడేవాళ్లూ ఎందరు ఉంటున్నారో అందరికీ తెలుసును. అటు కూలినాలి చేసుకునేవారిలాగా మొగుడితోపాటు భార్యకూడా కాయకష్టానికి వెళ్లడం 'మధ్యతరగతి' అనబడే జాతిలో ఎక్కడా కనబడదు అప్పులూ అవస్థలూ తప్పవు. అటువంటి స్థితిలో ఇల్లాలు ఇంటి పట్టునే ఉంటూ వేడినీళ్లకు చన్నీళ్లు అన్నట్లుగా నాలుగుడబ్బులు గడించడానికి మార్గాలు ఉంటే ఎన్నో కుటుంబాలు సుఖపడతాయి. అందువల ఉన్నతపాఠశాలలోనే ఆడపిల్లలకు చేతిపనులు బోధించడానికి ఏర్పాటు జరుగడం చాలా అవసరం. లేసులు, స్వెట్టరు, మేజోళ్ళు మొదలైనవి అల్లడం, కేవలం ఇంకోపనిలేక, సరదాకీ, కాలక్షేపానికీ అని మాత్రమే అనుకోనక్కరలేదు. నాలుగిళ్ళవాళ్ళు కలసి వీటిని తయారుచేస్తే ఎవరైనా ఒక మనిషిని జీతానికి మాట్లాడుకొని, అమ్మించవచ్చును.

రావి లక్ష్మీగణపతిరావు
(రాజమండ్రి)

* * *

మార్పు రావాలి

విద్యాభ్యాసం చేసే ఆడపిల్లలలో కాలేజీ విద్య నేర్చుకునేవారికన్న, స్కూలు ఫైనల్ ఘట్టంతో స్వస్తిచెప్పేవారే ఎక్కువ. ఈ మాత్రం చదువుకున్నవారిలో కూడా చాలామందికి తాము నేర్చిన విద్య పెండ్లి చేసుకొని కాపురానికి వెళ్లిన తరువాత, నిత్యజీవితములో ఎంతవరకూ తోడ్పడుతున్నది ?

నిజానికి, ఈ తరహాకి చెందిన యువతులూ, లేక గృహిణులలో చాలమందికి ఈ విద్య చాకలిపద్దులు వేయడానికీ, ఊసుపోనప్పుడు ఏవో పుస్తకాలు చదువుకోవడానికీ మాత్రమే ఉపయోగపడుతున్నది. అంటే ఇవి పనికిమాలిన పనులు అని చెప్పడంకాదు. ఆర్థికస్థితి అంతబాగు లేని కుటుంబాలలో స్త్రీ ఉద్యోగం చేయడానికి వీలులేని సందర్భాలలో సంగీతం ట్యూషన్లద్వారా కాని చేతిపనులద్వారాదాని, తదితర గృహపరిశ్రమలద్వారాగాని కొంతలో కొంత ఆర్జించి భర్తకు జీవితభాగస్వామిని అన్న మాటను సార్థకము చేయవచ్చుగదా ? అందుచేత, ఉన్నత పాఠశాలలలోనే ఆడపిల్లలకు భవిష్యత్తులో అవసరమైతే ధనార్జనకుకూడా అవకాశం కలిగించేవిధంగా చేతిపనులు లలితకళలు నేర్పాలి. అంతేకాదు, పిల్లలను మంచి పద్ధతులలో పెంచి, భావిపౌరులుగా తయారు చేయడానికి తగిన తెలివి తేటలూ సామర్థ్యం కలగాలంటే, గృహనిర్వహణకు సంబంధించిన విషయాలుకూడా బోధించాలి. కళాశాల విద్యలోకూడా తగు మార్పులు జరగాలి.

ఏనాడైతే స్త్రీ ఆర్థికంగా పురుషునికి తోడ్పడుతుందో ఆనాడే మనదేశం సకల సంపదలతో తులతూగుతుంది. ఇందుకు ప్రతి స్త్రీకి ఉత్సాహం కలిగించాలి, అవకాశం కల్పించాలి.

ఆచంట కృష్ణకుమారి

* * *

ఇది పొదుపా!

14.11.56 తేదీ వారపత్రికలో శ్రీమతి కొత్తపల్లి రాజ్యలక్ష్మిగారు, టేబుల్ సాల్టు తయారు చేయడానికి చెప్పిన పద్ధతి నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆమె సూచన ప్రకారం హాస్పిటల్ దూది వాడడం, ముప్పైసార్లు వడబోయడం అనుసరించి ఈ ఉప్పు తయారుచేస్తే చాలా ఖర్చు అవుతుంది. ఎంతో విలువైనకాలం వృధా అవుతుంది. పైగా శ్రమ ఏదో సరదాతోపాటు, కొంత పొదుపు చెయ్యాలనే కదా ఇలాంటివి ఇంట్లో చేసుకునేది? నిజానికి ఇంతఖర్చూ, శ్రమా అవసరంలేదు.

ఉప్పు పొద్దుటే నీళ్ళలో పోసి ఉంచితే, సాయంత్రానికి చక్కగా కరిగిపోయి, మడ్డి

తిలకం

కావలసిన వస్తువులు తుమ్మజిగురు, ఎర్రసిరాపొడి, ఒక్క చుక్క నల్లసిరా.

తెల్లటి, శుభ్రమైన తుమ్మజిగురు ముక్కలు మూడణాలవి తెప్పించి పొడి కొట్టి ఉంచుకోవాలి. ఎర్రసిరా బిళ్ళలు రెండు, లేదా రెండు పొట్లాల ఎర్రసిరా పొడుం తెచ్చుకోవాలి. (కాణీకి ఒకటి ఇస్తారు.)

వెడల్పుమూతి ఉన్న అల్యూమినియం గిన్నెగాని, స్టెయిన్లెస్ స్టీల్ గిన్నెకాని పొయిమీద పెట్టి రెండు కప్పులనీళ్లు అందులోపోసి కళపెళ మరగనిచ్చి, అందులో తుమ్మజిగురు పొడివేసి కలుపుతూ చిక్కగా పాకం వచ్చేలాగున మరగనిచ్చి దించాలి. అందులో ఈ ఎర్రసిరా పొడుమువేసి బాగా కలపాలి తరువాత ఒక్క చుక్క నల్లసిరా వేసి కలపాలి.

నల్లసిరా చుక్క వేస్తే తిలకం అమాంతం నల్లబడిపోదు. మరీ ఎర్రగా రక్తపు ఎరుపురంగులాగున కాకుండా ముదురు ఎరుపురంగు వచ్చి నిగారింపు ఉంటుంది.

తరువాత దీనిని చల్లగా చల్లారనిచ్చి వెడల్పాటిమూతిగల సీసాలో వేసి మూతి బిగించాలి. కావలిస్తే సెంటు ఏదయినా, జిడ్డులేనిది కొంచెంగా— అంటే నాలుగయిదు చుక్కలు కలుపుకుంటే బజారులో కొన్నమాదిరిగా పరిమళ తిలకం తయారవుతుంది.

కొంచెం కొంచెం తీసి వేరే చిన్నసీసాలో వేసి వాడుకొంటే, ఒకవేళ పిల్లలు క్రిందపడేసినా అంతా నష్టం అవదు.

బళ్ళ అహల్యాదేవి (భోజ్ దీ; బీహారు)



ఆంధ్రప్రదేశ్ గవర్నరు సతి శ్రీమతి కుసుంకుమారి డిసెంబరు 14 న కాకినాడ పురపాలక సంఘ ఉన్నత పాఠశాల (బాలికల)ను సందర్శించారు. పాఠశాలలో చేతిపనుల శిక్షణశాఖను చూపుతున్న ప్రధానోపాధ్యాయిని శ్రీమతి చూడామణి, శ్రీమతి త్రివేది, జిల్లాకలెక్టరు సతి శ్రీమతి ఇందిరా కృష్ణస్వామిగారలను ఈ చిత్రంలో చూడవచ్చు.

నూనె గోంగూర

గుండెపూడి రాజ్యలక్ష్మి (సత్తెనపల్లి)

నూనెగోంగూర: ఆంధ్రులకు గోంగూర అరవలకు పాగాకు అని ఛలోక్తి. ఆంధ్రులకు గోంగూర అంటే చాలా యిష్టము. ముఖ్యంగా గుంటూరు గోంగూర జగద్విఖ్యాతి వహించింది. గుంటూరు జిల్లాలో పనిచేయడానికి వచ్చే ఉద్యోగస్తులు ఇతరప్రాంతీయులయినప్పటికీ, బదిలీ అయి గుంటూరునుండి వెళ్ళేప్పుడు కనీసము ఒకజాడీ నూనెగోంగూర అయినా వెంట బెట్టుకొని వెళ్ళడము పరిపాటిఅయిపోయింది.

నూనెగోంగూర మొదలయిన పచ్చళ్లు తయారుచేసి వుంచుకుంటే పిల్లా జెల్లా గల సంసారాల్లో చాలా ఆటొస్తుంది. నూనె గోంగూర పచ్చడి చెయ్యడము చాలా తేలిక. దీనికి కావలసిన వస్తువులు కూడా ప్రతివారికీ అందుబాటులో వుంటవి..


గోంగూర-½ వీశె; ఎండు మెరపకాయలు-2 తులములు; మినపప్పు-4 చెమ్చాలు; తగినంతగా మెంతులు; ఆవాలు; పసుపు-స్పూను; నూరిన వుప్పు-1/8 శేరు; కారము-1/10 శేరు; ఉల్లిపాయలు-15 తులములు; నువ్వులనూనె-15 తులములు.

చేయువిధము: ముందు పై చెప్పినవిధముగా కావలసిన పదార్థముల నన్నిటినీ తూచుకొని వేరుగా పెట్టుకోవాలి. గోంగూరలో కాడలు, తొడిమలు, చీడపట్టి కుళ్ళిపోయిన ఆకులు లేకుండా పూర్తిగా శుభ్రము చేసుకుని వుల్లిపాయలను కూడ సన్నగ తరిగి పెట్టుకోవాలి. తరువాత ఒక కంచు గిన్నె గాని కళాయిగిన్నె కాని తీసుకొని అందులో నువ్వులనూనె పోసి పొయ్యి మీద గిన్నె నుంచి నూనెను బాగా కాగనివ్వాలి. కాగిననూనెలో తొడిమలు తీసిన మెరపకాయలను తుంచి పవేసి కొంచెము నలుపు వర్ణము రాగానే మినపపప్పు మెంతులు కూడా నూనెలో వెయ్యాలి. మెంతులు మినపపప్పు కొంచెము వేగిన తర్వాత ఆవాలను పోసి కొద్దిసేపు చిటపటలాడనిచ్చి పోపు గింజలు మొత్తము ఎరుపురంగు తిరిగాక సన్నగా తరిగిన వుల్లిపాయముక్కలు వేసి మరి కొద్దిసేపు వేగనివ్వాలి. అప్పుడు గోంగూరను కూడా గిన్నెలో వేసి మూతపెటి అయిదు నిమిషాలు కాగానే కలియబెట్టాలి. ఇలా రెండు మూడుసార్లు కలియబెట్టే సరికి గోంగూర బాగా మెత్తగా పులుసుకూరలాగా తయారవుతుంది. అలా అయిన తరువాత కారము, పసుపు, నూరిన వుప్పును గోంగూరలో వేసి బాగా కలిసి పోయేట్లు చేయాలి. తరువాత రెండునిమిషాలు గిన్నెను పొయ్యిమీద నేవుంచి దించిన పచ్చడి ఘుమఘుమలాడుతూ బాగుంటుంది. ఇలా తయారయిన పచ్చడి పది పదిహేను రోజులదాకా వాడుకోవచ్చు. చద్దివాసనేమీ వేయదు. పదిమంది పిల్లలున్న సంసారానికి నూనె గోంగూర ఎంతో అండగా ఉంటుంది. ★

నిజం చెప్పాలంటే

అంతా అడుక్కి దిగిపోతుంది. ఆ నీటిని జాగ్రత్తగా, మడ్డి కదలకుండా వేరొక పాత్రలోకి వంచి పొయ్యిమీద పెట్టవచ్చు. అనుమాన మున్నవారు గరాటిలో ఫిల్టర్ పేపర్ వేసి ఒకటి రెండుసార్లు వడపోస్తే సరి. ఫిల్టర్ పేపర్ లేకపోతే, శుభ్రమైన సన్నటి బట్టను నాలుగు పొరలుగా వేసి వడపోయవచ్చు. మిగతాదంతా రాజ్యలక్ష్మిగారు చెప్పినట్లే చేయడం.

ఎం. నిర్మల (గుంటూరు) ★



నయా పైసాలు : ఇప్పటి నాణెములకు సరియైన కొత్తనాణెములు. ఇప్పటి అణాకు 6 నయా పైసలు—వరప—

విలువైన సలహాలు

పాలగిన్నె చుట్టూ అంచున కొంచెం గ్లిసరిన్ పట్టిస్తే సరి పాలు పొంగిపోకుండా వుంటాయి.

సీసా బిరడా, సీసా మూతికి అంటుకుపోతూ వుంటే బిరడా చుట్టూ కొద్దిగా గ్లిసరిన్ పట్టిస్తే, జిగురు సీసా అయినాసరే అంటుకోకుండా వుంటుంది.

జిగురు సీసాలో నీరులేక, గట్టిపడితే కొద్దిగా గ్లిసరినూ, వెచ్చని నీరు అందులో పోస్తే సరి ఇంక మామూలుగా వుంటుంది.

బట్టలమీది కాఫీ మరకలు, టీ మరకలూ పోకపోతే శుభ్రమైన గుడ్డపీలిక మీద కొద్దిగా గ్లిసరిను వేసి మరకపడ్డచోట రుద్దితే సరి.

రెండు కాఫీ గ్లాసులుగాని, గిన్నెలుగాని ఒకదానిలో ఒకటి ఇరుక్కుని రాకపోతే రెండిటి సందున కొద్దిగా గ్లిసరిను బొట్లు వేస్తే సరి, కొద్ది నిమిషాల్లో ఇట్టే తేలిగ్గా వచ్చేస్తుంది.

దగ్గు, పడిశెం వున్నవారు ఒక చీపురుపుల్లకు దూదిచుట్టి గ్లిసరినులో ముంచి గొంతులో బాగా గద్ది ఆపైన నీళ్లు నోట్లో పోసుకొని పుక్కిలించి ఉమ్మివేస్తే గొంతులో నెప్పి, కొర కొర అంతా తగ్గుతుంది.

అప్పుడప్పుడు మనం వాడుకునే దువ్వెనలు, బ్రష్‌లు శుభ్రం చేయటం మంచిది. పావు బకెట్టు వెచ్చని నీటిలో రెండు టేబుల్ స్పూనుల వెలిగారము, సగం కప్పు సోపు చిప్సూ వేసి, బాగ గిలకొట్టి అందులో దువ్వెనలు బ్రష్‌లు వేసి రెండు నిమిషాలు అలాగే వుంచి ఆ తర్వాత వాటినితీసి వెచ్చని నీళ్లతో రుద్ది కడిగి శుభ్రం చేయాలి. చన్నీళ్లలో కొద్దిగా వుప్పువేసి వాటిని మరొకమారు ఆ నీళ్ళతో రుద్ది కడిగెయ్యాలి. దువ్వెన ప్రతి పన్ను మధ్య వున్న మట్టిని పిన్నుతో తీసేసి సబ్బు నురగతో ఇంకోమారు కడిగి శుభ్రం చెయ్యాలి. ఈ విధంగా చేయటంవల్ల దువ్వెనలో వున్న మురికంతా పోయి వాడుకోవటానికి బాగుంటుంది. ఆటివస్తుంది.

మీరెప్పుడైనా రెండు రోజులపాటు ఎక్కడికైనా వెళ్ళదలచినప్పుడు తోటల్లో పెంచిన పూల మొక్కలకు నీరుపోసేవారుండకపోవచ్చు. అటువంటప్పుడు ఒక పాతబట్టను సన్నగా దారంలాగ చింపి కొన్నిటిని తీసుకొని వత్తిలా చేసి నీటిలో తడిపి ఒక కొసను ఒక సీసాలోని నీటిలో వదిలిపెట్టి మరొక కొసను మొక్కచుట్టూ వదులుగా రెండు మూడు చుట్లు చుట్టిపెడితే సరి. మొక్క నీరు లేక ఎండిపోతుందనే భయముండదు.

సేకరణ : కుమారి బి. పద్మావతి,

—నెల్లూరు.

* * *

భర్త:—"నా ఉత్తరం ఎవరూ చింపి చూసింది? నువ్వేనా?"

భార్య:—"మామూలుగా మీ ఉత్తరాలేం ముట్టుకోను. దీనిమీద 'ప్రైవేట్' అని ఉండబట్టి చూశాను."

* * *

ఒక ప్రసిద్ధ రచయిత వ్రాసిన నవలను ఒక సినిమా కంపెనీ వారు కొనేసి "అద్భుత చలన చిత్ర రాజము" గా నిర్మించారు.

చిత్రం విడుదలయిన తరవాత రచయిత ఆ సినిమాకథ ఆధారంగా మళ్ళీ ఇంకో నవల వ్రాయడానికి పూనుకున్నాడు.

★ మంత్రాలు: నష్టకాలు ★

(30వ పేజీ తరువాయి)

విఘ్నాలు జరుగలేదు. వారి పూజాదికముచే వీరింటిలో గొడవలు చాలా వరకూ తగ్గినవి. అగ్నిప్రమాదములు మాయమైనవి.

వెంకట్రామయ్యగారు. యిరవై రోజులు వీరింట పూజలు సలిపిరి. ఒకరోజు వారింటి యందు పూజాసమయములో పడిన రాయిని అయ్యగారి వెంకట్రామయ్య గారికి చూపారు. తిరిగి వారింటియందు రాయి పడ లేదు. ఈ విధముగా పూజలు పూర్తి అయే సరికి వారింటియందు గొడవలు పూర్తిగాతగ్గి పోయాయి. అన్ని బాధలనుండి నివృత్తి కలిగి సుఖముగా ఉన్నారు. ఈ అవస్థలు వారికి చేతబడిద్వారా కలిగాయని తరవాత తెలిసింది. మంత్రశక్తి లేదని వాదించేవారు యిదిచదివి వారి దృష్టిని మరల్చుకొందు రని తలుస్తాను.

ఎ. అరుంధతీరావు—ఏలూరు.

* * *

బందరు నోబుల్ కళాశాలలో మాగురువు గారైన స్వర్గీయ ముక్కేవి పార్థసారథి గారున్నూ, నేనున్నూ 1931 సం॥ రంలో విద్యార్థులమై యుండగా మాకు జరిగిన అనుభవం మనవిచేస్తా. ఆయన అప్పుడు బి. ఏ., నేను ఇంటర్ చదువుతూన్నాం. అప్పటికే మా గురువుగారు తేలుమంత్రము, పాము మంత్రము, బెణుకు మంత్రములలో బాగా పేరుప్రఖ్యాతులు సంపాదించారు. జాన్సన్, పటేల్ వర్త మొదలైన విదేశీయులున్నూ, సబాస్టియన్ పాల్, జ్ఞానముత్తు మొదలైన క్రిష్టియన్లు ఆ కాలేజీలో పని చేస్తున్న రోజులవి. మా లాజిక్ లెక్చరర్ కు ఒకరోజున మెడబెణికి అటూ, ఇటూ కదల నీయలేదు. కాలేజీలోకి వచ్చి రాగానే ఆయన డాక్టర్లు చుట్టూ తిరిగినానని, ఫలితములేదని చెప్పారు. ఆ వెంటనే మా గురువు గారు మన సంస్కృతిని గూర్చి చెప్పి "3 పూటలలో మెడ మామూలుగా చేస్తా" నన్నారు. మాగురువుగారు పైకి చాలా అమాయకుడుగానూ, వేషభాషల్లోకూడా నేటి నవనాగరికులవలె కాక, పిలక పెట్టు కొని ఉండేవారు. లెక్చరర్ నవ్వారు. గత్యంతరం కనపడనందున సరే చూస్తా నన్నాడు. 3 పూటలలో 3 మంత్రాలతో మెడమామూలుగా వచ్చింది. అదిలగాయతు కాలేజీ లెక్చరర్లు అంతా ఆశ్చర్యపడి మన సంస్కృతిగూర్చి అమోఘంగా అత్యద్భుత మైనదానిగా వర్ణింపజొచ్చారు.

మన మంత్రశాస్త్రంలో ఇంకో విషయం వుంది. మంత్రం తెలిసినవారు ప్రతిఫలం ఆశించకుండా అర్ధరాత్రి అయినా అపరాత్రి అయినా "యోగక్షేమం వహామ్యహమ్" అనే దృష్టితో వెళ్లి మంత్రకార్యక్రమం నెరవేర్చు కొని రావలసిందే. ప్రతిగురువు శిష్యునకు కొన్ని నియమాలు పాటించుటకొరకు చెపుతాడు. ఆ నియమాలు పాటించినంత కాలమూ అవితప్పక పని చేస్తాయి. వాటిలో ఏవి పాటించకపోయినా ఆ మంత్రము పట్టుతప్పిపోతుంది. మంత్రంలో దోషం వుండిగాదు. శిష్యుల నడవడికే ఆదుస్థితి కలుగజేస్తుంది. ఏ మంత్రం అయినా సిద్ధిపొందిన గురువుద్వారానే ఉపదేశం పొందాలిగాని పుస్తకాలు చూచి చదివితే పనిచేయదు. ఇంతేగాక ప్రతి శిష్యుడు, ప్రథమంగా మంత్రశాస్త్రం చెప్పిన గురువునకు నమోవాక్కు లర్పించాలి. "పరోపకారార్థ మిదం శరీరం" అనే దృష్టితో మానవులకు సేవచేయాలి గాని మంత్రాలువచ్చు అనే డంబాచారాలు చెప్పకోరాదు. తన్ను గూర్చి డబ్బా వాయించుకోరాదు. ప్రతిఫలం కోరరాదు. మించి వ్రాయ వీలులేనందుకు, ప్రత్యక్షంగా జవాబు చెప్పజాలని స్థితిలో వున్నందులకు పాఠకులు నన్ను మన్నింతురుగాక. అవసరం వచ్చినప్పుడు, పరీక్షకున్నూ, ప్రజలకు సేవ చేయుటకున్నూ సంసిద్ధతనుమాత్రం తెలియ జేస్తున్నాను.

ముక్కేవి శ్రీ రంగాచార్యులు
పెదముత్తేవి [కృష్ణాజిల్లా)

* * *

మరణించిన మంత్రగాడు

మా ఊళ్ళో ఖాన్ సాహెబు అనే అయ నుండేవాడు. అతడు ఎటువంటి సర్పము నైనా అవలీలగ పట్టుకొనేవాడు. అతని జేబులో ఎప్పుడూ ఒక నాగుపాము (విషము తీయనిదే) తప్పకుండా ఉండేది. ఒకసారి యెవరికో జ్ఞాపకములేదు, పాము కరిచింది. డాక్టరుగారువచ్చిచూచి లాభములేదన్నారు. ఇంతలో కొందరు ఖాన్ సాహెబును తోలు కొనివచ్చారు. డాక్టరుకూడ అచ్చటనే ఉన్నారు. ఇద్దరికి వివాదం జరిగింది. కరిచినవాన్ని బ్రతికిస్తే పదిరూపాయలిస్తానని డాక్టరుగారు పందెం వేశారు. ఖాన్ సరే నన్నాడు. బ్రతికించి పందెం నెగ్గాడుకూడ. అప్పటినుండి ఆడాక్టరుగాని ఎవరైనా పాము కరచింది రమ్మంటే "నేనెందుకయ్యా! ఖాన్ సాహెబును తోలుకపొండి" అనే వారు.

అతను ఐదారు మాసముల క్రితం పాము కరచి విచిత్రంగా చని పోయినాడు. బాగా త్రాగి ఒక నాడు సినిమా చూడబోయినాడు. అతనిజేబులో నాగుపాముండడం మామూలే. సినిమాలో నాగిన్ రికార్డు వేశారట. అప్పుడా పాము జేబులోనుండి ఇవతలకు రాబోయినది. సాహెబుగారు కోపముతో దానిని గట్టిగా జేబులోకి అదిమినారట. అది వెంటనే కాటు వేసింది. సాహెబుగారు మత్తెక్కి ఉండుటచేత దాన్ని గిరగిరా త్రిప్పి నేలకు గొట్టి చంపినాడు. తరువాత స్మృతి దప్పింది. అతని కుపదేశము చేసిన గురువుగారివద్దకు తీసికొనిపోయి సంగతంతా చెప్పారు. అతను 'మంత్రం నేర్చిన వాడె న్నడూ పామును చంపగూడదు. ఇతను మత్తెక్కి పామును చంపినాడు కాబట్టి ఇక లాభం లే"దన్నారు. అతనుచచ్చిపోయాడు.

ఈవిధంగా డాక్టరు లాభంలేదన్న వారిని బ్రతికిస్తుంటే మంత్రాలను నమ్మకపోవడ మెట్లా!

భాగవతము రామారావు, మెదకు.

★

చాపల

ఒక పట్టణంలో ఒక బ్రాహ్మణుడున్నాడు. పేరు పేరిభొట్లు. అతడికున్న ఆస్తి అంతా నిగనిగలాడే ఒక రాగిచెంబే. ఆ రాగిచెంబుతో ప్రతిరోజూ నాలుగిండ్లలో ఉపాదానం సంపాయించుకుంటాడు పేరిభొట్లు.

ఒక రోజున సూర్యోదయానికి ముందే పేరిభొట్లు నదిలో స్నానం చేసి, సంధ్యవార్చుకుని, ఉపాదానానికి పోవటానికని రాగిచెంబు తోముకుంటున్నాడు. అతడికి లక్ష్మీదేవి ప్రత్యక్షమయింది.

"ఈరోజునుంచీ నేను నీ ఇంట్లో వుంటాను" అన్నది పేరిభొట్లుతో లక్ష్మీదేవి.

పేరిభొట్లు ఎగిరి గంతు వెయ్యలేదు. అతడు తల వంచుకునే, "నీకు బుద్ధి స్థిమితంలేదు. నిష్కాముడైన నాకూ, చపలమైన నీకూ పడదు. నీకో నమస్కారం. పోయిరా తల్లీ!" అన్నాడు.

అయితే లక్ష్మీదేవి పోయి రాలేదు! "అలాకాదు. నేను నీ యింటికి రావలసిందే" అన్నది.

ఇదేం పీడరా అనుకున్నాడు పేరిభొట్లు. ఐతే లక్ష్మీదేవి వదలదు! ఇక తప్పదనుకుని, అతడు "ఐతే ఒక షరతు. నువ్వు ఎప్పుడు నావద్దనుంచి వెళ్ళిపొయ్యేదీ ఇప్పుడే చెప్పు" అన్నాడు.

అందుకు లక్ష్మీదేవి ఇలా జవాబిచ్చింది: "నీకు పెళ్ళవుతుంది. కొంతకాలానికి ఒకరోజున నీ భార్య నోటినుంచి, నీ యింటిని గురించి 'పాడుకొంప' అన్నమాట వస్తుంది. ఆ తర్వాత సరిగ్గా మూడురోజులకు నేను నీవద్దనుంచి వెళ్ళిపోతాను. ఇదే గుర్తు," యిలా చెప్పి మాయమయింది.

తర్వాత పేరిభొట్లు నరానరి రాజ నగరుకు పోయి "భిక్షాం దేహి" అన్నాడు. నగరులో రాణీగారు ఉయ్యాల ఊగుతూ అతనికి మహా అందంగా కనిపించింది. పైత్యమెత్తినవాడల్లే వెళ్ళి, రాణీగారి చెయ్యి పట్టుకున్నాడు పేరిభొట్లు.

పణతుల రామచంద్రయ్య

రాణీగారూ, చెలికత్తెలూ నిర్ఘాంతపోయారు. అంతలో ఒక త్రాచుపాము ఉయ్యాల గొలుసుల మీదుగా కిందికి దిగుతూ వాళ్ళకు కనిపించింది. వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు.

వెంటనే చెలికత్తెలూ, రాణీగారూ పేరిభొట్లు పాదాలకు సాష్టాంగపడ్డారు. ఈ విషయం రాజుగారికి తెలిసింది. తమ రాణీని సర్పగండంనుంచి కాపాడినందుకు సంతోషించి, రాజుగారు పేరిభొట్లును తన ప్రధాన మంత్రిగా చేశాడు.

ఆ తరువాత కొద్దిరోజులకే పేరిభొట్లుకు పెళ్ళయింది. సంతానం కలిగింది. సమస్త భోగభాగ్యాలు అనుభవిస్తూ, పది సంవత్సరాలు ప్రధానమంత్రి పదవి వెలిగించి రాజుగారి మెప్పు పొందాడు పేరిభొట్లు.

ఒక రోజున పేరిభొట్లు భార్య, ఇంటి సేవకులమీద కోపగించి, "ఛీ! పాడుకొంప. సేవకులుకూడా మాట వినటంలేదు" అన్నది. పేరిభొట్లు ఈ మాటలు విన్నాడు. లక్ష్మీదేవి షరతు అతడికి గుర్తు వచ్చింది, అతడు వెంటనే భార్యనూ, సంతానాన్నీ పుట్టింటికి పంపేస్తూ, తన ఐశ్వర్యమంతా వాళ్ళకు యిచ్చివేశాడు.

తర్వాత రెండురోజులకు పేరిభొట్లు రాజుగారితో కలిసి వేటకు వెళ్ళాడు. మధ్యాహ్నం వరకూ వేటాడినపిమ్మట యిద్దరూ ఒక చెట్టుకింద విశ్రాంతి తీసుకున్నారు.

రాజుగారు బాగా నిద్రపోతున్నాడు. పేరిభొట్లుకు ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు. ఇంతలో చెట్టుకొమ్మల్లోనుంచి ఒక కాకి పేరిభొట్లుమీద రెట్ట వేసింది. దాన్ని గీచివేసేందుకని అతడు ఒరలోనుంచి కత్తి తీశాడు.

ఆ క్షణంలో రాజుగారికి మెలకువ వచ్చింది. పేరిభొట్లు ఒరనుంచి కత్తితీయటం ఆయన గమనించాడు. తన్ను నిద్రపోతూండగా చంపివేసి, రాజ్యాన్ని అపహరిద్దామనే ఉద్దేశ్యంతో పేరిభొట్లు ఒరనుంచి కత్తితీస్తున్నాడని ఆయన అనుకున్నాడు. "నీచుడా! ఇంత కృతఘ్నుడివనుకోలేదు" అంటూ ప్రక్కనున్న సేవకులకు, పేరి

నాన్న:-"ఒరే, మనకి చెవు లెందుకురా."
నానీ:-"వినటానికి."
నాన్న:-"నీ రెండు చెవులూ కోసేస్తే ఏమవుతుంది?"
నానీ:-"కనిపించదు."
నాన్న:-"కనిపించదా, వినిపించదా?"
నానీ:-"కనిపించదు. ఏడ్చేటప్పుడు కళ్లు మూసుకుని ఏడుస్తాగా, మరి, ఎల్లాకనిపిస్తుంది?"

భోట్లను బంధించమని ఆజ్ఞ యిచ్చాడు.

మరునాడు న్యాయస్థానంలో విచారణ జరిగింది. రాజు పేరిభోట్లును "నువ్వు చెప్పకునే దేమిటి?" అని అడిగాడు. "చిత్తగించండి" అంటూ పేరిభోట్లు తన మునుపటి జీవితం, లక్ష్మీదేవి ప్రత్యక్షమవటం మొదలైన విషయాలన్నీ పొల్లుపోకుండా ఏకరువు పెట్టాడు. అందుకు ఆనవాలుగా తాను అన్నాడు,లక్ష్మీదేవి ప్రత్యక్షమైనరోజు, రాజనగరుముందు పాతిపెట్టివుంచిన తన రాగిచెంబు తెచ్చి అందరికీ చూపించాడు.

సభ్యులతోపాటు రాజుగారు కూడా విస్తుపోయారు. ఆయన గబగబ లేచివచ్చి పేరిభోట్లు పాదాలను పట్టుకుని, "క్షమించండి మహాత్మా! గతాన్ని మరచిపోయి తిరిగి ప్రధానపీఠం అలంకరించండి" అన్నాడు.




భావిపౌరుడు

ఫొటో : ఎన్. రామకృష్ణ.

అయితే పేరిభోట్లు వప్పుకో లేదు. "ఇందులో నీ తప్పేమున్న దయ్యా రాజా? లక్ష్మీదేవి సంకల్పానికి మీరంతా కీలుబొమ్మలు మాత్రమే" అంటూ రాజుగారిని ఓదార్చి, "ఆమె బలవంతంవల్లనే యింతవరకైనా వుండక తప్పింది కాదు. నేటితో ఆ పీడ వదిలిపోయింది. ఇక సెలవు" అని, చిలుము పట్టిపోయిన తన రాగిచెంబు తోముకుంటేందుకు నదివైపు సాగిపోయాడు. ★

ఉద్యోగి :- నేను పదేళ్ళనుంచీ ఈ ఆఫీసులో పని చేస్తున్నాను ముగ్గురు మనుషులు చేసేపని ఒక్కణ్ణే చేస్తున్నాను. ఈ ఏడాదైనా మీరు జీతం హెచ్చించాలండి.

మేనేజరు:-జీతంమాట తరవాత చూద్దాంగాని, ముందు ఆ మిగతా ఇద్దరి పేర్లూ చెబితే వాళ్ళని తీసేస్తాను



పిచ్చివాని టోపీ

ఆర్. దొరసామి

ఒక్క పిచ్చివాడు పోవు
చుండె రాచవీధి వెంట
చక్కడిదో తలపై నొక
చక్కని టోపీ ధరించి.

ఎదురయ్యెను ఆ పట్టణ
మేలు నరేంద్రుడు వానికి,
అది యెందుకొ పాగాలే
దాజేనికి సమయానికి.

ధరణీశుని చూచినదే
తడవుగ నా యున్మత్తుడు
పరిహాసం చేసె నిట్లు
పకపకనగి తా నవ్వుచు.

గతిలేదొక టోపికూడ
కటకట! రాజాగారికి
అతికృపణుడు కాబోలును
ఇతడిక ఈలోకానికి.

అందుకు రాజాగ్రహించి
అన్నా డిట్లొక భటునికి
"ముందు పెరికి కొనితెమ్మా
మూర్ఖుని టోపీ నిచటికి."

ఆ సేవకు డట్లుసేయ
నాత డమ్మహారాజును
చూసి యిట్టులనెను చాల
చులకనగా నవ్వునవ్వి.

"టోపీ గతిలేనందున
భూపాలు డయో పాపము!
కోపగించి తెమ్మనె నా
టోపి, చెంది కడులోభము."

పెద్దివాని మాట కతడు
వినకి పారవైచె టోపి;
తుఱ్ఱున పరుగిడి యున్మ
త్తుడు గైకొనె నాటోపీ,

నగర్వముగ నిట్టులనెను
జనపాలాగ్రణి చేతకు
తగునో తగదోయని మది
దలప బోక వాడింతకు.

"ఇదిగో నాదెబ్బ చూడు
డీ ధరణీశుడు భయపడి
యిచ్చివేసె కుళ్ళాయిని
యిస్సీ! ఇవుడే త్వరపడి!

పిచ్చివానితో నేమని
పృథివీశుడు వెళ్ళిపోయె;
పిచ్చివాడు యిహిహీయని
విరగంబడి నవ్వుకొనియె.

కపటబుద్ధి

ప్రజల కష్టసుఖాలను తన కష్ట సుఖాలుగా భావించే విక్రమార్కుడనురాజు ఒకప్పుడు ఉజ్జయిని నగరాన్ని పరిపాలించాడు. అతని కొలువులో ఒక మంగలి ఉండేవాడు. మంగలి పరుల సంపదల్ని చూచి కన్నుకుట్టుకొనే జాబితాలో వాడు. కపట బుద్ధిగల మనిషికూడ.

ఒకనాడు విక్రమార్కుడు సింహాసనముపై కూర్చొని తన ప్రజల కష్టసుఖాలను విచారిస్తూ ఉన్నాడు. ఆ సభలో మంగలి కూడ ఒకమూల ఆసీనుడయ్యాడు. ఆ సమయంలో ఒక మహాముని అతిథిగా వచ్చాడు విక్రమార్కుని సభాభవనానికి. అంత రాజు అర్ఘ్యవిధముగా ముని నెంతో గౌరవించాడు.

విక్రమార్కుని అతిథిసత్కారానికి ముని సంతోషించి, అతడు వెళ్ళిపోయేరోజున ఒక శక్తిని ప్రసాదించాడు మహారాజునకు.

విక్రమార్కుడు తన శరీరము నుండి తొలగి వేరొక మృతకళేబరములో ప్రవేశించి దానిని పునరుజ్జీవింపచేయగల శక్తి అది.

ఇట్టి శక్తిని విక్రమార్కుడు తన పట్టపుదేవికి కూడ తెలియజేశాడు. రాణి చాల ఆనందించింది.

ఒక విచిత్రమైన శక్తిని ముని వలన విక్రమార్కుడు పొందాడని కనిపెట్టాడు మంగలి. అసలే మంగలి చీడపురుగు. రాజుయందు అసూయకలిగి, ఆ శక్తిని తనూ తెలిసికోవాలని ఆలోచించాడు. కాని ఫలితంమాత్రం దక్కలేదు. దక్కదుకూడ! అందుచేత పాపం చాలవిచారంగా ఉంటూవున్నాడు మంగలి ఆనాటినుండి.

విక్రమార్కుడు మంగలి విచారాన్ని గమనించాడు. చివరికి ఒకరోజున "ఎందుకంత విచారంగా ఉంటూవున్నావు, మంగలీ, యేం కావాలి నీకు?" అని అడిగాడు రాజు మంగలిని.

ఎస్. మాధవరావు

అప్పుడు మంగలి భయ వినయములతో సమాధానము చెప్పలేక పోతూవున్నాడు.

మంగలి స్థితి చూచి చిఱునవ్వుతో కారణం తెలియజేయమన్నట్లుగా తల ఊగించాడు విక్రమార్కుడు.

ఎట్టకేలకు మంగలి ధైర్యం వహించి, "నాదొక చిన్నకోరిక మహారాజా! మహర్షిచే మీరు బడసిన శక్తిని తెలుసుకోవాలని ఆశగా ఉంది ప్రభూ!" అన్నాడు దీనంగా విక్రమార్కునితో.

అట్టి మంగలి మాటలకు జాలిపడి విక్రమార్కుడు ఆశక్తిని మంగలికి కూడ ఉపదేశించాడు, అతని దుఃఖాన్ని దూరంచేయాలనే ఉద్దేశంతో.

తనకోరిక నెరవేరిందని అప్పటి నుండి మంగలి నిశ్చింతగా కాలం గడుపుతూ ఉన్నాడు. అది చూచిన విక్రమార్కుడు కూడ అమితానందం పొందాడు మనస్సులో.

కొన్నిరోజులు గడిచాయి...

ఒక దినమున విక్రమార్కుడు వేటకు బయలుదేరాడు. రాజుతో పాటు మంగలికూడ ప్రయాణమయ్యాడు అడివికి.

అచ్చట మహారాజు ఒక లేడిని వేటాడుతున్నాడు. కాని ఆ జంతువు మాత్రం విక్రమార్కుని అస్త్రవిద్యా నైపుణ్యాన్ని పరీక్షచేస్తూ ఉందా అన్నట్లు అతివేగంతో పరిగెడుతూంది. రాజు కూడ పట్టుదలతో దానిని వెంబడిస్తూ వున్నాడు. అందుచేత మంగలికి చాల దూరమయ్యాడు విక్రమార్కుడు. తుదకు లేడి రాజుబాణానికి మృతి నొందింది.

విక్రమార్కుడు లేడికడకు వచ్చాడు. అది చనిపోయివుండుట చూచేటప్పటికి, అతనికి మునివలన పొందిన శక్తి జ్ఞప్తికి వచ్చింది. వెంటనే దాని ప్రభావమును తెలుసుకోవాలని తలంచాడు మహారాజు.

నలువైపుల జనశూన్యమగుటచే విక్రమార్కుడు తన శరీరమునుండి తొలగి ఆ లేడి మృతకళేబరములో ప్రవేశించాడు. వెంటనే లేడి చెంగున

సినిమా

ఒక్క మైలుపొడుగు: ఒక్క అడుగుస్థాయి

స్థాయిమాట దేవుడెరుగుగాని, 1956 లో తెలుగు చలనచిత్ర పరిశ్రమకూ హాలీవుడ్‌కూ పోలికలు బోలెడున్నట్టు కనబడుతోంది.

బాగా కొట్టొచ్చినట్టు కనబడేది చిత్రాల నిడివి.

1956 లో స్థూలంగా హాలీవుడ్‌ధోరణిలో పొడుగు సాగడంపట్ల మోజు పెరిగినట్లు "న్యూయార్క్ టైమ్స్" పత్రిక విమర్శకుడు బాస్లీ క్రౌథర్ వ్రాశాడు. ఈ ఏడాది ఉత్తమ చిత్రాలుగా క్రౌథర్ ఎన్నిక చేసిన పదింటిలోనూ మూడు చిత్రాలు మూడు గంటలు నడచినవి. మిగతావాటిలో ఇలాంటివి చాలా ఉన్నాయి.

తెలుగువాళ్ళ బాక్సాఫీస్ సూత్రాల్ని కిటుకులనీ హాలీవుడ్ వాళ్లు ఎలాగో సంపాయించి, కాపీకొట్టి బాగుపడి పోతున్నారని, మెల్లిగా మన స్థాయిని అందుకొంటున్నారనీ ఒకాయన ఈ వార్త విని ఛలోక్తిగా అన్నాడు.

"హాలీవుడ్ నిర్మాతలు కొంతకాలంనుండి ఇంకో విషయంలో కూడా మనని అనుసరిస్తున్నారు; పాతకథల మీద విరుచుకుపడడం" అనికూడా ఆయన అన్నాడు నవ్వుతూ.

కారణాలు వేరైనా, మొత్తం మీద అక్కడ పొడుగు సాగడంమీద, పాతకథల మీద మోజు పెరగడంమటుకు నిజం.

టెలివిజన్ పోటీని నిభాయించుకోవడానికి, వాళ్లు సినిమా స్క్రీన్‌లో విస్టావిజన్‌లు, సినేరమాలూ, త్రీ-డీలూ కనిపెట్టి పెద్ద పెద్ద బొమ్మలు చూపించడం మొదలెట్టారు. అలాగే బొమ్మల పరిమాణంతో పాటు, చిత్రం పొడుగు కూడా బాగా పెంచవలసివచ్చింది. ఈ రెండిటి వల్లా ఖర్చు దారుణంగా పెరిగింది.

దానివల్ల కొత్త కథలు, మార్కెట్‌లోకి ఎక్కగలవని ఋజువుకాని కథలు తీసుకోవడం వాళ్లు మానేశారనీ, ప్రసిద్ధ చారిత్రక, పౌరాణిక గాథలూ, బ్రాడ్వే నాటక రంగంలో బాక్సాఫీస్‌హిట్‌లు అయిన నాటకాలూ తీసుకోవడం క్షేమం అన్న అభిప్రాయంతో, అందరూ ఈ పంథాని అనుసరించారనీ బాస్లే క్రౌథర్ వివరించాడు. ఈ ఏడాది ఉత్తమ చిత్రాలుగా అతడు ఎన్నిక

పొడుగులో మనదే ముందడుగు

1956 లో దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమ, పూర్వంకన్న అన్ని విధాలా మెరుగేనని దక్షిణభారత ఫిలిం వాణిజ్యమండలి నివేదికలో పేర్కొన్నారు. చిత్రాల సంఖ్య, థియేటర్ల సంఖ్య, వసూళ్లు మొదలైనవన్నీ పెరిగాయి. చిత్రాలనిడివిలో తెలుగువారిది అగ్రతాంబూలం అయినట్లు తేలింది. వీరి నివేదికప్రకారం పరిశ్రమ స్థితిగతులు ఈ క్రిందివిధంగా ఉన్నాయి.

దక్షిణభారతంలో తయారైన మొత్తం చిత్రాలు 102. (నిరుటికన్న 5 ఎక్కువ). ఇవికాక మరో 5 సింహళభాషా చిత్రాలు తయారయ్యాయి.

తమిళ చిత్రాలు 51, తెలుగు 27, కన్నడం 14, మళయాలం 5, హిందీ 5. (నిరుటి తమిళ-చిత్రాలు 46, తెలుగువి 24.)

102 లోను 85 చిత్రాలు మద్రాసు స్టుడియోలలో తయారైనవి.

చిత్రనిర్మాతలు 76 గురిలోనూ దాదాపు సగంమంది కొత్తవారు.

1956 డబ్బింగ్ యుగం అనవచ్చు. ఉన్న 102 లోను 68 కథలు రెండు మూడు భాషలలో విడుదల అయ్యాయి.

తెలుగు-చిత్రాలు 27 లోనూ భాషాంతరీకరణం జరుగని చిత్రాలు రెండు మాత్రమే, అలాగ తమిళ-చిత్రాలు 51 లోనూ ఇతర భాషా చిత్రాలుగా విడుదలఅయినవి 33.

"మొత్తం విడుదలైన చిత్రాలనిడివి $16\frac{1}{2}$ లక్షల అడుగులు.

ఈ పొడుగులో భాషలవారీగా మనదే ముందడుగు. తెలుగు-చిత్రాల సగటు నిడివి 16,500 అడుగులు. తమిళ-చిత్రాల సగటు 16 వేలు. మిగతాభాషలవీ అంతే. ★



"బాన్ బస్" చిత్రంలో అంజలి

చేసిన పదింటిలోనూ తొమ్మిది ఈకోవకి చెందిన కథలే: రిచర్డ్ III, కింగ్ అండ్ ఐ (అన్నా అండ్ ది కింగ్ ఆఫ్ సయాం), మూబీ డిక్, లస్ట్ ఫర్ లైఫ్ (చిత్రకారుడు విన్సెంట్‌వాన్‌గో జీవిత చరిత్ర) ఎరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 డేస్ (జూల్స్‌వర్న్ నవల) ఇత్యాది.

ఇదీ వారి కథ. వారికి టెలివిజన్ పోటీ ఉంది. ఖర్చు పెరిగింది.

మనకి టెలివిజన్ పోటీకాదుగదా, అసలింతవరకూ టెలివిజన్ శాస్త్రీయే రాలేదు. అర్జెంటుగా వచ్చి పడతానని బెదరించటమూ లేదు. పోతే, మన కిక్కడ నాటకరంగం ప్రబల శత్రువుగా పెరిగిపోయి, సినిమా పరిశ్రమని అష్టకష్టాలూ పెట్టేస్తోందని చెప్పుకో డానికి అంతకన్న ఆస్కారం లేదు.

మరి మనవారు మూడున్నరమైళ్ళ పొడుగు చిత్రాలు ఎందుకు తీస్తున్నట్టూ అంటే, చిన్న చిత్రాలు తీయాలీ అని మన నిర్మాతలు యావన్మంది ఒకసారి ఒక నిర్ణయంచేసి అనుసరించే ధోరణిలో లేకపోవడమే. అటువంటి ప్రయత్నాలు వ్యక్తిగతంగా ఏ ఒక్కరో సాహసించి చేసేవి కావు

ఒకరు పదివేల అడుగుల పొడుగు చిత్రం విడుదలచేస్తే, మరొకరు పద్దెనిమిదివేల అడుగుల చిత్రం తీస్తే, కొత్తల్లో పొడుగుచిత్రమే విజయవంతం కావడానికి అవకాశం ఉంటుంది

అలాకాక, ఊళ్ళో ఆడే చిత్రాలన్నీ పదపన్నెండువేల అడుగులవే అయితే కనీసం ఈ అంశంలో తేడా ఉండదు అప్పుడు కథ, కళ, దాన్ని చిత్రించిన విధం, ఇత్యాదిక ప్రాధాన్యం వహిస్తాయి.

"కళ" అన్నమాట ఈనాడంత హాస్యాస్పద పదంగా అర్ధ రహితంగా కనబడదు.

చాలాకాలంగా 'కళ' అన్న ఈపదం, హక్కులకోసం ప్రభుత్వంతో వాదించడానికీ, పన్నులు తగ్గించమనడానికీ ఎక్కువగా ఉపయోగించబడుతోంది తప్ప, దీన్ని గురించి నిజంగా బెంగెట్టుకున్నవాళ్ళు ఆట్టేమంది లేరు. "కొత్తతనం" కోసం కోరుకునేవాళ్ళు అంతమాత్రమే అటువంటి వారు సాహసించి, కష్టపడి ఏ కొస్తయినా ప్రయత్నం చేస్తే ఆకాస్తా, ఆచిత్రంనిండా ఉండే బాక్సాఫీస్ సూత్రాలయిన్య చిక్కుపడి, రాణించకుండా పోతోంది.


"కినారే కినారే" లో మీనాకుమారి, చేతన్ ఆనంద్.


విక్రమ్ ప్రొడక్షన్స్ వారి భక్తమార్కండేయ'లో యమధర్మరాజుగా ఆర్. నాగేంద్రరావు.

అసలు పాతికేళ్ళనించి దినదినాభివృద్ధి చెందుతున్న ఈ చలనచిత్ర ప్రపంచంలో, సాంకేతికంగా కనుగొన్న కొత్తమార్గాలు, సదుపాయాలూ, చిత్రాలసంఖ్య, నిర్మాణ వ్యయం, సినిమా తీసేజనం, చూసేజనం పెరిగినట్టుగా, కథలో, చిత్రణలో, శిల్పంలో క్రమాభివృద్ధి ఎలా ఉంది అని పరిశీలిస్తే గర్వించదగ్గ సమాధానం లభిస్తుందనిపించదు

విప్లవాత్మక ప్రయత్నాలు, కొత్తతనం కోసం కృషి అనేవి కొంతకాలంసాగి, చాలాకాలం క్రితం ఆగిపోయాయి. దరిమిలా 'డిటో డిటో' చిత్రిచిత్రాల నిర్మాణవిధానం ఎక్కువమందికి బాగుందనిపించింది. ఈనాడు అన్ని చిత్రాల కథలనూ ఒక్క ముక్కలో చెప్పుకోవచ్చు. చూపించిన పద్ధతికూడా చాలామటుకు 'డిటో'వే.

మంచి కథలున్న సందర్భాలలో కూడా బోలెడు వేల అడుగుల పొడుగు దింపాలన్న ఆలోచనవల్లనో, దింపవచ్చును అన్న ధీమావల్లనో, కథని మొదలుపెట్టి, అందులో ప్రధాన పాత్రలు ఫలానాతరహాని అని చెప్పడానికి పదివేల అడుగులు "మాత్రమే" వాడు కోవడం చిరకాలంగా పరిపాటి అయిపోయింది. ఇలా చేసినవారందరికే అంతకన్న బాగాచేయడం చేతకాదు అని ఎవరూ అనలేరు. చేయటం లేదు. అంతే.

టాకీలకు ఇప్పుడు పాతికేళ్ళు నిండాయి కాబట్టి ఇకనైనా బాల్యావస్థ దాటుదాము అన్న ఆలోచనతో, మూడున్నరమైళ్ళ పొడుగులో అవసరమైతే ఒక్క మైలు పొడుగు తగ్గించి, ఒక్క అడుగు ఎత్తున ఉన్న కొత్త స్థాయిని అందుకొందామన్న ఆలోచనతో పరిశ్రమ ప్రముఖులు కొత్తప్రయత్నాలకు పూనుకోవాలి. ★

ఏ తేదీ ఏ వారం?

1957 **1957**

జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రియల్	మే	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబరు	అక్టోబరు	నవంబరు	డిశంబరు
1	**4**	**4**	**0**	**2**	**5**	**0**	**3**	**6**	**1**	**4**	**6**

పైనున్న గడి చూచారా? "ఏమిటీ గళ్ళు, ఆ గడులలో యీ అంకె లేమిటి?" అని ఆశ్చర్యంగా వుందా?

జనవరి 13 వ తేదీ భోగిపండుగ ఏ వారం అయిందో కేలండరు చూడకుండా యీ గడిలోని అంకెలను జ్ఞాపకం పెట్టుకుంటే సులభంగా చెప్పెయ్యగలరు. ఉదాహరణకి సంక్రాంతి పండుగ ఏ వారమవుతుందో కలిపితే 15 తెలుసుకోవాలంటే ఆ గడిలో ఉన్న అంకె. 1, జనవరి 14 వ తారీకుకు కలపండి. (సంక్రాంతి మరి 14 వ తేదీని కదూ) వస్తుంది. దీన్ని 7 చేత భాగించండి—ఎందు కంటారేమో మరి వారానికి 7 రోజులు కదూ—అందు చేత. భాగిస్తే 1 శేషము వచ్చింది. ఇప్పుడు:—1 మిగిలితే సోమవారము, 2 శేషము వస్తే మంగళవారము, 3 మిగిలితే బుధవారమని, అలాగే 4 మిగిలితే లక్ష్మీవారమని, 5 మిగిలితే శుక్రవారమని, 6 మిగిలినట్లయితే శనివారమనీ, సమముగా తెగిపోయి శేషస్థానమున '0' ఉన్నట్లయితే ఆ వారము ఆదివారమనీ లెక్కించాలి. మన ఉదాహరణలో 1 మిగిలింది కదూ—అంటే సంక్రాంతి సోమవారం అయిందన్నమాట. ఇలాగే ఏ నెలలో ఏ తారీకు ఏ వారమో తెలుసుకోవాలంటే ఆ గడిలోని అంకెను దానికి (నీకు కావలసిన తారీకునకు) కలిపి 7 చే భాగించి శేషమును పై విధముగా లెక్కించాలి. అలా కలిపినపుడు 7 కంటె తక్కువ సంఖ్య వస్తే, దానినే శేషముగా తీసుకుని వారం నిర్ణయించాలి.

ఇది గమ్మత్తుగా ఉంది కదూ? అన్నట్లు ముఖ్యవిషయం చెప్పడం మరచిపోయాను—ఈ గడులలోని అంకెలు 1957 వ సంవత్సరమునకు మాత్రమే పనికివస్తాయి. మరచిపోకండేం.

కూర్పు: వావిలకొలను వెంకటసుబ్బారావు.

పృషతునికి మరుదంశంవల్ల జన్మించిన కుమారుడని కొంతకాలానికి ద్రోణునికి తెలిసింది. అప్పటినించీ ద్రోణు డతనియెడల ఎంతో సౌహార్దంవ్యక్తీకరిస్తూ ధనుర్వేదాభ్యాసంలో అతనికి చేదోడు వాదోడుగా ఉండేవాడు.

కొంతకాలానికి పాంచాలాధిపతి పృషత మహారాజు కాలధర్మంచేశాడు. ద్రుపదునికి పాంచాల రాజ్యాధికారం సంక్రమించింది. పట్టాభిషేక మహోత్సవంకోసం పాంచాల రాజధానికి కాంపిల్య నగరానికి బయలుదేరే వేళ ద్రుపదుడు ద్రోణాచార్యుని దగ్గర సెలవు తీసుకొన్నాడు.

"ద్రోణా! నేను పాంచాల రాజ్య పట్టాభిషేకార్థమై వెళ్ళిపోతున్నాను. నీవు ధనుర్వేదం సాంగోపాంగంగా అభ్యసించిన బ్రహ్మణ్యుడవు! నాతో సమానంగా మహారాజభోగా లనుభవించడాని కన్నివిధాలా అర్హుడవు! ఎప్పుడైనా అవసరం వచ్చినప్పుడు కాంపిల్య నగరానికి విచ్చేయవలసింది." అని అత్యాదరంతో ఆహ్వానించి వెనువెంటనే కాంపిల్య నగరానికి వెళ్ళిపోయాడు.

ద్రోణునికావిషయంఅంతా ఆక్షణంలో జ్ఞాపకంవచ్చింది "అంతటి మహారాజుకదా! అశ్వత్థామ పాలకోసమని చెయ్యిచాచితే నాలుగు గోవులైనా ఇయ్యలేకపోతాడా?"

అనుకున్నాడు వెంటనే కాంపిల్యనగరానికి బయలుదేరి వెళ్ళిపోయాడు. కాని ఆనగరానికి వెళ్లినతరవాత అతని కెంతకాలానికీ రాజదర్శనంకాలేదు! ప్రతీహారులదగ్గర మొరపెట్టుకోగా మొరపెట్టుకోగా ఎలాగోఅలాగ కొంతకాలానికి ద్రోణునికిమహారాజదర్శనం లభించింది ద్రోణుడు నిండుపేరోలగంలో అడుగుపెట్టాడు. కాని ద్రుపదు డతన్ని గుర్తించినట్లయినా కనబడలేదు. దానితో ద్రోణాచార్యుని ప్రాణం చచ్చిపోయింది. అయినా ఓరిమివహించి ద్రుపదునికి తన కుల గోత్రాలు, అగ్నివేశమహర్షిదగ్గర తాము చేసిన ధనుర్విద్యాభ్యాసము మొదలైన విషయాలన్నీ వరసగా ఏకరువుపెట్టాడు. ఆ మాటలు విని ద్రుపదుడు వెటకారంగా విరగబడి నవ్వాడు:

"వెర్రివాడా? నీకేమైనా మతిభ్రమణం గాని కలిగిందా? పేదబ్రాహ్మణునికీ, ధారుణీశ్వరునికీ మధ్యన స్నేహమేమిటయ్యా! పో! పో!"

అని కసిరివేశాడు ద్రోణుడదివిని పాషాణప్రతిమలా నిర్ఘాంతపోయాడు. మళ్ళీ ద్రుపదు డందుకున్నాడు:

"కయ్యము, నెయ్యము సమానులకే! దరిద్రులకు, ధనవంతులకు మధ్యన స్నేహమేమిటి?

"అదీగాక రాజులైనవారికి కేవలం ప్రయోజనంవల్లనే శత్రుత్వ మిత్రత్వా లేర్పడుతూవుంటాయి. నీవంటి పేదబ్రాహ్మణునివల్ల మావంటి పృథివీశ్వరులకు ప్రయోజనం ఏమి ఉంది? నీకు, నాకు స్నేహమేమిటయ్యా! తారతమ్యాలు తెలుసుకోకుండా నీ ఇష్టం వచ్చినట్లిలాగ మాట్లాడడమేనా? పో! పో!"

ఆ పరుషభాషణం వినగానే ద్రోణునికి తన పాదాలకింద భూమి పాతాళలోకంలోనికి దిగిపోయినట్లనిపించింది. అతని హృదయంలోని క్రోధాగ్నిజ్వాల నఖశిఖ పర్యంతం వ్యాపించింది కాని కేవలం నిరుపేదబ్రాహ్మణు డేమిచెయ్యగలడు?

"మా మేనమామ కూతురు కళ్లునక్షత్రాల్లాగావుంటాయ్."

"ఇంకేం, అందకత్తే నన్న మాట."

"ఏమందమో! మినుకు మినుకుమని చూస్తూ ఉంటుంది"

అటుపిమ్మట ద్రోణు డగ్నిహోత్రం చేత ధరించి, భార్యాపుత్రులతోను, శిష్యగణంతోను కలిసి హస్తినాపురానికి ప్రయాణమై వెళ్ళిపోయాడు.

అదృష్టవశాత్తు నగర సమీపంలోనే అతని కొక మహాద్భాగ్యం కలిసి వచ్చింది. ఒక దిగుడు బావిలో పడిపోయిన కందుకం పైకితీసేమార్గం తెలియక కౌరవకుమారులందరు బావినీటిలో తేలుతూన్న కందుకంవైపు చూస్తూ నిలుచున్నారు. ద్రోణుడు ఆ కందుకం పైకొక చిన్నబాణం ప్రయోగించాడు. ఆ బాణంపై ఇంకొక బాణం ప్రయోగించాడు ఆవిధంగా అవలీలగా ఆ కందుకం పైకితీసి కౌరవకుమారుల కందిచ్చాడు.

ఆ కుమారు లాఅద్భుత వృత్తాంతం భీష్మునికి తెలియజేశారు. ద్రోణాచార్యు డాక్షణంనించీ కౌరవ పాండవులకు ధనుర్విద్యాచార్యుడైనాడు.

ఆస్మరణతో ద్రోణునిహృదయంలో ద్రుపదుడు రగిల్చిన పరాభవాగ్నిజ్వాల అలాగే అవిచ్ఛిన్నాగ్నిహోత్రంలా ప్రజ్వలించింది. ద్రుపదుని శరధాటి కోర్వలేక కౌరవులందరు భయపడి పారిపోయిరావడం చూడగానే ఆ అగ్ని ఒక్కమారుగా భగ్గుమని మండింది. అహోరాత్రాలు కళ్లలో యావత్తులు పెట్టుకుని ద్రోణుడు శిష్యులందరికీ ధనుర్వేద రహస్యా లుపదేశించాడు. కాని అతని పరిశ్రమ అంతా ఆనాడు బూడిదలోపోసిన పన్నీరై పోయింది! ఇక ఆచార్యునికి అభిమతమైన గురు దక్షిణ సమర్పించగలవాడర్జును డొక్కడే! ఆచార్యుని కింకా అతనిమీది ఆశ నశించిపోలేదు. అలాగే అర్జునుని పునరాగమనం ఎదురుచూస్తూనిలుచున్నాడు.

౪

ఆచార్యుని కనతిదూరంలో ఒక మహాకలకలం చెలరేగింది. కౌరవ సైనికులందరు గొంతెత్తి అర్జునుణ్ణి జయజయ ధ్వానాలతో అభినందిస్తున్నారు. ద్రోణు డటువైపు చూచాడు

కొంత సేపటి కర్జునుని రథం ద్రోణుని కల్లంతదూరంలో నిలిచింది. అర్జునుడు ద్రోణునికి సాష్టాంగ నమస్కారం చేశాడు రథానికి రెక్కలు విరిచి కట్టిన ద్రుపదుణ్ణి నిర్దేశించిమాపించి, ఆ గురుదక్షిణ స్వీకరించవలిసిందని ప్రార్థించాడు. అసలే ద్రుపదుడా అపజయంతో జీవచ్ఛవమైపోయాడు ఆపైన ద్రోణాచార్యుని చూడగానే అతని ముఖం వివర్ణమై వెలవెలబోయింది. ద్రోణాచార్యునిరోషావేశం చూడగానే కౌరవులందరు ద్రుపదుని కాక్షణంతో ఆయుర్దాయం తీరిపోయిందనే అనుకున్నారు. ఆచార్యు డగన్ని యజ్ఞపశువును సంహరించివేసినట్లు సంహరించి వెయ్యగలడని అనుకున్నారు.

కాని ద్రోణు డటువంటి క్రౌర్యానికి పాల్పడలేదు. అర్జునుడు సమర్పించిన గురు దక్షిణ కెంతో సంతోషించాడు పిమ్మట ద్రుపదుని దగ్గరికి వెళ్ళి నవ్వుతూ చల్లచల్లగా అంటించాడు:

"వీ రెవరు? పాంచాల రాజ్యాధీశ్వరులు ద్రుపదమహారాజులా? పాపం! వీరి కీవిధంగా పట్టుబడిపోవలిసినంత దుర్గతి పట్టిందే? ఈ క్షణంలోనైనా వీరికి మహారాజ్య మదాంధకారం తొలగిపోయిందా?"

అని ద్రోణు డతని కింకా దగ్గిరికి వెళ్లిపోయాడు:

"మహారాజా! ఇప్పటికైనా నే నెవరినో మీకు గుర్తుకు వచ్చిందా? కొంచెం కన్నులు తెరిచి చూడండి!"

అని గట్టిగాఎత్తిపొడిచి పిమ్మటద్రుపదుని బంధనాలన్నీ విప్పించివేశాడు. ఆచార్యు డావిధంగా వ్యంగ్యధోరణిలో ప్రసంగిస్తూంటే కౌరవపాండవ కుమారుల కెంతైనా ఆశ్చర్యం వేసింది. ఎండుగడ్డి మంటకు, బ్రాహ్మణ క్రోధానికీ భేదమేమీ లేదనీ ద్రుపదుణ్ణి అంత తేలికగా విడిచిపెట్టడం ఒక్క ఆచార్యునికే తగినదనీ అనుకొన్నారు.

కాని క్షత్రియుని క్రోధంమాత్రం కట్టి గడ్డిమంటకాదు. ద్రుపదుడు తనకు బంధ విముక్తి లభించిన ఉత్తరక్షణంనించీ ఆచార్యుడు చేయించిన అవమానానికి తగిన ప్రతీకారం చెయ్యాలని శపథం చేశాడు. ★


సంక్రాంతి
విడుదల
అన్నపూర్ణా వారి...
తోడికోడళ్ళు
దర్శకత్వం... ఆదుర్తి సుబ్బారావు
ఆంధ్రప్రదేశ్... నవయుగ ఫిలిమ్స్.

చిత్రసమీక్ష :

"వార్ అండ్ పీస్"

ఒక గొప్పకథను తీసుకొని చిత్రం నిర్మించడానికి డబ్బు చాలా ఉపయోగపడుతుంది.

గొప్పకథతో, 'గొప్ప' అని చెప్పుకోతగ్గ చిత్రం నిర్మించడానికి డబ్బుఒక్కటే చాలదు. గొప్పప్రతిభ, తగ్గ ప్రయత్నం కావాలి.

డబ్బు సమకూర్చగల హంగులన్నీ పూర్తిగానూ, చలనచిత్రానికిగల శక్తులూ అవధులూ సాధ్యమైనంతవరకూనూ వినియోగించుకొని, నిర్మాతలు చేసిన ప్రయత్న ఫలితం "వార్ అండ్ పీస్" చలనచిత్రం. (టెక్నికలర్, విస్టావిజన్. డిసెంబరు 28 న మద్రాసు ఓడియన్ థియేటరులో విడుదల అయింది. కార్లో పాంటీ, డినా డి లారెంటిస్ అనే ఇటాలియన్లిద్దరూ, పారమౌంట్ పిక్చర్స్ వారూ దీనిని నిర్మించారు. దర్శకుడు కింగ్ విడార్.)

నెపోలియన్ దండయాత్రల నాటి రష్యాలోని సాంఘిక జీవితాన్ని సమగ్రంగా చిత్రించిన టాల్‌స్టాయ్ నవలను చదివిన వారికి "వార్ ఎండ్ పీస్" చిత్రంలో కొట్టొచ్చినట్టుగా కనబడే వెలితి ఒకటుంది. నవలలోని అసంఖ్యాక సజీవపాత్రల్లో నాలుగైదు మాత్రమే సమగ్రంగా ఈచిత్రంలో కనిపిస్తాయి.

50 ఏళ్ళనాడు టాల్‌స్టాయ్ తొలిసారిగా ఒక చలనచిత్రాన్ని చూచి, ఈ సాధనంశక్తిని మెచ్చుకున్నాడు. ఈనాడు, మహత్తరశక్తిగలసాధనాలలో చలనచిత్రాలు ముఖ్యమైనవని సర్వత్రా అంగీకరించారు.

అయితే "వార్ అండ్ పీస్" వలె వందలకొద్దీ పాత్రలు, వేలకొద్దీ సంఘటనలూ ఉన్న పెద్దకథలను తీసుకున్నపుడు, అవన్నీ ఒక చిత్రంలో ఇముడుతాయా అన్నది ప్రశ్న. ప్రయత్నిస్తే ఎంతవరకూ ఒప్పించవచ్చును?

ఉన్న అవధుల దృష్ట్యా, ఒక చలనచిత్రంలో "ఎంత ఎక్కువ" కథ చూపించారు అన్నదానికన్న, చెప్పినకొస్తా "ఎంత గొప్పగా" చెప్పగలిగారూ అన్నదే ప్రధానం అని చెప్పుకోవాలి. అలాకాకపోతే సెల్యులాయిడ్ పొడుగూ, వెండితెర వెడల్పూ, రంగుల హంగులూమాత్రమే చలనచిత్రాల "మహత్తరశక్తి"కి కొలబద్దలు అవుతాయి. (హాలీవుడ్‌నుంచి వచ్చిన అనేక పౌరాణికాలకు ఇదే కొలమానం అయింది.)

ఇక, ఈ చిత్రానికి సంబంధించిన మిగతా అంశాలు అన్నీ అత్యుత్తమంగా ఉన్నాయి. ఆస్టర్లిట్జ్, బొరోడినో, బెరిజీనా యుద్ధాలూ, మంచులో నెపోలియన్ సేనావాహిని తిరోగమనయాత్ర, మొదలైనవన్నీ చలనచిత్రాలు అందుకోగల ఉత్తమస్థాయికి నిదర్శనాలు.



నతాషాగా ఆడ్రీహెబర్న్

ఈయుద్ధాలూ, వాటి పర్యవసానాలూ, జీవిత పరమార్థం ఏమిటని మథనపడే కౌంట్‌పియర్ బెజుహోవ్ దృష్టికి గోచరించినరీతిన చూపించారు. స్వయంగా చూచి అనుభవించి తెలుసుకోనిదే తృప్తిపడనివాడు పియర్. అతనికి తెలియని సమాధానాలు ఎన్నోవున్నాయి. అవి ఎవరికీ తెలియవు. అయితే అతడు వాటిగురించి పట్టించుకుంటాడు.

తప్పేదో ఒప్పేదో తెలిసికూడా తప్పుదారినే తానెందుకు నడుస్తున్నట్టు? నడిచేదెక్కడికి? నడిపించేదెవడు? మనుషులు యుద్ధం ఎందుకుచేస్తారు? ఇదీ అతని తపన.

"అంద్రీ! నీకు నవ్వువస్తుంది నాప్రశ్నలు వింటే, నామటుకు బాధగావుంది. నువ్వు ఒకపుస్తకంచదివితే ఆ విషయాలు తెలుసుకుంటావు. నేను చదివితే మరింత అయోమయస్థితిలో పడిపోతాను." అంటాడు పియర్.

"పియర్! నామటుకు నేను యుద్ధానికెందుకు వచ్చానో! తెలుసా? ప్రేమించినదాని వల్ల మాయిల్లు అశాంతికి నిలయం అయిపోయింది. నేను నెపోలియన్ మీద కత్తు కట్టాను...యుద్ధంలో జయాపజయాలనేవి సైన్యంపై కాక మీద ఆధారపడి ఉంటాయి" అంటాడు ప్రిన్స్ ఆంద్రీ బోల్కాన్స్కీ...

"చక్రవర్తి, ప్రజలు, యుద్ధం చెయ్యాలంటారు. సైనికులు పదమంటారు. కాలంపక్వం కాకపోతే ఈ ప్రయత్నాలు ఫలించవు. నెపోలియన్ తన దురాశకు తనే బలి ఐపోతాడు. మిడతల దండులా వచ్చిపడ్డ ఆసైన్యం అలాగే ధ్వంసం అవుతుంది. దానికి రోజు రావాలి. అందాకా ఓర్పుకావాలి" అంటాడు రష్యా సర్వసేనాని, జనరల్ కుతుజోవ్....

"సోన్యా! నీకు తెలీదు. అసలర్థంకాదు. ప్రేమంటే ఏమిటో. ఈసారిది నిజమైన ప్రేమ. ఇతన్ని చూసే వరకూ నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు. చూడగానే, ఇతనికోసమే ఇన్నాళ్ళూ బ్రతికున్నాననిపిస్తుంది." అంటుంది. 14 ఏళ్ళ బాలాకుమారి నతాషా. ప్రతీసారీ కొత్తగా హృదయం ఇచ్చి పుచ్చుకున్న కొత్త ప్రియుణ్ణి వెనకేసుకొస్తూ. ఈ చిత్రంలో ఇది అత్యంత మనోహరమైనపాత్ర.

అసలు కథలో టాల్‌స్టాయ్ సమగ్రంగా చిత్రించిన 23 ముఖ్య పాత్రలలోను, ఈ చిత్రంలో ప్రాధాన్యం వహించినవి ఈ నాలుగే. ఇవికాక, కప్టెన డొలొఖోవ్, మరో దళాధిపతి అనటోల్ (యుద్ధాలు లేనపుడు సైనికుల్ని పంజరాల్లో బంధించాలి అంటాడు పియర్ వీళ్ళప్రవర్తనను గర్హిస్తూ) ప్రిన్స్ ఆంద్రీ తండ్రికౌంట్‌బోల్కాన్స్కీ, భర్తకు ద్రోహంచేసిన హెలెన్ (పియర్ భార్య), తన జాతి జెండాతో చలిమంట కాచుకున్న నెపోలియన్, ఈశ్వరేచ్ఛమీద ప్రగాఢ విశ్వాసంతో, 'సజీవంగా ఆనందంగా జీవించిన' రైతు ప్లాటన్ మొదలైన వెన్నో ఉన్నాయి.

పియర్‌గా హెన్రీఫాండా, రైతు ప్లాటన్‌గా జాన్‌మిల్స్, ప్రిన్స్ ఆంద్రీగా మెల్‌ఫెరర్, జనరల్ కుతుజోవ్‌గా ఆస్కార్ హొమోల్కా, నెపోలియన్‌గా హెర్బర్‌లాం, అనటోల్‌గా విక్టోరియా గాన్‌మన్, డొలొఖోవ్‌గా హెల్మట్ డాంటైన్ నటించారు.

నతాషా భూమికను ఆడ్రీ హెబర్న్ నిర్వహించింది.

ఈ చిత్రాన్ని డిసెంబరు 26 న పత్రికల వారికి చూపించారు. ★

అవహేళన

ప్రాచీన గాథాలహరి

"ఇదిగో! ఆ వృక్షాగ్రంమీది పక్షి శిరస్సు నీకు స్పష్టంగా ప్రత్యక్షమయిందా?"

"అయింది."

"పరిసరంలో ఉన్న మేమంతా నీకు స్పష్టంగా కనిపిస్తున్నామా?"

"ఆఁ స్పష్టంగా కనిపిస్తున్నారు!"

"ఇంకా ఆ చెట్టుమీది శాఖోపశాఖలన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయా?"

ధర్మరాజు 'ఔ'నన్నట్టు తల ఊగించాడు. ద్రోణాచార్యుడు పక్కుమని నవ్వాడు:

"ధర్మరాజా! ఇక ఈ లక్ష్యభేదనం నీవల్ల అయ్యేపని గాదు! నీవిక తొలగిపో!" అని ఆజ్ఞాపించాడు

ధర్మరాజు వెంటనే తనవింట సంధించిన బాణం ఉపసంహరించి వేసి తిరిగీ అది తన అమ్ములపొదిలో పెట్టుకొన్నాడు. తల వంచుకొని పక్కకు తొలగిపోయి నిలుచున్నాడు. అవిధంగా. ఆచార్యుడు హఠాత్తుగా తొలగిపొమ్మనడానికి కారణమేమీ అతనికి బోధపడలేదు. ధర్మరాజలాగే నిర్ఘాంతపోయి నిలుచున్నాడు.

ఆనాటి ప్రాతఃకాలవేళ కౌరవపాండవ కుమారుల అస్త్రవిద్యా కౌశల పరీక్ష జరుగుతూంది. ద్రోణాచార్యుడు తన శిష్యగణం లక్ష్యశుద్ధి కౌశలం పరీక్షించే అభిలాషతో వారినందరినీ అక్కడ సమావేశపరిచాడు. కౌరవ పాండవ కుమారులందరు బారులు దీర్చి నిలుచున్నారు. విల్లమ్ములు చేతధరించి ఆచార్యుని అనుమతి కోసం నిరీక్షిస్తున్నారు. భీష్మాచార్యాది కురువృద్ధులంతా అనతిదూరంలోనే తమ తమ సుఖాసనాలపై సమాసీనులై ఏకాగ్ర దృష్టితో ఆ కౌశల పరీక్షా వ్యవహారమంతా చూచి ఆనందిస్తున్నారు

ద్రోణాచార్యుడు రాజశిల్పులచేత ఒక కృత్రిమ పక్షిశిల్పం తయారుచేయించాడు. అది వారి కనతిదూరంలో ఉన్న వటవృక్షం చిట్టచివరి కొమ్మమీద ప్రతిష్ఠించారు. ఆచార్యుడు తనశిష్యుల కాపక్షిశిరస్సు నిర్దేశించి చూపించి ఏవేవో ప్రశ్నలడుగుతున్నాడు. వారి సమాధానాలు విని, 'ఇక ఇది నీవల్లగాదు, నీవు తొలగిపో!' అని ఆజ్ఞాపిస్తున్నాడు. అంతేగాని వింట సంధించిన బాణంతో ఆ పక్షిశిరస్సు ఖండించి వెయ్యవలసినదని ఆజ్ఞాపించడంలేదు. అలాగ ధర్మరాజు, భీముడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైనవారెందరో ద్రోణాచార్యుని ప్రశ్నలకు సరియైన ప్రత్యుత్తరాలివ్వలేక తలలు వంచుకొని పక్కపక్కలకు తొలగిపోయి నిలుచున్నారు అంతలో అర్జునినవంతు వచ్చింది. ఆచార్యుడతన్ని కూడా పరీక్షించాడు:

"నీ కాపక్షిశిరస్సు స్పష్టంగా కనిపించిందా?"

అర్జునుడు తన ఏకాగ్రదృష్టి మరల్చకుండా 'ఔ'నని సమాధానం చెప్పాడు. ఆచార్యుడు మళ్ళీ ప్రశ్నించాడు:

"ఇంకా మిగిలిన మేమంతా కనిపిస్తున్నామా?"

"లేదు."

"ఇంకా ఆ చెట్టు మీది శాఖోపశాఖలు?"

"ఏమీ కనిపించడం లేదు! ఆ పక్షి శిరస్సొక్కటే కనిపిస్తూంది."

"అయితే వెంటనే బాణం ప్రయోగించు!" అన్నా డాచార్యుడు.

అర్జునుడు వెంటనే బాణం ప్రయోగించాడు. ఉత్తరక్షణంలో ఆ కృత్రిమపక్షి శిరస్సు తెగి నేలమీద పడిపోయింది. వెనువెంటనే ఆ మహాసదస్సులో అంతటా సాధువాదాలు చెలరేగి మిన్నుముట్టాయి

ద్రోణాచార్యు డపార వాత్సల్యంతో అర్జునుణ్ణి గాఢంగా కౌగలించుకొన్నాడు. అతని శిరస్సు మూర్కొన్నాడు. ఆచార్యుని ఆనందబాష్పాలతో అర్జునుని శిరస్సు ఆర్ద్రమైపోయింది.

పి. గణపతిశాస్త్రి

కొంతకాలానికి పూర్వం ద్రోణాచార్యుడు హస్తినాపురానికి రాగానే భీష్ముడతని విచిత్ర చరిత్ర అంతా సముగ్రంగా విని ఎంతో సంతోషించి కౌరవ పాండవ కుమారులందరికీ ధనుర్వేదం సాంగోపాంగంగా బోధించవలసిందని ప్రార్థించాడు.

ద్రోణాచార్యుడు ధనుర్వేదం ఉపదేశించే ప్రారంభంలోనే వారందరినీ ప్రశ్నించాడు:

"ధనుర్వేదం అభ్యసించిన అనంతరం నా అభీష్టం నెరవేర్చగలవారు మీలో ఎవరైనా ఉన్నారా?"

ఆ ప్రశ్నవిని కౌరవ పాండవకుమారులందరు నిరుత్తరులై నిలబడ్డారు. అర్జునుడొక్కడే ధైర్యంగా ముందుకు వచ్చి నిలుచున్నాడు:

"మీ అభీష్టమేదైనా సరే! నేనవశ్యంఅది నెరవేర్చగలను!"

అతడు తనచిరకాల మనోరథం నెరవేర్చగలడని ఆచార్యుడానాడే అనుకొన్నాడు

ఈనాడవలీలగా పక్షిశిరస్సు ఖండించి వెయ్యడంతో ఆచార్యునికి మరింత ధైర్యం కలిగింది కౌరవ పాండవులందరిలోను అర్జునుడొక్కడే ధనుర్వేదం అంతా సాంగోపాంగంగా క్షుణ్ణంగా అభ్యసించినవాడు. అతని శ్రద్ధాభక్తుల కానందించి ఆచార్యుడతని కెన్నెన్నో మహాస్త్ర ప్రయోగోపసంహారా లుపదేశించాడు.

౨

అస్త్రవిద్యా పరీక్ష ముగిసిన క్షణంనించీ అర్జునుడాచార్యుని కత్యంతాప్తుడైన అంతేవాసి అయినాడు. ఆనాటినించీ ఆచార్యుని దగ్గర ఎన్నెన్నో ధనుర్వేదరహస్యాలవగాహన చేసుకొన్నాడు.

క్రమంగా కౌరవ పాండవకుమారుల ధనుర్విద్యాభ్యాసం సమాప్తమైపోయింది. వారందరు ఆచార్యునికి గురుదక్షిణ సమర్పించే సమయం ఆసన్నమయింది. వారిలో కొందరాచార్యునికి వెలకొలది ఆలమందలు గురుదక్షిణగా సమర్పించవలెనని అనుకొన్నారు.

కాని ఆచార్యుడలాంటి గురుదక్షిణ లేవీ

★ అవహేళన ★

స్వీకరించలేదు. కౌరవ పాండవ కుమారు లందరికేసి పరిశీలనగా చూసి తనమనోరథం వారి కెరిగించాడు:

"పాంచాలధీశ్వరుడు ద్రుపదరాజు ఐశ్వర్య దురహంకారంతో కన్నూ మిన్నూ కానకుండా సంచరిస్తున్నాడు. మీలో ఎవరైనాసరె! అతన్ని పెడరెక్కలు విరిచి కట్టి నాయెదట నిలబెట్టగలరా? ఇదే నేను మీవల్ల కోరుకునే గురుదక్షిణ."

ఆచార్యుని అభీష్టం విని కౌరవ పాండవ కుమారులు క్షణకాలం నిర్ఘాంత పోయారు. వెంటనే ద్రుపదుణ్ని బంధించి తీసుకు రావాలనే దృఢ నిశ్చయంతో సైన్యాలతో సహా పాంచాల రాజ్యానికి బయలుదేరి వెళ్ళిపోయారు. అయితే వారెవరికీ ఆచార్యు డావిధంగా ప్రార్థించడానికి హేతువేమో తెలియలేదు.

కౌరవులంతా ముమ్ముందుగా పాంచాల రాజధానీ నగరం కాంపిల్యపురంమీదికి దండెత్తి వెళ్ళిపోయారు. వారి వెంట వెంటనే పాండవులు, ద్రోణాచార్యుడు బయలుదేరి వెళ్లారు.

ద్రుపదుణ్ణి జయించడం మాటలతో పనిగాదని అర్జును డెరుగును. అయినా కౌరవ కుమారుల శౌర్యం పరిశీలించ తలెననే కౌతూహలంతో అతడలాగే ఆచార్యుని సన్నిధినే నిలిచి పోయాడు.

కౌరవ కుమారులు చతురంగ సేనలతో తనపై దండెత్తివచ్చారని వినగానే ద్రుపదుడు తోకతొక్కిన తాచులా మండి పడ్డాడు. తన అపార సేనావాహినితో కౌరవ కుమారుల నెదుర్కొన్నాడు. వారి మీద శరపరంపరలు ప్రయోగించాడు. కౌరవ కుమారు లాశరధాటి కోర్వలేక పలాయన మంత్రం పఠించారు. ఆ కుమారు లావిధంగా పరాజితులై వెనుదిరిగి రాగానే ద్రోణాచార్యుని ముఖంలో విషాదరేఖ లలముకొన్నాయి.

అర్జును డది చూచి వెంటనే ద్రుపదునితో యుద్ధం చెయ్యడానికి బయలుదేరాడు. అచిరకాలంలోనే ద్రుపదుణ్ణి బంధించి తీసుకురాగలనని ప్రతిజ్ఞ చేశాడు.

అర్జునుడు అనతిదూరంలో కనిపించే పాంచాలరాజధానికి బయలుదేరగానే ద్రోణుని హృదయంలో కొంచెం ఊరట కలిగింది.

కాని అర్జునుడైనా ద్రుపదుణ్ణి బంధించి తీసుకురాలేడేమో అన్న సంశయంమాత్రం అతిన్ని వేధించడంమానలేదు ఆడోలాందోళనతో ఆచార్యుని హృదయం అట్టుడికిపోయి నట్టుడికి పోయింది. ద్రుపదుని నామధేయం స్మరించగానే ఆచార్యుని హృదయం అవమానభారంతో కుంగిపోయింది.

ఆ రాజాధముని నిండు పేరోలగంలో తనకుజరిగినమహావమానం అంతా ఆక్షణంలో మళ్లీ అతనికి కన్నులకు కట్టినట్టుగా ప్రత్యక్షమైంది.

ఐశ్వర్యం ఎంతటి సత్పురుషులనైనా కేవలం అంధులుగాను, బధిరులుగాను, అథములుగాను మార్చి వెయ్యగలదని అనుకొని ఆచార్యు డుగ్రుడైపోయాడు. ఆ క్షణంలో అతనికి బాల్యంలో అగ్నివేశుని దగ్గర చేసిన ధనుర్విద్యాభ్యాసము, ద్రుపదుని సహాధ్యాయిత్వము, అనంతరం అతని దురహంకారము మొదలైన విషయాలన్నీ ఒక్క మారుగా స్ఫురణకు వచ్చాయి.

3

అగ్నివేశునిదగ్గర ధనుర్వేదం అభ్యసించిన పిమ్మట ఆయన అభ్యనుజ్ఞ స్వీకరించి ద్రోణాచార్యుడు కృపాచార్యుని చెల్లెలు కృపిని వివాహం చేసుకొన్నాడు. తరవాత కొంతకాలానికి వారిద్దరికీ అశ్వత్థామ జన్మించాడు.

ద్రోణాచార్యు డాసమయంలో పాంచాల రాజ్యంలో ఒక అగ్రహారంలో నివసిస్తూ ఏపూటకాపూట గడవక కష్టపడుతున్నాడు. ఆ సమయంలోనే అశ్వత్థామ జన్మించడం జరిగింది.

క్రమంగా కొంతకాలానికి అశ్వత్థామకు రెండేళ్లు నిండాయి. ద్రోణాచార్యుని కిరుగు పొరుగున ఉన్న వారందరు ఏలోటు లేకుండా పాడి పంటలతో హాయిగా కాల క్షేపం చేస్తున్నారు. వారి శిశువులందరు ముప్పొద్దుల గోక్షీరం సేవిస్తూ ఆడు కుంటూంటే అశ్వత్థామ అదిచూచి తనకు కూడా ఆవుపాలు కావాలని మారాం చెయ్యడం మొదలు పెట్టాడు.

ద్రోణుని గృహిణి రెండు మూడు మారులు భర్తతో ఆ విషయం విన్న వించింది. కాని ద్రోణు డేమిచెయ్యగలడు? అతని కాపూట గడవడమే కష్టంగా ఉంది. ఇక ఏమిచెయ్యడానికీ పాలుపోక దారిద్ర్యం వంటి మహాపాపం లేదనుకొని లోలోపలే కించపడుతూ మాట్లాడ కూరుకొన్నాడు.

ఒకనాడు కృపి అతనికి ద్రుపద మహారాజు విషయం జ్ఞాపకంచేసింది. ఆమాటతో అతనికి పెన్నిధి సన్నిధినే ప్రత్యక్షమయి నట్లయింది.

ద్రోణుడు, ద్రుపదుడు సహాధ్యాయులై అగ్నివేశ మహర్షివద్ద ధనుర్వేదం యావత్తు సమగ్రంగా అభ్యసించారు. వారిద్దరు ఆ రోజుల్లో సాక్షాత్తూ అన్నదమ్ముల్లాగే మసులుకుంటూ అగ్నివేశమహర్షి అపార వాత్సల్యం చూరగొన్నారు.

ద్రుపదు డాగర్భశ్రీమంతుడు కాడు. అతడు చిన్నప్పటినించీ భరద్వాజ మహర్షి ఆశ్రమంలోనే పెరిగి పెద్దవాడైనాడు. ద్రుపదుడు పాంచాల మహారాజు పృషతుని కుమారుడని వినబడీ వినబడనట్లుగా ఆశ్రమం లోని బ్రహ్మచారులంతా గుసగుసలాడు కొనేవారు. ద్రుపదునికి తల్లిలేదనీ అతడు

గొంతు లేస్తూ లేచింది. మహారాజు దేహంమాత్రం చలనరహితంగా క్రిందపడివుంది.

ఇంతలో మంగలి వచ్చి చేరాడు అక్కడికి. విక్రమార్కుడు నేల మీద పడివుండుట చూచి ఆశ్చర్య పోయాడు మంగలి.

"మహారాజు తన దేహాన్ని విడచి లేడి శరీరంలో చొచ్చి ఉండ వచ్చును" అని ఊహించాడు మంగలి అక్కడున్న నిదర్శనాలతో.

జరిగినది కూడ అంతేగా!

వాయువేగంతో సమానంగా ఒక చెడు ఆలోచన మంగలి బుర్ర లోనికి కొట్టుకొచ్చింది.

వెంటనే మంగలి తన దేహం నుండి తొలగిపోయి విక్రమార్కుని శరీరంలో ప్రవేశించాడు. ఇప్పుడు మహారాజు శరీరం లేచినిలబడింది. మంగలి మృతకళేబరము మాత్రం నేలమీద పడివుంది.

లేడిరూపంలో నున్న విక్రమార్కుడు అదిచూచి చాల విచారించాడు.

సంధ్యాసమయానికి విక్రమార్కుని రూపం ధరించిన మంగలి రాజుమాదిరిగా అడవినుండి అంతఃపురానికి తిరిగివచ్చాడు. సేవకజనమంతా అతనిని విక్రమార్కుడనే భ్రమపడ్డారు.

కాని భోజనంచేస్తూ వున్నప్పుడు విక్రమార్కుని ఆకారంలో నున్న మంగలి కంఠధ్వనిని గుర్తించింది రాణి.

"ఇది మంగలి గొంతుకవలె నున్నది. ప్రభువుదిమాత్రం కాదు" అని తెలుసుకొంది మహారాణి.

దానితో, "మహారాజునకు అన్యాయం జరిగి ఉండవచ్చును" అనే నిర్ధారణ ఏర్పడింది రాణికి

అంచేత విక్రమార్కుని రూపం ధరించిన మంగలిపై అనుమానం రాణిలో అంకురించింది.

అంతేగాక తనమోసం ఎక్కడ రచ్చకెక్కుతుందో అని భయపడుతూనే వున్నాడు మంగలి. అదికూడ గమనించింది రాణి.

ఈ సందేహంతో భోజనం చేస్తూ రాణి, "గతరాత్రి మనం భుజించిన వస్తువు పేరేమి మహారాజా?" అని అడిగింది ఏదో మరచినట్టు.

దీనితో మంగలి గుండె గుభేలుమంది. రాణికి అనుమానం కలిగిందని కనిపెట్టి ఏమీ సమాధానం చెప్పలేక గుటకలు వేస్తున్నాడు.

ఇదిచూచిన రాణికి అనుమానం



పా రా డే పా పా యి

ఫొటో : ఎస్. రామకృష్ణ

★ కపట బుద్ధి ★

మరీ అధికమవుతూ ఉంది.

"రాత్రి శేషించినకథను భోజన మయిన పిదప పూర్తిచేస్తారుగా ప్రభూ?" అని తిరిగి అడిగింది రాణి ఆప్యాయం తెచ్చుకొని.

అంతటితో విక్రమార్కుని రూపం ధరించిన మంగలి తెల్ల మొహం వేశాడు. భోజనం గబగబా ముగించి గిరున లేచి వెళ్ళి పోయాడు వేరొకగదికి మంగలి. ఒంటరిగా తనుచేసిన దానినిగురించి ఆలోచిస్తూ అక్కడే నిద్రించాడు.

ఇట్టి మంగలి ప్రవర్తన రాణి అనుమానాన్ని బాగా బలపరిచింది.

మహారాణిమాత్రం యీ విషయాన్నిగూర్చి ఆలోచనలు జరుపుతూనే ఉంది.

ఇక లేడి ఆకారంలో తిరుగాడుచున్న విక్రమార్కునికి ఒక చిలుక మృత కళేబరము కనిపించింది. ఆ రాత్రి అడవిలో. వెంటనే విక్రమార్కుడు లేడిరూపం వదలి చిలుక శరీరంలో చొచ్చి దానిరూపం ధరించాడు.

అతి తొందరగా చిలుక ఆకారంలో రాజు మహారాణి అంతఃపురంలో వ్రాలి "దేవీ" అని పిలిచాడు.

ఆలోచిస్తూవున్న రాణి వెంటనే విక్రమార్కుని కంఠాన్ని గుర్తించి వెనకకు తిరిగింది. మహారాజు లేడు. కాని చిలుకనుమాత్రం చూడగలిగింది రాణి.

అప్పుడు విక్రమార్కుడు చిలుక రూపంలో జరిగిన మోసాన్ని గురించి రాణితో చెప్పాడు. దానికి రాణి చాల చింతించింది.

పిదప దంపతు లిద్దరూ తమ కర్తవ్యాంశాన్ని ఆలోచిస్తూవున్నారు. చివరికి మెఱపులా తట్టిందొక వెఱవు వారికి.

ఆమఱునాటి ఉదయమున రాణి భటులచే ఒక చచ్చినగొఱ్ఱెను విక్రమార్కుని రూపంలో నున్న మంగలిగదికి రప్పింపచేసింది.

క్రొత్తరూపంగల మంగలిని ఉద్దేశించి, "ప్రాణేశ్వరా, ముని వలన పొందిన మీశక్తిని యీ గొఱ్ఱె మృతకళేబరముతో పరీక్షింపుడు. కనులార చూచెద," అని రాణిఅంది లేనిప్రేమ ఒలకపోస్తూ.

దానితో మంగలి వదనం కొంచం వికసించింది.

"రాత్రి ప్రశ్నలకు జవాబు చెప్పలేక పోయినా, యీ పనిని మాత్రంచేసి రాణి అనుమాన పిశాచాన్ని తరిమివేయాలి," అని నిశ్చయించుకొన్నాడు.

అంతే! రాబోయే ప్రమాదాన్ని గుర్తించలేదు. ముందువెనుకలు ఆలోచించలేదు మంగలి.

మంగలి తన రాజశరీరాన్ని విడచి గొఱ్ఱెదేహంలో దూరాడు.

ఇంకేముంది! అక్కడే సంచరించుచున్న చిలుక రూపంలోని విక్రమార్కుడు తన తొల్లి శరీరంలోనికి ప్రవేశించాడు.

చిలుకరూపాన్ని వదలి తన శరీరంలో ప్రవేశించిన విక్రమార్కుని చూచి మహారాణి సంతోషం పట్టలేక పోయింది.

తక్షణం విక్రమార్కుడు గొఱ్ఱె రూపంలోనున్న మంగలిని భటులచే బంధింపచేసి చంపించాడు.

రాజద్రోహం తలపెట్టిన మంగలి తానే మోసపోయాడు.

★

రెండు ఈగలు చెత్తకుప్ప మీద వాలి విందారగిస్తూ, ఎదురుగా కనిపిస్తున్న పెద్ద మేడను గూర్చి మాట్లాడుకుంటున్నాయి.

"ఆమేడ చూశావా;లోపల చాలా బావుంటుందట. బల్లలు, కుర్చీలు అన్నీ శుభ్రముగా తుడిచి ఉంటాయిట వంటగిన్నెలు, కంచాలు తళతళలాడుతూ ఉంటాయిట..." అని ఒకఈగ వర్ణించుతోంది.

"అబ్బ. నేను భోంచేస్తున్నప్పుడు అవన్నీ చెప్పకు,డోకొస్తుంది"అని విసుక్కుంది రెండో ఈగ.

సినిమా

గత సంవత్సరం తెలుగు చిత్రాలు

సింహావలోకనం

1956 చలనచిత్రాలకు పండుగ సంవత్సరం. అయినా పండుగ పిండి వంటలని చెప్పుకోతగ్గ నిరుపమాన కళాఖండాలేవీ ఈ ఏడాది రాలేదు. కాని, టాకీల రజతోత్సవ సంవత్సరం అయినందుకు, అలనాటి మేటి పౌరాణికాలు చాలా పునర్దర్శనం ఇచ్చాయి. వీటివల్ల, సాంఘిక చిత్రాల సంఖ్య గత సంవత్సరం 19 నుండి ఈసారి ఉత్తి తొమ్మిదికి తగ్గిపోయింది. ఈ ఏడాది జానపదాలు కూడా ఐదు (క్రిందటేడు నాలుగు) తయారయ్యాయి.

ఈ 1956 లో తెలుగు చిత్రాలుగా విడుదల అయినవి మొత్తం 32. (నిరుటికన్న 8 ఎక్కువ) వీటిలో తమిళంనుండి డబ్ చేసినవి 10 ఉన్నాయి. మరొకటి తెలుగు కామెంటరీతో, తమిళ సంభాషణలతో విడుదలచేసినది. ఇలా 'డబ్బుచేసిన' చిత్రాలలో బాగా డబ్బుచేసినవి పదింట మూడో నాలుగో తేలాయి.


కాగా, తెలుగులో తయారైన చిత్రాలు 21 అన్నమాట. వీటిలో శతదినోత్సవాలు చేసుకొన్న చిత్రాలు ఐదారు ఉన్నాయి. ఇటీవలే విడుదలైనవి కొన్ని కూడా ఈ పండుగ చేసుకోగల అవకాశాలు బాగా ఉన్నాయి.

1956లో బాక్సాఫీస్ విజయం సాధించినవి ఆరు చిత్రాలవరకు ఉన్నాయి. అర్థి

1956 లో తారాబలం

1956 లో వివిధ నటీనటులు పాల్గొన్న చిత్రాల సంఖ్య.

రేలంగి వెంకటరామయ్య 12, ఎన్. టి. రామారావు 9, నాగేశ్వరరావు 5, గుమ్మడి వెంకటేశ్వరరావు 8, సి. ఎస్. ఆర్. ఆంజనేయులు 8, వి. నాగయ్య 8, ఎస్. వి. రంగారావు 5, జగ్గయ్య 4, ఎస్. జానకి 6, అంజలి 5, జమున 7, పి. భానుమతి 5, ఎస్. వరలక్ష్మి 3, జి. వరలక్ష్మి 3, లక్ష్మీరాజ్యం 2, రాజసులోచన 2.



అన్నపూర్ణావారి "తోడికోడళ్లు" చిత్రంలో నాగేశ్వరరావు, సావిత్రి.

★ సింహావలోకనం ★

కంగా విజయవంతం కాకపోయినా, ఉత్తమచిత్రంగా సర్వత్రా గౌరవాభిమానాలకు పాత్రమైన చిత్రం "బంగారుపాప" 1955 లో ఉత్తమచిత్రంగా భారతప్రభుత్వ రజతపతకాన్ని అందుకొన్నది. రాగిణీ వారి "అర్ధాంగి" చిత్రాన్ని ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు దక్షిణ భారతంలో, ఒక్క తెలుగు చిత్రానికితప్ప మరే భాషాచిత్రానికీ రజతపతకం లభించలేదు

చెల్లుమన్న చెంపకాయ

1956 చూపించిన సాంఘిక చిత్రాలలో చాలభాగం బెంగాలీ కథలు ఆధారంగా రూపొందించిన తెలుగు కథలు ఆధారంగా నిర్మించిన చిత్రాలు. ఒకదానికి ఇటాలియన్ చిత్రం మాతృక. ఐతే, ఈ చిత్రాలలో తెలుగు వాతావరణం బాగా ఒప్పేటట్లు చేయడానికి అందరూ మంచి ప్రయత్నమూ చేశారు, చెప్పుకోతగ్గ గొప్ప ఫలితాలూ సాధించారు. ఈ ప్రయత్నాలలో విశేశ వాళీ సంగీతపు మటపట్ల మోజుతగ్గుదల, సంప్రదాయానుగుణమైన సంగీత నృత్యాలను స్వీకరించాలన అభిలాష క్రమంగా పెరగడం గోచరిస్తుంది.

ఈఏటి సాంఘికాలలో చక్కని ట్విస్ట్‌గల కథలలో 'పెంకి పెళ్లాం' ఒకటి. హైందవస్త్రీ, భర్తను గౌరవించాలనీ, అరం చేసుకోవాలనీ, కష్టసుఖాలు పంచుకోవాలనీ ఈ చిత్రం ప్రబోధిస్తుంది. ప్రబోధం పాతదే అయినా, (అబద్ధ మాడరాదు అన్నది కూడా పాతదే) దాన్ని ఆ చిత్రం దర్శకుడు శ్రీ కమలాకర కామేశ్వరరావు ఎంతో నేర్పుతో, అది క్షణంలో సగంలో ప్రేక్షకుడి మనసుకు హత్తుకు నేలాగ, అత్యంత శక్తివంతంగా, ఒక్క చెంపకాయతో చెప్పించారు పతాక సన్నివేశం (క్లైమాక్స్) గా పరిశీలిస్తే బిగువైన కథలుగల అనేక చిత్రాలకన్న ఇది అనేకరెట్లు మిన్న అని చెప్పవచ్చును. చెప్పే విషయంకన్న, చెప్పిన పద్ధతే ముఖ్యం అన్న నిజాన్ని కామేశ్వరరావుగారు ఇందులో ఋజువు చేశారు. అయితే, ఈ పతాక సన్నివేశం తరువాతభాగం ఉండవలసినంత పదునుగా, క్లుప్తంగా లేకపోయింది. ఉప సంహారం సుదీర్ఘం అనిపించింది. అసలు కథకి అటూ ఇటూ కూడా కొన్ని వేల అడుగులు తగ్గిస్తే, ఇది ఉత్తమశ్రేణి చిత్రంగా నిలచి ఉండేది.



"భాగ్యరేఖ"లో జానకి.

మంచి ఫలితాలు

అలాగే, చక్కని కథ తీసుకుని, కాయకష్టంలో గౌరవాన్ని చక్కగా తెలియచెప్పిన చిత్రం "మేలుకొలుపు" ఈ చిత్రం తయారు కావడానికి కారణాంతరాలవల్ల చాలకాలంపట్టింది. కొంతభాగాన్ని ఒకరు, మిగతాది మరొకరు చిత్రించారు.

అసలు ఆలస్యం లేకపోయినా, ముందు అనుకున్న కథ అనుదినం రూపాంతరాలు ధరించడం, కనీసం మార్పులు చెందడం తరచుగా జరుగుతుంది. అటువంటిది, ఈ చిత్రంలో కథ ఒకే గాడిలో సాగి ఒకే సంగతిని సూటిగా శక్తివంతంగా చెప్ప గలగడం ప్రశంసనీయం. నిర్మించే ప్రతి చిత్రం బహుళార్థ సాధక కేంద్రంలాగా కాకుండా, ఒక సంగతిని చక్కగా చెప్పే మనం ఎంతటి గొప్ప స్థాయిని అందుకోవచ్చునో ఈ చిత్రం కొంత సూచిస్తుంది. అనుపమవారు నిర్మించిన "ముద్దుబిడ్డ"కు బెంగాలీ కథ ఆధారం అయినా, దర్శకుడు తిలక్ దాన్ని తెలుగు చిత్రంగా ఒప్పించడంలో మంచి ఫలితాలు సాధించారు. లక్ష్మీ ప్రొడక్షన్స్ వారి "ఇలవేలుపు"లో మద్యపానం, ధూమపానం మొదలైన దురలవాట్లవల్ల నష్టాలు, ప్రకృతి వైద్యం గొప్పతనం చక్కగా తెలియచెప్పారు. ఇందులో ఆద్యంతం చక్కని హాస్యం ఉంది.

ఈ ఏడాది చిత్రాల్లో చెప్పుకోతగ్గ చిత్రం ప్రతిభావారి "ఏది నిజం?" ఇటాలియన్ చిత్రం "ఫ్యూజిటివ్" దీనికి మాతృక.

(27-వ పేజీ తరువాయి)
కాటునుండి రక్షించితే ఒక రూ. 1000/- బహుమతి యివ్వగలము.

కనీసము-ఒక జంతువుపై - పాముచే కరిపించి-ప్రయోగించి, చూపవచ్చు.

ఆ పాముమంత్రగాడు - మా షరతులలో నెగ్గుచో-వానికి, ప్రపంచ విఖ్యాతి అర్జించిపెట్టుటకు మా సర్వస్వము ధార పోయగలము.

ఇది ఏ పాముమంత్రగాడైనను-చేసి చూపవచ్చు.
వాడు. మా చిరునామాకు దెలియచెప్పుచో, తగు వసతులు చేయగలము.

ఇక పాముమంత్రము వంటిదే — తేలు మంత్రము. ఇది చాల విచిత్రము.

దీనిలో మళయాళమంత్రమని, యింకో మంత్రమని భేదములు గలవు.

మళయాళ మంత్రమువల్ల-తేలు కుట్టిన మనిషికి గాక, చెప్పవచ్చినవారిని గూబ మీద కొట్టినచో కుట్టబడినవారికి నెప్పి పోతుందిట.

తేలువల్ల ప్రాణహాని లేదు మహాబాధవుంది.

ఒకతూరి, మా గ్రామమునకు, ఒక పేరుబడిన మళయాళ తేలుమంత్రగాడు వచ్చినాడు. ఆ మంత్రగాడు చేసిన హంగామా చెప్పలేము.

మా గ్రామములో తేలు కుటినవారికి యిద్దరు ముగ్గురకు నెప్పి పోగొట్టినాడు. అందుపై, వాణ్ణి మా గ్రామస్తులు ఆకాశమున కెత్తినారు. ప్రజలు, వాని మహిమ ఒకటే విరంగా శ్లాఘించుట మమ్ములను-ఎగతాళిగా చూచుట జరిగింది.

ఇక మా మిత్రులందరము-ఒకచోట చేరి ఆలోచించాము.

అప్పుడు నేను, ఒక ఆలోచన చెప్పినాను. ఒక తేలును-పట్టుకొచ్చి-మాలో ఒకరము-కరిపించుకొని, ఆ తేలుమంత్రగానిచే మంత్రము పెట్టించుకొని, నిజము తెలిసికొందామని నిశ్చయించినాము.

చివరకు నేనే తేలుచే కుట్టించుకొన సమ్మతించినాను.

మాలో వొకరు-ఒక రోజంతా వెతికి, ఒక మంచి తేలును పట్టుకొచ్చినాడు.

కొందరు - ఆ తేలుమంత్రగానివద్దకు వెళ్లి మా షరతులు చెప్పినారు. అప్పుడు వాడు వొప్పక తప్పలేదు. లేనిచో వాని పరువు పోతుంది.

మేము-వూరంతా చాటింపించినాము. తేలు కుట్టించుకొనుట, తేలు మంత్రగాడు మంత్రము పెట్టుట - ప్రజలకు దెలియునట్లు ప్రచారము చేసినాము.

ఆరోజు సాయంత్రము 4 గంటలకు-మా గ్రామచావడిలో చేరినాము. మంత్రగాడు వచ్చినాడు.

మా గ్రామపెద్దలు వచ్చినారు. వారు మధ్యవర్తులు. గ్రామములోని ఆబాలగోపాలము అచ్చటికి చేరింది. చుట్టుపట్ల గ్రామ యువకులుగూడ మాతో కలిసినారు—

అప్పుడు తేలుచే నా చేతిపై కుట్టించుకొన్నాను.

ఇక మంత్రగాడు మంత్రము పెట్ట మొదలు పెట్టినాడు.

కొంచెము కొంచెము, విషము ఎక్కుట ప్రారంభించినది.

మంత్రగాడు తగ్గినదా, అంటూనే వున్నాడు. నాకు చంకవరకు విషము ఎక్కినది. భరించలేని బాధతో, ఒకతూరి ఏడ్చినాను. ఆరోజు షుమారు 10 గంటల వరకు నేను పడినబాధ చెప్పలేను.

పాము మంత్రగాని మహిమ, మా గ్రామస్తులఎదుట మంటగలసినది. వానిని పలుగురు నానామాటలు అన్నారు. మా పందెము నెగినది.

తదుపరి వాడు మా గ్రామపరిసరముల వదలిపోయినాడు. మళ్లీ కనుపించలేదు.

ఇంతకీ చెప్పవలసినదేమంటే, మంత్రాలకు చింతకాయలు రాలేకాలము పోయింది. ఎవరైనా, తేలుమంత్రము పెట్టి ప్రభావము చూపించదలంచుచో - తేలు ఒకనికి కుట్టించుదాము. మంత్రముపెట్టి బాధ లేకుండా చేయుచో పందెము వేయగలము. లేనిచో ఆ తేలుమంత్రగాడు, ఓడుచో, మేము పందెమునకు కాచిన డబ్బు యిచ్చుకోవాలి. ఎవ్వరైనా ప్రయత్నించుకోవచ్చు.

ఈ మంత్రములు, ముఖ్యముగా, పామర జనములో మూఢనమ్మకాలున్నచోట ప్రబలముగా ప్రచారములో వుంటాయి. కొంతమంది వాటితో జీవిస్తుంటారు. ఇదీ తతంగము. అంతకుమించి, మంత్రములో ప్రభావములేదు, ఇది నగ్నసత్యము.

కాదంటే ఎవ్వరైనను, మా షరతులకు వొప్పుకొని వారి మంత్రప్రభావములను చూపి, పందెములను గెలువవచ్చును. పేరు సంపాదించుకోవచ్చును.

భావిభారతపురోవృద్ధి వాంఛించువారు, ప్రజలలోవున్న అంధవిశ్వాసములను (మంత్రాలపై నమ్మకం) పోగొట్టాలి, ప్రపంచపౌరులతోపాటు, నూతన మానవత్వముదరికి, భారతీయులనుగూడ నడిపించ ప్రయత్నించాలి. అందుకు యువకులైన విజ్ఞులు నడుముకట్టి ముందుకుసాగాలి. దేశాన్ని రక్షించుకోవాలి.

జి. వాసు—మద్రాసు.

* * *

ఏలూరులో బాలాంత్రపు శేషమ్మగారు, వారి అల్లుడు కొల్లూరి శేషయ్యపంతులు గారు, ఆయన భార్య సుందరమ్మగారు వుండేవారు. శేషయ్యగారు మునిసిపల్ మేనేజరుగాను, ఆయన భార్య హెడ్ మిస్ట్రెస్ గాను పనిచేసేవారు. వారింట్లో, రాత్రులు రోజూ పెద్దపెద్ద రాళ్ళు పడటము జరిగేది. రానురాను ఆ రాళ్లు పగళ్లుకూడా పడేవి. ఇంట్లోవారికి బాగా దెబ్బలు కూడా తగిలేవి. మధ్యమధ్య ఎవరో మనుష్యరూపములో కనిపించేవారు కోకలు తిరగళ్లు, వున్నచోట వుండక, వాటంతటవే వేరే స్థానములో వుండేవి. చక్కని పాలు కాచి, డికాక్షను పంచదార వేసి కాఫీ తాగుదామనుకుంటే, ఆకాఫీ కషాయముగా మారేది. ఇదంతా చూచి వారికి భయముకలిగి వేరే యింటికి మారారు. అచ్చట ఒకరోజు బాగానే గడిచింది. తిరిగి యథాప్రకారము ఇంటిలోనున్న కుర్చీలు, పీటలు, మంచము మీద కెక్కుట, గూటిలో సామానులు ఎగురుట మొదలగు వింతలు జరిగేవి. ఎక్కడో వున్న కిరసనాయిలు సీసా మంచముమీద పడుట ఒకటేమిటి, చెప్పులు, లాంతరులు, బిందెలు ఎగిరి పడుట, అతి భయావహముగా జరిగేవి ఒకరోజున మేనేజరు గారికి కడుపునొప్పి బాధ చాలా ఎక్కువైనది డాక్టరు చేయగలిగినది చేసి వూరుకున్నారు. తగ్గలేదు మంత్రి తీర్థము, విభూది తెచ్చి వారికియ్యగా తగినది. దొడ్లో నీళ్ళకాగు కప్పగంతులు వేసేది. పరుపులు, దిండు కాలివుండేవి. వారు అన్నము తిందామని చూచుంటే, అందులో బొగ్గులు, ఇసుక పడి వుండేవి ఈ విధముగా వారు రెండునెలలు నానా అవస్థలు పడ్డారు. చివరకు మేనేజరుగారు అయ్యగారి వెంకట్రామయ్యగారితో పరిచయము కలిగించుకుని వారితో తమబాధలు వెల్లడించుకొనిరి. ఒకరోజు తమయింటికి తీసుకువెళ్లారు. వారు అక్కడవున్న గంటలోను ఏవిధమైన బాధా

(42-వ పేజీ చూడండి)

మనుష్యులు, మమకారాలు

"పార్వతమ్మ...ప్రాణాపాయపరిస్థితి.. తక్షణం రావలెను" టెలిగ్రాం చూచుకుని లోపలికిపోతూ ప్రభాకరం "రాధా! రాధా! తక్షణం బయల్దేరు ఆశ్రమంనుంచీ టెలిగ్రాంవచ్చింది" అన్నాడు.

"ఏమైందండీ? ఏముందందులో" అంటూ వంటగదిలోనుంచీ కంగారుగా బయటికి వచ్చింది రాధ.

"ఇందులో రెండు మాటలకంటే ఎక్కువ లేదు. అసలు విషయం మనకక్కడికి వెళ్తేగానీ తెలియదు" అన్నాడు ప్రభాకరం.

రాధ తొందరగా వంట ముగించింది. భోజనంకాగానే ప్రభాకరం వీధిలోకివెళ్ళి జట్కా తీసుకొచ్చాడు. ఆ పాటికి రాధ ట్రంకులో బట్టలు సర్దుకుంది.

బయల్దేరిన వేళ మంచిదేమో! కొంచెం ఆలస్యమైనా బస్సులో సీటుదొరికింది.

చిట్టడివి మధ్య వంకరలు తిరిగిపోతున్న తారురోడ్డుపైన నున్నగా జారిపోతున్న బస్సులో కూచున్న ప్రభాకరం తలపులన్నీ నాలుగైళ్ళు వెనక్కు పరుగెత్తాయి

అత్తయ్య, మామయ్య, రామ్మూర్తి, రవణ ఒక్కొక్కరుగా అతడి స్మృతి పథంలో మెదలిపోసాగారు. ఈ నలుగురిలోనూ మామయ్య యిప్పుడు లేడు. అత్తయ్య చావు బ్రతుకుల్లో వుంది రామ్మూర్తీ, రవణ ఎక్కడున్నారో తనకు తెలియదు!

ప్రభాకరం అదోతరహా మనిషి. అతడిది అంతకూ, యింతకూ ఆశ్చర్యం ప్రకటించే స్వభావంకాదు. భూమిపైకి బాగా వాలిపోయివున్న పైసానగరపు గాలిగోపురం ఎన్నోశతాబ్దాలుగా అలాగే నిలిచివుందని ఎవరైనా ఆశ్చర్యం వెలిబుచ్చితే "ప్చ, అందులో ఏముంది. దాని గరిమనాభిలో నుంచీ వచ్చే లంబరేఖ ఆధారతలంలో నే పడుతుంటుంది. నువ్వు పనిగట్టుకుని కూలదోస్తేగానీ అది క్రిందపడదు" అని ప్రభాకరం సహేతుకంగా కార్యకారణ సంబంధాన్ని విశదీకరిస్తాడు. 'మెరుపు ఎంత చిత్రంగావుద్భవిస్తుందబ్బా' అనిఅతడిముందు చెప్పిచూడు! "మేఘాలు ఢీకొన్నప్పుడు మెరుపు పుటడంలో ఏంచిత్రముంది? ఒక వేళ ఏనాటికైనా మేఘసంఘర్షణవల్ల మెరుపు పుటకపోతే అది అత్యాశ్చర్యకరమైన విషయమౌతుంది" అంటాడు ప్రభాకరం. ఐతే అలాటి ప్రభాకరానికి కొండంత ఆశ్చర్యం కలిగించే విషయమొకటి ఈ విశాల ప్రపంచంలో లేకపోలేదు. తన మేనత్తకొడుకుల విచిత్ర సౌభాతృత్వాన్ని గురించి తలచుకున్నప్పుడల్లా, వాళ్ళ విచిత్ర ప్రవర్తనకు వెనుక దాగివున్న వింత మనస్తత్వాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించి, ప్రయత్నించిన ప్రతిసారీ విఫలుడైపోతూ వుంటాడు ప్రభాకరం!

రామ్మూర్తి తనకంటే నాలుగైళ్ళు పెద్దవాడు. రవణకి తనకీడే వుంటుంది. ఇద్దరిదీ కాపురాలు వెలగబెట్టవలసిన వయస్సే. చదువుకునివుంటే వాళ్ళూ తనలా అర్జనపరులై వుండవలసింది ఐతే అర్జన, పెళ్ళి పెటాకుల్లాంటి సాంసారిక విషయాల్ని ఈ అన్నదమ్ములు పట్టించుకోరు. ఐనా వాళ్ళకు డబ్బుతో మాత్రం ఎడతెగని అవసరాలుంటాయి తిండివిషయం అటుంచి

మధురాంతకం రాజారాం

టిఫన్, ధూమపానాలకే వాళ్ళు రోజుకొకటి రెండు రూపాయలు తగలేస్తారు. నిత్యవ్యవహారాల్లో వాళ్ళకు నిర్ణీతమైన పద్ధతులంటూ లేవు. చేతడబ్బు పుష్కలంగా వుంటే వాళ్ళు గోల్డుఫ్లేక్ సిగరెట్టు తప్ప మరొకటి ముట్టరు. జేబు ఖాళీఅయితే ఒకే బీడీని నాలుగైదుసార్లు ఆర్పి మళ్ళీమళ్ళీ పొగపీల్చడానికి వెనుదీయరు! హమేషా వాళ్లు దేశంపైన పరిభ్రమిస్తారు. మరీ ఆశ్చర్యకరమైన విషయమేమంటే వాళ్ళని చూచినవాడు వీళ్ళన్నదమ్ములని అనుకోడానికి అణుమాత్రమైనా ఆస్కారముండదు. ఒకరిభుజాలపైన ఒకరు చేతులు వేసుకుంటారు. ఒకరి సిగరెట్టుతో ఒకరు సిగరెట్టు కాల్చుకుంటారు. ఇక పేకాట పట్ల ఆ అన్నదమ్ములకున్న ప్రీతి చెప్పనలవి తగ్గది! ఏఏవూళ్ళో ఎప్పుడెప్పుడు పేకాట జరుగుతుందో వాళ్ళకు తెలిసినట్టు మరొకరికి తెలియదు. ఎప్పుడో యిష్టమైనప్పుడు దూరపు బంధువుల్లా స్వగ్రామానికి విజయం చేస్తారు. నాలుగైదురోజులు గృహకలాపాల్లో అత్యాసక్తి కనబరుస్తారు ఆ రోజుల్లో ఆరోగ్యం పుదయానికి అయిపు లేకుండా మాయమౌతారు. వాళ్ళతోబాటు యింట్లోడబ్బో, దస్కమో మాయంకావడమూ, అందుకోసం మామయ్యా నాలుగుతిట్టి, అత్తయ్య రెండేడుపులు ఏడ్చి వూరుకోవడమూ సూర్యోదయ సూర్యాస్తమానాల్లా సహజ పరిణామాలు!

వంచనాశిల్పం కూడా ఒకగొప్పకళ అని ఆ అన్నదమ్ములు లోకానికన్నోసార్లు నిరూపించారు. విచిత్రమేమిటంటే వాళ్ళు ఒకేమనిషిని ఎన్నిసార్లయినా మోసగించగలరు. ఒకరివిషయం యెక్కడెందుకుగానీ, వాళ్లుపన్నిన వుచ్చుల్లో తగులుకుని తనుగూడా ఎన్నిసార్లు గిలగిల లాడిపోలేదు!

* * *

"ప్రభాకరం! ప్రభాకరం!"

తలుపు దబదబ మ్రోగిపోతోంది. ప్రభాకరం లేచి కూర్చున్నాడు.

ఇంకా తెల్లవారలేదు. అంతలో తెల్లవారడం ప్రభాకరానికి యిష్టంలేదు కూడా! తియేటరునుంచీ హోటలుకు వెళ్ళి తిన్నశాస్త్రం ముగించుకుని యిల్లు చేరుకునే సరికి తాలూకాఫీసులో పదకొండు కొట్టారు. సరే. పడకపైన దొర్లుతూ వుండగానే ఒకటోరెండు గడియలు గడచిపోయి వుంటాయి. బహుశా ఏ అర్థరాత్రప్పుడో నిద్రాదేవి ప్రభాకరాన్ని తన కౌగిలిలోకి ఆహ్వానించి వుంటుంది. ఆ నిద్ర నిరభ్యంతరంగా అలాకొనసాగి వుంటే ప్రభాకరం సూర్యోదయానంతరం ఏ ఎనిమిదికో, తొమ్మిదికో లేచి ఆదరాబాదరా గడ్డం గీక్కుని, స్నానంచేసి, హోటల్లో వెచ్చగా ఒక గ్లాసుడు కాఫీ సేవించి పది గంటలకు కాలేజీ చేరుకునే వాడు. కానీ చీమచిటుక్కుమంటే వులికిపడి మేలుకునే ప్రభాకరానికి అంతటి గాఢ నిద్ర పట్టడం కంటే అసంభవమైన విషయం మరొకటి వుండదు. అందులోనూ అతడు పడుకున్న గదికి దశదిశలా పరివ్యాప్తమై వున్న పట్టణంలో ఏసమయానికి ఎలాటి గందరగోళం వుద్భవిస్తుందో వూహించడంకష్టం. లేకుంటే వేకువఝామప్పుడు గణగణ గంట మ్రోగించుకుంటూ మునిసిపాలిటి వారి ఫైరింజన్ శరవేగంతో పరుగెత్తడమేమిటి? ఇంకెక్కడా వీధులు కరవై పోయినట్లు రిజర్వు పోలీసు దళం అయిదుగంటలవేళ రోడ్ మార్చింగుకు రాజవీధినే ఎన్నుకోడమేమిటి! కనక

మనుషులు - మమకారాలు

దుర్గ నక్షత్రంలో సూర్యోదయా త్పూర్వం అయిదున్నరకు పైన, ఆరున్నరకు లోగా మకరలగ్నంలో వధువు మెడలో మంగళ సూత్రం ముడివేయవలసిన పెళ్లికుమారుడు బ్యాండుమేళంతో కాశీయాత్రకు బయలు దేరి రావడమేమిటి! ఏమిటిదంతా! ప్రభాకరం చిరాకుతో దుప్పటి ముఖం పైకి తీసుకుంటూ కళ్లు గట్టిగా మూసుకుని మళ్ళీ నిద్రపోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. తలుపు పైన చప్పుడయింది!

"ప్రభాకరం! ప్రభాకరం!"

ఇది మునుపటి కంఠం కాదు. ఐతే తన కోసం ఎవరో యిద్దరుగా కలిసి వచ్చారన్న మాట! ఉన్న గోలంతా చాలక కాలేజి ఆవరణలోకి కొత్తగా ఎలక్షను ప్రవేశించాయి బహుశా ఆ వచ్చిన వాళ్ళల్లో ఒకడు ప్రధాన మంత్రిత్వానికి పోటీ చేస్తున్న అభ్యర్థి అయితే కావచ్చు. మరొకడు 'కింగ్ మేకర్' లాంటి తంత్రజ్ఞుడై వుంటాడు. వాళ్ళని లోపలికి రానివ్వడమే ప్రమాదకరం! అరిచి అరిచి నోరు నొప్పెట్టితే వాళ్ళే వెళ్ళిపోతారు.

కానీ మూడోసారి పిలుపు వినిపించేసరికి ప్రభాకరం ఎగిరిపడి పైకి లేచాడు. "వస్తున్నా, వస్తున్నా" అంటూ పరుగున వెళ్ళి తలుపుతీశాడు. తీస్తూనే ఈ వేళ గాని వేళ వీళ్ళెక్కడనుంచీ తగులబడినట్టని లోలోపల విసుక్కున్నాడు

"ఎలాగైతే నేం! ఆఖరకు నిన్ను నిద్ర లేపగలిగాంరా బాబూ!" అన్నాడు ఆగంతకుల్లో ఒకడు.

"ఘనకార్యం చేశారుగానీ జయవిజయులా ద్వారం కాచిందిచాలు. లోపలికి రండి" అన్నాడు ప్రభాకరం.

ఆ గంతకులు లోపలికి వచ్చారు. ఎర్రటి ఎండు దుమ్ము పేరుకుని పోయిన పాదాలతో దుప్పటి ఖరాబుచేస్తూ ఒకడు దభీమని పరుపు పైన కూలబడి సాపుగా పవ్వళించాడు. మరొకడు ఈజీచేర్ లో కూచుని కాళ్ళని పుస్తకాలున్న అలమారాలోకి చాచాడు. ప్రభాకరం ఆ యిద్దరి ముఖాల్లోకి వింతగా చూస్తూ ఒకట రెండు నిమిషాలపాటు మౌనంగా వుండిపోయాడు.

"ఒరే బాబూ! ఏదో పెద్ద ప్రసంగానికి తయారౌతున్నట్టుంది నీ వాలకం చూస్తుంటే మే మిప్పుడేమీ మాట్లాడే స్థితిలో లేం! ముందు దగ్గరగా వున్న హోటల్లోనుంచీ టిఫిన్ తెప్పించు చెరీ అయిదు యిడ్లీలు, రెండుపూరీలు, కాఫీ, ట ఏదయినా సరే - క్విక్, క్విక్" అన్నాడు రామ్మూర్తి.

ఉన్నట్టుండి మేఘాల్లో నుంచీ వూడిపడ్డట్టు ఎప్పుడంటే అప్పుడు రోడ్డులోనో, పార్కులోనో ఈ అపూర్వసోదరులు ఎదురుగావడం, వాళ్లకు తృణమో పణమో ముట్టజెప్పుకోడం ప్రభాకరానికి కొత్తగాదు. ఒక్కొక్కసారి వీళ్లు అప్పుడే ఓడదిగిన నాటుదొరల్లా చెరగని యిస్త్రీమడుపుల్లో టీకుటాకుగా కనపడేవారు మరొకసారి తద్వ్యతిరేకంగా బాగా మాసి, మాసికలు పడ్డ లుంగీగుడ్డల్లో కనపడేవారు. వేషమెలా వున్నా వీళ్ల ముఖాల్లో చింతాకంత ఆందోళనయినా కనిపించేదికాదు. ఈనాటికీనాటికి విన్నబోయిన వదనాలతో ఈ అన్నదమ్ములు ప్రత్యక్షమయ్యేసరికి ప్రభాకరానికి జాలిపడక తప్పింది కాదు. బహుశా రాత్రంతా నిద్ర లేదేమో, కళ్లు బాగా ఎర్రపెక్కి వున్నాయి దవడలు గుంటలు పడి, కళ్లు లోపలికిపోయి, నుదురు కొట్టవచ్చినట్టు పైకి కనబడుతున్న ఆ ముఖాల్లో కాగడా వేసి వెదికినా కాంతి కనిపించే లక్షణాలు లేవు. "అయ్యో, పాపం" అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు ప్రభాకరం.

అంతగా ప్రభాకరం జాలిపడడానికి మరో బలీయమైన కారణం కూడా లేకపోలేదు వీళ్ళిప్పుడు తండ్రి లేని బిడ్డలు! మామయ్య చనిపోయి యింకా నెలరోజులు కాలేదు. ఆయన మరణశయ్యపైన వీళ్ల కోసం హృదయ విదారకంగా పలవరించాడు. కబురందగానే తను మాత్రం నిలుచున్నపాటున బయల్దేరి వెళ్లాడు. మృత్యుదేవత క్రూరదంష్ట్రల మధ్య నలిగిపోతూ మామయ్య కళ్లు తెరచి తనని చూచాడు. "ఏమైనా తెలిసిందా ప్రభాకరం వీళ్ల ఆచూకీ" అని ప్రశ్నించాడు. లేదన్నట్టు తను శిరఃకంపనం చేశాడు. ఆ ఆఖరు క్షణాల్లో మామయ్యకు పట్టరానంత కోపం వచ్చింది "అందుకే.. అందుకే సరిగ్గా శాసి చేసి పెట్టాను. ఆస్తంతా మీ అత్తయ్య పేర వ్రాసేశాను. వెధవలకు చిల్లికానీ అయినా దక్కగూడదు. బొచ్చె చేతబట్టుకొని బిచ్చమెత్తుకోవాలి" అని గుక్కెడు మంచినీళ్లు త్రాగి మామయ్య తనని దగ్గరికి రమ్మని సైగ చేశాడు. మంచంపైన ప్రక్కగా కూచోమన్నాడు "చూడు ప్రభాకరం! వాళ్లు నాకు పుత్రులు కారు. శత్రువులు! ఆ ఆశ నేనెప్పుడో వదులుకున్నాను మరి రాధనేం చేస్తావు బాబూ!" అన్నాడు. తన కళ్ళలో నీరు నిలిచాయి రాధని గురించి మామయ్య తన నలా ప్రశ్నించడం బొత్తిగా అనవసరం. పుట్టింది మొదలు రాధ బంధులోకంలో తన పెళ్లాంగానే వ్యవహరింపబడుతోంది. లేదంటే పెళ్ళి మాత్రం యింకా కాలేదు. అదీ ఈ సంవత్సరం తన చదువు పూర్తి కాగానే అయిపోతుంది.

మామయ్య చనిపోయిన తరువాత నాలుగు రోజులకు కబురెలా అందిందో గానీ కుమారులిద్దరూ ఓ సంధ్యాసమయాన బస్సుదిగారు. ఊళ్ళో వీళ్ళని చీవాట్లు పెట్టని వాడు పాపాత్ముడు. అత్తయ్య అయితే "ఏముఖం పెట్టుకుని వచ్చారు? మీరూ మనుషులేనా? నాకళ్ళకు కనబడకండి. మిమ్మల్ని చూస్తే చాలు, పాపం చుట్టుకుంటుంది" అని పది నిమిషాలపాటు శాపనార్థాలు కుమ్మరించి రెండుగంటలసేపు వెక్కిళ్లు పెట్టి ఏడ్చింది.

ఉత్తరక్రియ లైపోయేంతవరకూ వూళ్లోనే వుండి ప్రభాకరం మళ్ళీ పట్నానికి వచ్చేశాడు. వస్తూ యికనైనా గుట్టుగా మసలుకోడం మంచిదని బావ మరుదులకు హితవు చెప్పాడు. ఏం కాలానికో గానీ యిప్పుడు అన్నదమ్ములు బుద్ధిగా వున్నారనీ, వాళ్ళలాగే యింటిపట్టునవుండి, పోతే తన కెలాంటి చింతా వుండదనీ ఈ మధ్య అత్తగారు వ్రాయించిన జాబొకటి ప్రభాకరానికి అందింది.

"ఐతే మా మొరనీ చెవులదాకా ఎక్కలేదన్న మాట! ఒరే ప్రభాకరం! ఆకలికి పేగులు మాడిపోతున్నాయి" ఈసారి రవణ ప్రభాకరాన్ని తీవ్రంగా హెచ్చరించాడు.

ఎదురింటి అబ్బాయిని బతిమాలుకుని ప్రభాకరం హోటలునుంచీ టిఫిన్ తెప్పించాడు. ఉపాహారానంతరం అతిథుల కోరికపైన్నే బంకులోనుంచీ కిళ్ళీలు, సిగరెట్లు తెప్పించి సమర్పించుకున్నాడు. ఆతిథ్య మర్యాదలన్నీ సలక్షణంగా జరిగి పోయిన తర్వాత "యింతకూ మీరిలా ఎందుకు దయచేసినట్లు" అని అసలు విషయాన్ని తనే ప్రస్తావించాడు.

"అర్థరాత్రప్పుడు బయలుదేరామనుకో! తెల్లవారకముందే యిక్కడికి వచ్చి నిన్ను నిద్రలేపాలనుకున్నాం. సరిగా ఐదుగంటల సైరన్ మ్రోగుతోంది. అప్పుడు మేము స్టేషను దాటుకుని టౌనులోకి వస్తున్నాం" అన్నాడు రామ్మూర్తి.

"నిశాచరులు నయం రాబాబూ మీకంటే! ఏమంత కొంప మునిగిపోయిందని మీరు రాత్రి పూట ప్రయాణం తలపెట్టారో నాకర్థం కావడంలేదు" అన్నాడు ప్రభాకరం.

"అదే చెప్పబోతున్నా! తొందరపడతావెందుకూ! ఒరే రవణా, ఏదీ ఆ కాసుల పేరు! ప్రభాకరం చూడనీ" అన్నాడు రామ్మూర్తి.

రవణ తన ఫాంటు జేబులోనుంచీ

వగపైకి తీశాడు. నిర్లక్ష్యంగా దాన్ని ప్రభాకరం ముందరికి విసిరాడు.

"ఎందుకిది? ఏంచేయాలి?" అన్నాడు ప్రభాకరం.

"చేసేదేముంది? అమ్మేయాలి. దూలాలు, వాసాలు లేక ఆయింటిపని అలాగే నిలిచిపోయింది. పంచాయితీ బోర్డువాళ్లు ఈరోజు సాయంత్రం వేపచెట్లు వేలం వేయబోతున్నారు. తక్షణం మూడు వందల రూపాయలు కావాలి, దీన్ని తీసుకెళ్ళి మా అమ్మనీ దగ్గర యిమ్మంది"

"నువ్వేమో దీన్ని అమ్మి డబ్బు తెస్తావు మేము డబ్బుతీసుకుని మధ్యాహ్నం బస్సుకు వూరికి పోతాం. యిదికథ" అంటూ రామ్మూర్తి ప్రారంభించిన కథని రవణ పూర్తిచేశాడు.

ప్రభాకరానికి ఏం చేయడానికీ పాలుపోలేదు. ఇది గూడు పురాణీ కాదుగదా! ఏమోమరి! ఎలాటి పరిస్థితిలో నైనా సరే వీళ్ళు విశ్వాస పాత్రులు కానిమాట నిజం! ఐనా ఓడు ఓడని కుండంతా ఓడంటే ఎలాగ? ఆయిల్లు కట్టి, కొత్తలోగిట్లో రాధకి పెళ్ళిచేయాలని అత్తయ్య ఆశయం. ఇంట్లో డబ్బులేని మాటగూడా వాస్తవమేమరి! మామయ్యకు డబ్బునిలవచేసే వాడుకలేదు. హరికథల్లో ఆయన ఏడాదికి రెండు వేలకు తక్కువ గాకుండా సంపాదించే వాడు. సంపాదించిన డబ్బంతా ఆయన పొలాలపైన పెట్టాడు. కొత్తగా భూములు కొన్నాడు. సముద్రంలాంటి బావులు త్రవ్వించాడు. అనారోగ్యమూ, వృద్ధాప్యమూ క్రుంగదీసేవుండకపోతే ఆ యింటిపనిగూడా ఎప్పుడో పూర్తయి వుండేది.

ప్రభాకరం కాసుల పేరు జేబులో వేసుకుని వీధిలోకివస్తూ, వీధిమెట్లపైన నిల్చుని కూడా కొంతసేపు తటపటాయించాడు. వీళ్ళు దీన్ని అమ్మి డబ్బు కాజేయదలచుకుని వున్నట్లయితే తనదాకా ఎందుకు రావాలి? వాళ్ళకు అమ్ముకోడం చేతకాందేమిటి? అబ్బే, తను మరీ సందేహప్రాణి అయిపోతున్నాడు. అనుమానం ప్రాణసంకటమని సెలవిచ్చారు పెద్దలు!

తన సందేహాలకు తనే సమాధానం చెప్పుకుని ప్రభాకరం బజారుకేసి నడిచాడు

మరునాటి వుదయం ప్రభాకరానికి వూళ్ళోనుంచి ఒక జాబువచ్చింది. ఆద్యంతాలు వదిలిపెడితే ఆ జాబులో ముచ్చటగా మూడు వాక్యాలుమాత్రమున్నాయి "నీ బావమరదులు నిన్నటిరోజు రాత్రి వేళ యింట్లోనుంచీ పరారైపోయారు. మీ మామయ్య ఎప్పుడో చేయించిన పాత కాసుల పేరుగూడా కనిపించడంలేదు. ఈ

★ మనుషులు-మమకారాలు ★

జాబు చూచిన తక్షణం బయల్దేరి రావలసింది."

* * *

పార్వతమ్మలో యిలాటి మార్పుగూడా కలుగవచ్చునని ఎవరనుకున్నారు? ప్రేళ్ళకు నీళ్ళందక కరువుకాలంలో వాడిమాడిపోయే కదళీతరువులా హృదయం మొద్దుబారిపోయిన తర్వాత ఎవరైనా మారిపోక తప్పదు ఈసారి తను కన్పించగానే పార్వతమ్మ హృదయోద్వేగం తుపానులా పెలుబుకుతుందనుకున్నాడు ప్రభాకరం. కానీ అలాటిదేమీ జరుగలేదు. కన్నీళ్ళన్నిటినీ ఏనాడో వ్యయించుకున్న అనార్ద్రనయనాలతో పార్వతమ్మ ప్రభాకరంకేసి ఒకసారి చూచింది. ఆ పిచ్చివాలకాన్ని చూచి ప్రభాకరం విస్తుపోయాడు.

"తెలిసి తెలిసీ అడుసులో కాలువేశావత్తయ్యా! వాళ్ళంతటి ద్రోహానికి ఒడిగట్టారని నాకు తెలియదు. నువ్వు అమ్మిపెట్టమన్నావని వాళ్ళానగను తీసుకొచ్చి నాచేతబెట్టారు. నేను నిజమేననుకున్నాను" అన్నాడు ప్రభాకరం.

ఇక్కడ పొరుగింటి పెద్దమనిషి ఒకతను కలుగజేసుకుంటూ "వాళ్లు జగమెరిగిన బ్రాహ్మణులు రా బాబూ! స్వయంగా వాళ్లే అమ్మకానికి బయల్దేరితే ఎవరికైనా సందేహం కలుగుతుంది. అందుకని అవసరానికి నిన్నుపయోగించుకున్నారు" అన్నాడు.

అప్పటికీ పార్వతమ్మ మాట్లాడలేదు.

ప్రభాకరం పార్వతమ్మ దగ్గరికివెళ్లి కుర్చీలోకూచుంటూ "అదిగాదత్తయ్యా! జరిగిందేదో జరిగిపోయింది వాళ్ళేనాటికైనా యింతే. అందుకు బెంగపడిమాత్రం ఏం లాభం" అని వూరడించబోయాడు.

"నాకిప్పుడొకే బెంగ ప్రభాకరం! రాధకి పెళ్లికావాలి. పెళ్లయిపోవడం తరువాయి, ఆస్తి మీ పేరవ్రాసి నేనే ఆశ్రమానికైనా వెళ్లిపోతాను. ఇంట్లోవున్నంతకాలం నాకీవేదన తప్పదు ఇంత పని చేసినవాళ్లు, ఏ అర్థరాత్రప్పుడో తలమీద రాయివేయడానికి వెనుదీస్తారని నేనెలా అనుకోను! నేను శాస్త్రుల్ని అడిగి ముహూర్తంకూడా చూచివుంచాను. అన్నయ్య కెలాగైనా వచ్చజెప్పుకుంటాను నువ్వు నాలుగురోజులు సెలవుపెట్టి యింటికి వచ్చేయ్. పెళ్లికాగానే పెళ్లాన్ని తీసుకెళ్లి పట్నంలో కాపురంబెట్టు" అంది పార్వతమ్మ.

ప్రభాకరం బాగా ప్రొద్దుపొయ్యేంతవరకూ ఆలోచించాడు. ఆ పరిస్థితిలో అత్తయ్య అలాటి నిర్ణయానికి రావడానికన్నా మార్గాంతరంలేదు. నాన్నగారి దృష్టి మొదటినుంచీ మామయ్య సంపాదించిపెట్టిపోయిన ఆస్తిపైన్నేవుంది. ఆవిషయం అత్తయ్య తేల్చి చెప్పేసిందిగనుక ఈపెళ్లికిక ఏవైపునుంచి చూచినా ఆటంకంలేదు. ఇక తను మాత్రం ఎందుకు అడ్డుమాట వేయాలి

భోజనానంతరం ప్రభాకరం "నాదేముందత్తయ్యా! నువ్వూ, నాన్నగారు కలసి ఏంచేయమన్నా నేను సిద్ధమే" అని తననిర్ణయాన్ని తేల్చివేశాడు.

అనుకున్నట్టు పెళ్ళి సలక్షణంగా జరిగిపోయింది. పెళ్ళయిన మరునాడే పార్వతమ్మ ఆస్తిని గురించిన ప్రస్తావన తెచ్చింది. ఒకవైపు అత్తగారు, మరోవైపున బావమరదులు బ్రతికి వుండగానే ఆస్తి తన పేరిట వ్రాయించుకుంటే లోకాపవాదానికి గురికావలసి వస్తుందని ప్రభాకరానికి లోలోపల జంకు. అందుకని అతడు వుభయతారకంగా ఒక ఎత్తు వేసి ఆస్తిని రాధ పేర వ్రాయించడం బాగుంటుందని పార్వతమ్మకు సలహా ఇచ్చాడు. కానీ రాధ అందుకు ససేమిరా ఒప్పుకోనంది. "కొండలా మీరుండగా నాపేర వ్రాయించుకోడమేమిటి! నవ్వుతారెవరైనా" అంటూ ఆమె భర్త నిర్ణయానికి అడ్డుతగిలింది.

"మీరు పదండి, లేవండి ఎప్పుడు కబురు పంపితే అప్పుడు వచ్చి ఆస్తి మీలో ఎవరి పేరిట వ్రాసివ్వమన్నా వ్రాసిస్తాను" అంది పార్వతమ్మ.

* * *

సతీ సమేతంగా ప్రభాకరం ఆశ్రమ పరిసరాల్లో కాలుబెట్టేసరికి (వేదాంతుల పరిభాషలో) గూటిలోనుంచీ చిలుక ఎగిరిపోయింది. నిర్లిప్త హృదయులైన సన్యాసులమధ్య గొంతెత్తి ఏడవడానికైనా రాధకు వీల్లేకపోయింది. సాయంత్రానికి దహనక్రియలు సాంగంగా నెరవేరిపోయాయి ఆ రాత్రి పార్వతమ్మ మనశ్శాంతికోసం ఆశ్రమంలో గీతా పారాయణం జరిగింది. మరునాటి వుదయం దంపతులకు వీడ్కోలిస్తూ ఆశ్రమవాసి స్వామి శాంతానంద "పార్వతమ్మని మీరు పూర్వాశ్రమంలో మాత్రం ఎరుగుదురు. బాబూ! దీక్షస్వీకరించిన నాటినుంచీ ఆమె ఆశ్చర్యకరంగా మారిపోయింది. అనాగత విషయాల్ని వూహించేంత వరకూ ఆమె మనసు పరిపక్వం చెందిందంటే, ఈ విషయం మీకు విచిత్రంగానే తోచవచ్చు. లేకుంటే ఆమె తన చావును తానే తెలుసుకున్నట్టు సరిగ్గా పదిరోజులకు ముందుగా వీలునామా ఎలా వ్రాయించగలుగుతుంది. చెప్పండి" అంటూ పార్వతమ్మ తమ కిచ్చిపోయిన విలును ప్రభాకరం చేతిలో పెట్టారు.

ఆ రోజు బస్సురావడానికి కొంచెం ఆలస్యమయింది. దంపతులు అరగంట సేపు రోడ్డుప్రక్కన కానుగ చెట్టు క్రింద మౌనంగా కూచున్నారు ఉన్నట్టుండి తల పైకెత్తి రాధ "ఏమండీ! ఆ కాగితాలిలా యివ్వండి చూద్దాం" అంది.

"చూడ్డానికేముంటుందని! అంతా మనకు తెలిసిందేగా!" అన్నాడు ప్రభాకరం.

"ఏమిటి మనకు తెలిసింది?"

"ఎలాగైనా నువ్వు కుమార్తెవి. చివరికి ఆమె నీ పేరిటే వ్రాసివుంటుంది"

"మా అమ్మ సంగతి మీ కంటే నాకు బాగా తెలుసు. ఆమెకు మీ రంటే ప్రాణం. విల్లు చూడండి మీకే తెలుస్తుంది."

"అలాగయితే నువ్వేచూడు" అంటూ ప్రభాకరం విల్లును రాధ ఒడిలోకి విసిరాడు. ఎందుకోగానీ అసలు విషయం తెలుసుకోడానికి ప్రభాకరానికి ధైర్యం చాలడంలేదు. అకారణంగా గుండె దడదడ కొట్టుకుంటోంది.

రాధ తొందరగా కాగితాలు త్రిప్పుతూ ఒక చోట ఆగి "అయ్యో! యిదేమిటండీ! ఇలావచ్చి చూడండి బాబూ! నాకేమీ అర్థం కావడం లేదు" అంది.

ప్రభాకరం విల్లులోకి చూచాడు.

ఉన్న ఆస్తిని సరిగ్గా రెండు భాగాలుచేసి ఒక భాగాన్ని రామ్మూర్తికి, రెండో భాగాన్ని రవణకి వ్రాయించింది పార్వతమ్మ! ★

తెలుగు మేష్టారు మిత్రభేదం పాఠం చెబుతూ యిలా అన్నారు: "చిన్నయసూరి గొప్ప పండితుడు. ఆయన స్వయంగా బాలవ్యాకరణమనే గ్రంథం వ్రాయడమే కాకుండా, ఎక్కడా వ్యాకరణ దోషాలు లేకుండా నీతిచంద్రిక అనే వచన గ్రంథం కూడా వ్రాశాడు."

ఒక విద్యార్థి లేచి "మేష్టారూ! నా వ్యాకరణం నేనే రాసుకుంటే, నేనుకూడా తప్పులు లేకుండా రాయగలనండి" అన్నాడు.

ఈ చిత్ర నిర్మాత శ్రీ ఘంటసాల కృష్ణమూర్తి, ఈ చిత్రంలో నాయకుడి భూమికను ఒక కొత్త నటుడికి (శ్రీ నాగభూషణం) ఇచ్చారు. స్టార్ వాల్యూ మొదలైన బాక్సాఫీస్ సూత్రాలను ఖాతరు చేయకుండా, ఈయన ఈ చిత్రం నిర్మించారు. తమిళ దర్శకుడు శ్రీ బాలచందర్ దీనికి చక్కటిరూపం ఇచ్చారు. అఖండమైన బాక్సాఫీస్ రికార్డులు నెలకొల్పక పోయినా, విజయవంతంగానే సాగింది.

సాంఘిక చిత్రాల మంచి చెడ్డలు చెప్పకోవడానికి కారణం పౌరాణికాలు జానపదాలూ అవాంఛనీయాలని కాదు.

పౌరాణికాలు

తులాభారం చిత్రం విజయం సాధించడంతో అందరూ ఒక్కుమ్మడిగా పౌరాణికాల వైపు తిరిగారు. 1956 ఆరంభంలో సాంఘికాలు తలపెట్టిన వారు కూడా, అవి అప్పటికి మానుకుని ఇటు తిరగడం జరిగింది.

“ఇది 1956 ఇప్పుడు టెక్నికల్‌గా పరిశ్రమ చాలా అభివృద్ధి సాధించింది. పౌరాణిక గాథలకే వినూత్న రూపం, నవ్య నిర్వచనం ఇచ్చి అద్భుతంగా నిర్మిస్తారు” అన్నారు. కొందరు అప్పట్లో.

కాని అటువంటి అద్భుతాలు ఏమీ కనబడలేదు. సరిగదా 1956 లో చిత్ర నిర్మాణకళ ఉండతగు స్థాయిని కూడా కొన్ని పౌరాణికాలు అందుకొనలేకపోయాయి. ఇందుకు కారణం చేతగానితనం కాదు. “బాక్సాఫీస్ గాడీ” నడుస్తుందనపించిన గాడి. ఆ గాడిలో వెళ్ళి, పాతపద్ధతిలోనే. పద్యాలూ, పాటలూ సహా సిసలైన నాటకాల నకలుగా చిత్రాలు నిర్మించడం జరిగింది. నాటకాలకీ వాటికీ తేడా ఒక్కటే. నాటకాలలో పద్యం ప్రారంభానికి సంకేతంగా బొయ్ మని ఈల వినబడుతుంది. నాలుగున్నరలో నాద నామక్రియ అందుకో అని నటుడు హార్మోనిస్టును హెచ్చరిస్తాడు.

ఈ చిత్రాలలో అవి లేవు.

పోతే, 1956 సాధించిన అభివృద్ధిలో భాగం అయిన హిందీ సంగీతపు మట్లు డాన్సులు దిగుమతి అయ్యాయి. చిత్రనిర్మాణం ఎలా ఉన్నా, వీటిలో ఆయాపాత్రలు నిర్వహించిన నటీనటులు చాలవరకు తమవిధులను ప్రతిభావంతంగా నిర్వహించారు.

* * *

ఈ సంవత్సరం రెండు చిత్రాలు విడుదల చేసిన సంస్థ ఒకటే. అది విక్రం ప్రొడక్షన్స్. శ్రీ బి. ఎస్. రంగా ఈ సంవత్సరారంభంలో “తెనాలి రామకృష్ణ”, సంవ

(55-వ పేజీ చూడండి)

1956 లో 32 చిత్రాలు

తెనాలి రామకృష్ణ (విక్రం ప్రొడక్షన్స్-దర్శకుడు —బి. ఎస్. రంగా)
నాగుల చవితి. (ఎ. వి. ఎం., చిత్రపు నారాయణమూర్తి)
* నాగపంచమి (శ్రీ రాజరాజేశ్వరి; కడారు నాగభూషణం)
ఆలీబాబా (మోడర్న్ థియేటర్స్-టి. ఆర్. సుందరం)
ఏది నిజం? (ప్రతిభ; ఎస్. బాలచందర్)
కనకతార (గోకుల్; ఎస్. రజనీకాంత్)
చింతామణి (భరణీ; పి. రామకృష్ణ)
భలేరాముడు (నరసు; వేదాంతం రాఘవయ్య)
జయం మనదే (రాజశ్రీ; తాతినేని ప్రకాశరావు)
సొంత వూరు (జి. వి. ఎస్; ఇ. ఎస్. ఎన్ మూర్తి)
హరిశ్చంద్ర (రాజ్యం; జంపన చంద్రశేఖరరావు)
ఇలవేలుపు (లక్ష్మి; యోగానంద్)
* అమరజీవి (సమతా; తాతినేని)
ముద్దుబిడ్డ (అనుపమ; తిలక్)
ఉమాసుందరి (జూపిటర్; లంక సత్యం)
చిరంజీవులు (వినోదా; వేదాంతం రాఘవయ్య)
శ్రీ గౌరీ మాహాత్మ్యం (మహీ; యోగానంద్)
మేలుకొలుపు (ఆనందా; కె ఎస్. ప్రకాశరావు, లంక సత్యం)
బాల సన్యాసమ్మ (జోయా; పి. సుబ్బారావు)
సదారమ (శంకర్; కె. ఆర్. సీతారామశాస్త్రి)
* రక్తకన్నీరు (నేషనల్; కృష్ణన్ పంజు)
పెంకిపెళ్లాం (సాహిణీ; కె. కామేశ్వరరావు)
చరణదాసి (లలితా; తాతినేని)
* సాహసవీరుడు (కృష్ణా; యోగానంద్)
* పరాశక్తి (ఎ. వి. ఎం.; కృష్ణన్ పంజు)
భక్త మార్కండేయ (విక్రం; బి. ఎస్. రంగా)
* టౌన్ బస్ (జైరాం; జగన్నాథ్)
సతీ సావిత్రి (వరలక్ష్మి; కె నాగభూషణం)
* బావామరదలు (మణి ప్రొడక్షన్స్)
* గులేబకావళి (మద్రాస్ సినీకార్పొరేషన్)
* విధి విలాసము (శరవణభవ & యూనిటీ)
* సి. ఐ. డి. (నీలా ప్రొడక్షన్స్)

* గురుతుగల చిత్రాలు తమిళం నుండి డబ్ చేసినవి

చిత్ర సమీక్ష :

సాహిణీవారి "పెంకిపెళ్లాం"

"ఇంతోటి మొగుడూ ఉన్నా ఊడినా ఒకటేలే" అని నిష్కారంగా పలివితూలవాడి, పట్లూ జేలా నాన్న చేతి చింపకాయ చెల్లిన తిన్న "చిన్నారితల్లి" దారికిరావడం సాహిణీవారి "పెంకిపెళ్లాం" చిత్రానికి ఒక ఇతివృత్తం. ఈ చక్కటి కథకు ఈ పక్కా ఆ పక్కా దారితప్పేవారి వృత్తాంతాలు చేరినందువల్ల, చిత్రం నవరస భరితం అయింది. అందుకని చాలాపొడుగూ అయింది. అయినా, సమర్థుడైన దర్శకుడు కమలాకర (చంద్రహారం) కామేశ్వరరావు గారి చేతిలో అది, 'మంచి' అనిపించుకో తగ్గచిత్రంగా రూపొందింది. నీతి రీతిమీద చక్కని వ్యాఖ్యానంగా భాసించింది.

సినిమా కష్టాలూ, కోపతాపాలూ, నేపథ్యగీతం తప్పకపోయినా, మితిమీర లేదు. ప్రయోజనాత్మకమైన హాస్యం, సమయస్ఫూర్తి, వాడితనం, పనివాడితనం ("ఎంతండి?" "వందండి," "ఇగో ఇందండి") ఉన్న ఛలోక్తులూ, కనే, వినే వారు పదే పదే చెప్పుకోతగ్గ సూక్తులూ (దురాశకొద్దీ నిరాశ) అడుగడుగునా ఉన్నాయి. ఆహ్లాదం కలిగించాయి. ఈ చిత్రానికి మాటలూ పాటలూ వ్రాసిన ఆరుద్ర ముద్ర సర్వత్రా కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ఐతే అంత్య ప్రాస లత్యంతంగా వినగా విన గారెల పామెత గుర్తుకు తెచ్చుకో బుద్ధివేస్తుంది. పోనుపోను 'మాటల గారడీ' నే 'పేరడీ' చెయ్యడం జరుగుతోందా అనిపిస్తూంది.

పాటలూ (ఆరుద్ర), వాటికి శ్రీ ప్రసాదరావు కూర్చిన వరసలూ వినడానికి హాయిగా ఉన్నాయి. బాగా తేలిక తెలుగులో మాటిగా హాయిగా మంచి చెడ్డలు తెలియ చెప్పే "ఆరుద్ర పాఠశాల" పాట చాల బాగుంది. ఇదికాక ఇంకా రెండు మూడు పాటలు బహుళ జనాదరణపొందడం బహుళ జనులకు విదితమే. చక్కని జావళి ఒకటి ఉంది.

మంచి పాటలూ, హుషారైన నృత్యాలూ (పడుచుతనపు రైలుబండి – 'లుంగళ బారదు'!) అలా ఉండగా– ఇద్దరు ముగ్గురు వ్యక్తులను కలుసుకోవడంకోసం ఈ చిత్రం చూడవచ్చు. ఒకాయన రావుబహదూర్ గోవిందరావు. రాగద్వేష రహితుడు, విరాసక్త లక్షణ లక్షితుడూ అయిన ఈ వ్యక్తిని కామేశ్వరరావు గారు ప్రతిభావంతంగా చిత్రించారు.



సూర్యకాంతం

"సహజత్వం, సౌలభ్యం"

కొత్తతనం, గొప్పతనం ఉన్న ఈ భూమికను రేలంగి చక్కగా నిర్వహించాడు. మరొక వ్యక్తి సుపరిచిత సూర్యకాంతం. ట్రంకుపెట్టె ఒకటి చంక వేసుకుని ఆ ఇంటికీ ఈ ఇంటికీ మధ్య తిరుగుతూ సూర్యకాంతం, ఈ చిత్రం పొంతం తెలుగువాతావరణం ఒప్పడానికి దోహదం చేసింది. ఆమె నటనలో సౌలభ్యం, సొంపూ ఆమెను అగ్రశ్రేణి హాస్యనటుల స్థాయికి తీసుకువెళ్లాయి. నాయకుడు రాజుగా రామారావు, అతని శ్రేయస్సుకోసం, తన సౌఖ్యం త్యాగం చేసిన అక్కగారుగా శ్రీరంజనీకూడా ఉత్తమంగా నటించారు. రమణారెడ్డి మాంత్రికుడుగా నటించాడు. రాజసులోచన నాయికగా అభినయించింది.

ప్రధానపాత్రల చిత్రణ బాగానే ఉంది కాని, పరిభాష ప్రకారం ద్వితీయశ్రేణి, ఆ తరువాత వరసలో వేషాల విషయంలో అంతే శ్రద్ధవహించినట్లు కనబడదు. అమర్‌నాథ్, నాగభూషణం, పెరుమాళ్లు, కె. వి. జోగారావు, సీత మొదలగువారు ఇతర భూమికలు నిర్వహించారు. వీళ్లు చాల వరకూ కథకి కాక, కథలో కొన్ని ఘట్టాలకే ప్రవేశపెట్టబడ్డట్లు కనబడుతుంది. నాగభూషణం మొదట్లోనే జైలుకి వెళ్తాడు. అమర్నాథ్ ఇల్లువదలి 'ఎందని' వెళ్తాడు. వీళ్లూ తదితరులూ ఉపసంహారఘట్టం (ఇది సుదీర్ఘం) లో పునర్దర్శనం ఇస్తారు.

పి. బి. శ్రీనివాస్, రాజా, రామారావు, జిక్కి, లీల మొదలగువారు ప్లేబాక్ పాడారు.

ఈ చిత్రాన్ని డిశంబరు 19 న మద్రాసు పారగన్ టాకీస్‌లో పత్రికలవారికి చూపించారు. ఇపుడిది ఆంధ్రలో నాలుగోవారం నడుస్తోంది.

★

"మీరు రోజు కన్ని సిగరెట్లు తాగుతారు?"

"ఒక టిన్నుచొప్పున."

"టిన్నెంత?"

"నాలుగున్నర!"

"ఎన్నాళ్లనించి ఇలా కాలుస్తున్నారు?"

"సుమారు 20 ఏళ్లనించి."

"రోజుకి నాలుగున్నర చొప్పున 20 ఏళ్లకి ఎంత ఖర్చయిందో ఆలోచించారా?"

"లేదు."

"చాలా అయివుంటుంది...అదుగో ఆ మేడ చూశారా?"

"చూస్తున్నా."

"మీరుకనక సిగరెట్లు కాల్చివుండకపోతే, ఆ మేడ మీదే అయివుండేది చులాగ్గా."

"మీరు సిగరెట్లు కాలుస్తారా?"

"కాల్చను."

"ఐతే ఆ మేడ మీదా?"

"హి హి. అబ్బే కాదు."

"తమాషా ఏమిటంటే, ఆ మేడ నాదే. నేనే కట్టించా."

★ బొంబాయి సినిమా లేఖ ★

(ఆంధ్రపత్రిక విలేఖరి)

శబ్ద చిత్రాలకు పంచ వింశాబ్దాలు నిండిన సందర్భంలో వైభవంగా(నే) జరిగిన వెండి పండుగ సంరంభంలో 1956 క్రమంగా అదృశ్యంకాగా నూతన సంవత్సరం ఉదయించింది.

చలనచిత్ర ధరిత్రి చరిత్రలో ఈ శబ్ద చిత్ర రజతోత్సవ సప్తాహం చిరస్మరణీయ కావడానికి, సరిగ్గా, ఇదే సమయాన వర్ణ చిత్రాల శకారంభానికి నాంది ప్రస్తావన జరుగడం.

ఈ ఉత్సవాల సందర్భంలో బొంబాయిలోని 14 థియేటర్లను శోభాయమానంగా అలంకరించి, అక్కడ ఉత్తమ శ్రేణి చిత్రాలని చెప్పుకోతగ్గ శకుంతల, డా॥ కోట్నిస్, రామశాస్త్రి, సంత్ జ్ఞానేశ్వర్, న్యూ థియేటర్స్ వారి దేవదాస్, ప్రెసిడెంట్, బ్రహ్మచారి, బంధన్, అమర్ జ్యోతి, సంత్ తుకారాం, భరత్ మిలాప్ ప్రభృతి చిత్రాలను ప్రదర్శించారు. ఉత్సవాలకు డిసెంబరు 16న శ్రీ ఎస్. కె. పాటిల్ ప్రారంభోత్సవం చేశారు.

విస్మృతిపాఠం

కొత్తసంవత్సరంలోకి దృష్టి సారించి చూస్తే, పరిశ్రమ భవిష్యత్తు అన్నివిధాలా ఆశాజనకంగా కనబడుతోంది. ప్రజలకు ఏది నచ్చుతుందో, ఏ పద్ధతులు భరించలేనివిగా ఉన్నాయో గత సంవత్సరం వివిధ చిత్రాల జయాపజయాలతో సుస్పష్టం అయినందువల్ల, ఇంక సినిమాలు తీసేవారు, సర్వవిధాలా ఉత్తమ చిత్రాల నిర్మాణానికి నిజంగా ప్రయత్నిస్తారనీ అందువల్ల ఆశించేవారి ఆశలు వమ్ముకావనీ నమ్మవచ్చును.

'ప్రజా నిజాలు'

పెద్ద పెద్ద వాళ్ళ పేర్లు పెద్దక్షరాలతో రాసి రండిరండని ఎంత గట్టిగా దండోరా వేసినా, జనం విరగబడిచూడరని తేలిపోయింది. హాస్యరత్నించిన పేరు, పేరత్నించేహోరూ మాత్రమే ప్రత్యేకాకర్షణ అయితే ఎవరూ మోసపోరు. చెల్లించిన ప్రతిచిల్లు కానీకి తగిన విలువఉండేటేనే చిత్రాన్ని ఆదరిస్తారు. డిస్ట్రిబ్యూటర్లు ఇటుపై కూడా తారాబలంమీదనే మోజుపడి, పట్టుపట్టితే, "కరువాయికథ" వెండితెరమీద ఏమంత అఖండంగా ప్రకాశిస్తుందనిపించదు.

శాంతారాం ఆదర్శం

ఈవిషయమై ప్రముఖ దర్శకనిర్మాత శాంతారాం ఇదివరకే కొన్ని సార్లు హెచ్చరిక చేశారు. ఆయన చెప్పిన మాటని అనుసరించి, సత్ఫలితం సాధించి నిరూపించారుకూడా. ఆయన చెప్పినమాటలు:

"నిర్మాతలు గిరాకీఉన్న పెద్దతారలే ఉండితీరాలన్న మోజుతో, పెద్ద పెద్ద సొత్తు వారికి "బ్లాక్ మనీ" చెల్లించడం తగదు. అలాచెయ్యాలంటే, పెట్టుబడి తెచ్చుకోవడానికి బోలెడు వడ్డీలు పొయ్యాలి. అంతడబ్బు పెట్టాక అదిరావచ్చు పోవచ్చు.

"అంతేకస్టార్ వాల్యూని నమ్ముకుని భారీ ఖర్చుతో చిత్రం నిర్మించడంకన్న, కొత్త తారలతో కొద్ది ఖర్చులో నిర్మాణానికి పూనుకోవడమే వెయ్యిందాల మెరుగు క్షేమకరం.

"నామటుకు నా సంగతి చెబుతాను. నేను "ఝనక్ ఝనక్ పాయల్ బాజే"ను నిర్మిస్తున్న రోజుల్లో అగ్రశ్రేణి నటీనటులను వదిలి అనామకులను తెచ్చుకోవడమేమిటంటూ, నా మిత్రులూ, శ్రేయోభిలాషులూ పలువురు మందలించబోయారు. హెచ్చరించారు.

"నష్టం వస్తే మరేం పరవాలేదన్న తెగింపుతో వల్లపూసల మల్లెమనః దొంకుండా, దొరికినా మురిపించి తప్పించుకు పోయే నటులకన్న, అన్నవేళకి సెటుమీదకొచ్చి, చెప్పినట్టు విని పనిచేసేవాళ్ళే మెరుగన్న గట్టి నమ్మకంతో నేను, నాకు తోచిన రీతిని ఆ చిత్రాన్ని నిర్మించాను.

"నా సంగతి అలా ఉంచగా మాఅబ్బాయి దర్శకత్వం వహించిన తొలిచిత్రానికి (తూఫాన్ ఔర్ దీయా) కూడా కొత్త నటీనటులను నియమించాను. నా కుమారుడు చేపట్టే తొలిచిత్రానికి ధోకా ఉండకూడదని నేను తండ్రిగా వాంఛిస్తాను నిజమే, అసలందుచేతనే నేను చిత్ర విజయానికి కథ, అందులో అంశాలూ తారలకన్న ముఖ్యం అని ఎంచి, అందుకు అనుమతించి, ఆ చిత్రం నిర్మింప చేశాను."



మాడర్న్ థియేటర్స్‌వారి "వీరకంకణం"లో జమున, జగ్గయ్య.

బొంబాయి సినిమా లేఖ

ఇదీ నిజం. నిజమైన నిజం. ఇంకో ఇంకోచోట ఎలా ఉన్నా, మన ఈ దేశంలో మటుకు, ఆలోచన రేకెత్తించే మంచి కథకే ప్రాధాన్యం ఉంటుంది. తారల పేరులూ, బాక్సాఫీస్ పరిభాష ప్రకారం సెక్స్ అపీల్, గ్లామర్ ఉన్నంతమాత్రాన, చెత్త చిత్రాలను జనం విరగబడి చూడరు.

తారాబలం బలాన్ని తగ్గించివేసే మరొక అంశం పార్లమెంటులో మొన్న ప్రతిపాదించబడ్డబిల్లు. ఆ బిల్లుద్వారా పెట్టుబడి కార్పొరేషన్ ఒకటి నెలకొనబోతున్నది. ప్రభుత్వం ప్రమేయంతో నెలకొంటున్న సంస్థ కాబట్టి అక్కడివారు బ్లాక్ మార్కెట్ బేరాలంటే సరదాపడి ప్రోత్సహించడానికి ముందుకు ఉరకరు. అక్కడ అప్పుతీసుకునే వాళ్లు తారలకు "బ్లాక్ మనీ" చెల్లించడానికి అవకాశం ఉండదు. మరోచోట ఎక్కువ వడ్డీకు డబ్బుతెచ్చుకు చిత్రాలు తీసేవారికి, తక్కువ వడ్డీతో ఇక్కడ తీసుకునేవారు తీసే చిత్రాలపోటీ తట్టుకోవడం చాలా కష్టం అవుతుంది.

అందువల్ల మొత్తంమీద కొత్త సంవత్సరం గొప్ప పరిణామాలు రావసంభవరారనవచ్చును.

*   *   *

కొత్త సంవత్సరంలో కొత విశేషం విదేశీయ నిర్మాతలు పలువురు మనదేశంలో, మనవారితో కలిసి గాని, స్వతంత్రంగాగాని చిత్రాలు నిర్మించడం.

ఇప్పటికే నిర్మాణంలోఉన్న చిత్రాలలో "పరదేశి" ఒకటి. ఇది భారత రష్యాల సంయుక్త నిర్మాణం. నర్గీస్, పద్మిని, సోవియట్ నటుడు ఆలెగ్ స్ట్రిజనోవ్ నటిస్తున్నారు.

మరొకటి తాయ్ ప్రభుత్వం ఇక్కడ నిర్మిస్తున్న బౌద్ధచిత్రం అంగులిమాల. దర్శకుడు విజయభట్. భరత్ భూషణ్, నిమ్మి ముఖ్యభూమికలు నిర్వహిస్తున్నారు. చిత్రం పూర్తి కావచ్చింది.

ఇప్పుడు, యూరప్‌లో అగ్రశ్రేణిదర్శకులిద్దరు భారతీయం అయిన కథలు తీసుకు ఇక్కడ చిత్రాలు నిర్మించ సంకల్పించారు. వారిలో ప్రముఖ ఫ్రెంచి దర్శకుడు క్రిస్టియన్ జాక్ ఒకరు. గంగానదీ ముఖద్వారం కథాస్థలంగా ఈయన చిత్రం నిర్మించవచ్చునట. ఈయనభార్య, ప్రముఖ ఫ్రెంచి నటి అయిన మార్టిన్ కెరాల్ ఇందులో నటిస్తుందట.

జాన్ (భవానీ జంక్షన్) మాస్టర్స్ వ్రాసిన "డిసీవర్స్" అనే నవల ఆధారంగా ఆర్థర్ రాంక్ సంస్థ పేరిట వచ్చే వేసంగుల్లో ఇక్కడొక చిత్రం నిర్మించడానికి జాన్ బ్రియాన్ సన్నాహాలు చేస్తున్నారు.

నూరేళ్ళనాడు, మనదేశంలో చెలరేగిన థగ్గుల దుండగాల కాలంలో, ఈస్టిండియా కంపెనీకి చెందిన ఒక అసిస్టెంట్ కమిషనర్ వారి నెదిరించి నిర్మూలించబోయి చిక్కుల్లో పడటం, చివరికి అతని భార్య అతడిని రక్షించటం దీనికి ఇతివృత్తం. భార్య భూమికను బహుశా ఒక భారతీయనటి నిర్వహించగలదని తెలుస్తోంది.

ఇవి ఇలావుండగా, ప్రముఖ ఇటాలియన్ దర్శకనిర్మాత రాబర్టో రాసెలినీ, భూదానోద్యమాన్ని ఆధారం చేసుకొని ఒక చిత్రం నిర్మించడానికి వచ్చారు. ఆయన భార్య ఇన్‌గ్రిడ్ (స్ట్రాంబోలీ) బర్గ్‌మన్ కూడా త్వరలోనే రాబోతోంది.

ఇక, దేశీయ నిర్మాతలలో పలువురు భారీ ఎత్తున చిత్రనిర్మాణాలకు పూనుకొన్నారు. శాంతారాం "దో ఆంఖే, బారా హాత్" (రెండుకళ్ళు పన్నెండు చేతులు) అనే బ్రహ్మాండమైన చిత్రం తీస్తున్నారు. నాట్యతార సంధ్య ముఖ్యభూమిక నిర్వహిస్తోంది. కేశవ్ రావ్ దాతే, బాబూరావ్ పెండార్కర్, ఉల్హాస్ ప్రభృతులు పాల్గొంటున్నారు సంగీతం వసంత్ దేశాయ్ సమకూర్చుతున్నారు.

పెద్దఎత్తున తయారవుతున్న మరో చిత్రం "ఆశా". దీన్ని తమిళంలో కూడా నిర్మిస్తున్నారు. వైజయంతిమాల నటిస్తోంది. దర్శకుడు, నిర్మాత ఎం. వి. రామన్.

చురుకుగా తయారవుతున్న మరో చిత్రం బసుచిత్రమందిర్ వారి "ఏక్ గాఁవ్ కీ కహానీ" ఇందులో నిరూపరాయ్, అభిభట్టాచార్య, మాలాసిన్హా, తలత్ మహమూద్, లలితా పావర్, బిపిన్‌గుప్త, ధుమాల్, ఐ. ఎస్. జొహార్ పాల్గొంటున్నారు.

ఖరారైన బాక్సాఫీస్ హిట్ అని అభిజ్ఞులు చెబుతున్న మరో చిత్రం "ఖైదీ". తిరువాన్కూర్ నాట్యతార పద్మిని ఇందులో నాయిక. సంగీతదర్శకుడు ఓ. పి. నయ్యార్. ★



గురుదత్ చిత్రం "ప్యాసా"లో మాలాసిన్హా.



పొన్నలూరి బ్రదర్స్ నిర్మిస్తున్న "భాగ్యరేఖ" చిత్రంలో రేలంగి, జానకి, జమున.

★ సింహావలోకనం ★

(51-వ పేజీ తరువాయి)

త్సరాంతంలో "భక్త మార్కండేయ" విడుదల చేశారు. కట్టుదిట్టమైన పద్ధతులలో, కార్యదీక్షతో పనిచేసేవారిలో ఆయన ఒకరు. ఆయన ఈఏడాది కోడంబాకంలో స్వంతంగా ఒక స్టూడియో కూడా నిర్మించారు. క్రమంగా అక్కడ రంగుచిత్రాల నిర్మాణానికి కావలసిన హంగులన్నీ కూడా సమకూర్చుకొని, ఛత్రపతి శివాజీ కథను చిత్రంగా నిర్మించడానికి కృషి చేస్తున్నారు. సారథీవారు హైదరాబాద్‌లో స్టుడియో నెలకొల్పడం జరిగింది.

ఈ ఏడాది విజయ, సారథీ, వాహినీ, అన్నపూర్ణా, నేషనల్ ఆర్ట్ థియేటర్స్ వారి చిత్రాలేవీ రాలేదు.

విజయవారు శశిరేఖ పెళ్లి కథను 'మాయాబజార్' పేరిట భారీఎత్తున నిర్మించడంలో నిమగ్నులై ఉన్నారు. కొత్తసంవత్సరం ప్రథమ పాదంలోనే ఈ చిత్రం విడుదల కావచ్చునంటున్నారు.

ఈ ఏడాది విడుదల అయిన చిత్రాలలో కొత్తకంపెనీలు నిర్మించినవి 'జయం మనదే' (రాజశ్రీ), ఇలవేలుపు (లక్ష్మి), సొంతవూరు (జి. వి. ఎస్), ముద్దుబిడ్డ (అనుపమ).

తెలుగువారికి దర్శకులుగా పరిచితులైన వారు. శ్రీ ఇ. ఎస్. ఎన్. మూర్తి (సొంతవూరు), శ్రీ తిలక్ (ముద్దుబిడ్డ).

మరొకరు తమిళ దర్శకుడు ఎస్. బాలచందర్. దర్శకుడుగా ఈయన తమిళసీమలో పేరు గడించుకొన్న వాడేగాని, తెలుగు చిత్రం దర్శకుడుగా ప్రతిభావారి "ఏది నిజం"ద్వారా తొలిసారిగా పరిచితుడయ్యాడు

కొత్త విషయాలు

మరో విశేషం, ఒక తమిళ నటి తెలుగు చిత్రాలలో నాయకగా కనుపించడం. ఈమె వరలక్ష్మి రాజసులోచన. (సొంతవూరు, పెంకిపెళ్లాం). ఇంతకాలం తెలుగు నటీనటులు ఎక్కువగా తమిళ చిత్రాలలో నటించడం జరుగుతోంది. ఇలా భాషాభేదాలు క్రమంగా సన్నగిలడం ముదావహమైన విషయం.

రాజకీయంగా భేదాలు ఎలాఉన్నా, చలనచిత్ర సీమలో మటుకు నిజానికి, ఈ భేదాలు ఏనాడూ అంత ఎక్కువగా లేవు. ఇప్పుడు ఇంకా తగ్గుతున్నాయి. ఒకనిర్మాత ఒక చిత్రం తెలుగులో తీసినప్పుడు, దాన్ని దరిమిలా డబ్ చేయడం బదులు, పనిలో పనిగా తమిళ ప్రతిని తమిళ తారలతో 'షూట్' చేయడం జరుగుతోంది. అలాగే తమిళసంస్థలు కూడా సాగిస్తున్నాయి.

అయితే ఆయా చిత్రాలలో ఆయా ప్రాంతాల ఆచార సంప్రదాయాలూ, సంస్కృతి వేషభాషలూ వికటించకుండా జాగ్రత్త తీసుకున్నంతకాలం, ఈ పద్ధతి ఆర్థికంగానూ, తదన్యంగానూకూడా వాంఛనీయం అవుతుంది. అప్పుడది సర్వవిధాలా ఫలదాయని కాగలదు కూడా.

చిత్రనిర్మాణంస్థాయి, ఖర్చులు పెరిగినప్పుడు వాటితోపాటు, విపణుల అవధులు కూడా విస్తృతం కావడం వాంఛనీయమే కాదు; అవసరంకూడా. ఇది జరగాలంటే ఒక ప్రాంతంవారు నిర్మించిన చిత్రం మరొక ప్రాంతంవారిని ఆకర్షించేదిగా ఉండాలి.

ఇందుకు సంబంధించిన అంశాలలో ముఖ్యమైనది చిత్రం నిడివి. పదివేల అడుగుల సెల్యులాయిడ్ ద్వారా చెప్పదగు కథను, పద్దెనిమిది వేలకు సాగదీయడంవల్ల, అన్య ప్రాంతాలలో విడుదలకు అఖండమైన

★ నెహ్రూ శాంతి దౌత్యం ★

(9-వ పేజీ తరువాయి)

నికి అమెరికా కనీసం సుముఖతనైనా త్వరలో ప్రకటిస్తే నెహ్రూ శాంతి దౌత్యం ఫలించినట్లవుతుంది.

ఇక ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వలస ప్రాంతాల సమస్య, దూరప్రాచ్యంలో చైనా సమస్య ఉన్నాయి. వీటి ప్రసక్తి కూడా నెహ్రూ, ఐసెన్‌హోవర్ల చర్చలలో వచ్చివుంటుందనే అభిజ్ఞులు భావిస్తున్నారు. ఎందుచేతనంటే ఈ సమస్యలకు కూడా ప్రపంచశాంతితో ప్రత్యక్ష సంబంధమున్నది. శాంతి లాగానే స్వాతంత్ర్యం కూడా అవిభాజ్యమైనది. ప్రపంచంలో కొన్ని స్వతంత్రదేశాలు, కొన్ని అస్వతంత్ర దేశాలు అని ఉన్నంతకాలమూ శాంతికి సుస్థిరత చేకూరనేరదు. వలస పరిపాలన శకం అంత్యదశలో ఉన్నది. అయితే ఈ శకం హింసాత్మకంగా కాక శాంతియుతంగా అంతరించేటు చేయవలసిన బాధ్యత వలసరాజ్యాలపైనా, అమెరికావంటి అగ్రరాజ్యాలపైనా ఉంది. అమెరికా ఈ విషయంలో కూడా పూర్వపు నైతిక దృక్పథాన్నే తిరిగి అవలంబించినట్లయితే అమెరికా ప్రతిష్ఠ ఇనుమడించగలదు.

చైనా గుర్తింపు

చైనా విషయమై కూడా అమెరికా తన వైఖరి మార్చుకోవలసి ఉంది అరవైకోట్ల ప్రజలకు ఆకరమైన చైనాను సమితినుంచి వెలివేసి ఉంచడం, ఫార్మోసా ప్రభుత్వాన్నే చైనా ప్రభుత్వంగా గుర్తించడమూ వాస్తవికత అనిపించుకోదని ప్రధాని నెహ్రూ చాలాసార్లు హెచ్చరించారు. రష్యాలో విప్లవాన్ని గుర్తించడానికి అమెరికా చాల ఏళ్లు తిరస్కరించినట్లే చైనీస్ విప్లవాన్ని గుర్తించడానికి కూడా ఏడేళ్లుగా నిరాకరిస్తోంది కాని చివరకు రష్యాను, గుర్తించినట్లే చైనాను కూడా గుర్తించక తప్పదు. ఈ గుర్తింపు ఎంత త్వరగా జరిగితే అంతగా దూరప్రాచ్యంలో సుస్థిరత నెలకొంటుంది.

అయితే ఇవన్నీ వెంటనే జరుగుతాయనీ, అమెరికా వైఖరిలో మార్పు త్వరలో వస్తుందనీ ఆశించడం ఊహాగానమే కావచ్చు. తమ చర్చలవల్ల ఏవో పెద్ద మార్పులు వస్తాయని ఆశించవద్దని ప్రధాని నెహ్రూ ముందే హెచ్చరిక చేశారు. భారత, అమెరికా ప్రభుత్వాలమధ్య, ప్రజలమధ్య స్నేహభావాన్ని దృఢతరం చేయడానికి, పరస్పరం అర్థం చేసుకోడానికి మాత్రమే తాను అమెరికా వెడుతున్నానని ఆయన తెలిపారు. చర్చల ఉద్దేశం ఇదే అయితే అవి ఫలించడానికి అవరోధాలేమీ లేవు. అలాకాక వీటి ఫలితంగా ముందుముందు అమెరికా విదేశాంగ విధానంలో మార్పులేవైనా సంభవించేటట్లయితే, నెహ్రూ సహృద్రాయబారం ప్రపంచశాంతి దృష్ట్యా అమూల్యమైన ఫలితాలను సాధించినట్లవుతుంది.

—“గాండీవి” ★

భీమవరం కళాశాల పూర్వవిద్యార్థి సమాఖ్య

పై సంఘ వార్షికోత్సవం జనవరి 6న జరుగును వక్తలుగా ఆచార్య శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య, పెద్దాడ రామస్వామి విచ్చేయుచున్నారు. ఇదే ప్రత్యేకాహ్వానముగా భావించి మీ చందా పంపి, సమావేశానికి వచ్చి జయప్రదము చేయ ప్రార్థితులు.

సింహావలోకనం

యోగ్యత లభించదు. పొడుగు చిత్రాలపట్ల విముఖత దక్షిణభారతంలో కూడా క్రమంగా పెరుగుతోంది.

బొంబాయి చలనచిత్రాల నిడివి 14 వేలు దాటటంలేదు. పన్నెండువేలు దాటరాదని ఆమధ్య ఎగ్జిబిటర్ల సభలో కోరుతూ తీర్మానం చేశారు.

ఇలా హఠాత్తుగా పొడుగు తగ్గించి వేయడం ఏ ఒక్కరూ సాహసించి మార్గదర్శకులైనంతమాత్రాన జరగదు.

అందరూ కలసి ఒక నిర్ణయం చేసుకున్నప్పుడే ఇది సవ్యంగా సాగుతుంది. ఇది సాధ్యమైననాడు, చిత్రనిర్మాణవ్యయం చెప్పుకోతగినంతగా తగ్గిపోతుంది

బాధ్యతగలనిర్మాతలూ డిస్ట్రిబ్యూటర్లూ, వ్యక్తిగతంగాను సమష్టిగాను ఆలోచించుకొని ఈ విషయమై క్రమక్రమంగానైనా తగు పరిణామాలు వచ్చేటట్లు కొత్త సంవత్సరంలో కృషిచేయడం వాంఛనీయం. ★



హైదరాబాద్, సికిందరాబాద్ నగరాలలోని మొత్తం 28 కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు డిసెంబరు 7 మొదలు 10-వ తేదీ వరకు ఆంధ్రాభ్యుదయోత్సవాలు జరుపుకున్నారు. ఈ ఉత్సవాలు ఇప్పటికి ఆరేళ్ళనుంచీ జరుగుతున్నవి. విద్యార్థులు, విద్యార్థినులు, ఇతర ప్రేక్షకులు దాదాపు 10 వేలమంది పాల్గొని ఈ సప్తమవార్షికోత్సవాన్ని జయప్రదంగా జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖమంత్రి శ్రీ సంజీవయ్య ప్రసంగిస్తున్నప్పటి చిత్రం. శ్రీ చెరుకువాడ వెంకటనరసింహంగారు, అఖిల కళాశాలాంధ్ర విద్యార్థిసంఘ కార్యదర్శి శ్రీ జె. జగన్నాధరావు పక్కన ఆసీనులై వున్నారు.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 Editor S Sambhu Prasad.



గౌరిశంకరులు

ఫొటో: కమ్రుద్దీన్‌ఖాన్ - కటక్.


'అనాసిన్'
చాల ఉత్తమమైనది అది నాలుగు
మందులను గలిగియున్నది
1. క్వినైన్ సల్ఫేట్ 2. ఫినాసిటిన్
3. కఫీన్ 4. అసిటిల్ సాలిసిలిక్ ఏసిడ్
'అనాసిన్'— గొప్ప బాధానివారిణి —వైజ్ఞానికంగా కూర్చబడిన నాలుగుమందులను గలిగియున్నది, అవి నరముల వ్యవస్థానము నందు సంయుక్తచర్యను జరిపి, తలనొప్పులు, జలుబులు, జ్వరము, దంతబాధ, కండ నొప్పులనుండి రూఢిగా, సురక్షితమైన శీఘ్రవిముక్తిని గలిగించును. బాధానివారణకు 'అనాసిన్' కంటె అతివేగముగా పనిచేయునట్టిది మరేదీ లేదు. సేవించుటకు 'అనాసిన్' కంటె అతిసురక్షితమైనట్టిది మరేదీ లేదు జ్ఞాపకముంచు కొనుడు! 'అనాసిన్' వైద్యుని ఔషధయోగము వంటిది. అది గుండెలకు హానిగాని కడుపు ఉబ్బరముగాని కలిగించదు. 'అనాసిన్' లక్షలాది జనులకు బాధానివారిణి ఎందుకనగా ప్రతివారున్ను 'అనాసిన్' ను కొనగలరు.
ఒక ప్యాకెట్ ధర 2 అణాలు మాత్రమే
నాలుగు మందుల
సూత్రమైన
'అనాసిన్'
వాడుడు
WILL NOT UPSET THE STOMACH
DOES NOT HARM THE HEART
ANACIN
TRADE MARK REGISTERED
TABLETS
GEOFFREY MANNERS & COMPANY PRIVATE LIMITED
MAGNET HOUSE, DOUGALL ROAD, BOMBAY
WHITEHALL PHARMACAL COMPANY, NEW YORK U.S.A.
V 101.